అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సోమవారం 06-05-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 76 Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar 12 పేజీలు వెల : 6.50

హానికరంగా పదేండ్ల బీజేపీ ట్రైలర్



మళ్లీ మోడీ గెలిచి.. సినిమా చూపిస్తే ఘోరమే

- తెలంగాణలో కమలంపార్టీకి ఒక్క సీటు కూడా రానివ్వం
- 200 సీట్లు వచ్చే పరిస్థితి లేక ఆ పార్టీ ఆశలు సన్నగిల్లాయి
- కాళేశ్వరం అక్రమాల్లో కేంద్రానిది ప్రధాన పాత్ర
- ప్రజా సమస్యలు విస్మరిస్తే రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యమిస్తాం
- జాతీయ పార్టీ నిర్ణయం మేరకే భువనగిరిలో పోటీ : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు

విభజన హామీల అమలులో నిర్లక్ష్యం

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

పదేండ్ల బీజేపీ పాలన ట్రైలరే ఇట్లుంటే.. ఇక మళ్లీ గెలిస్తే సినిమా ప్రమాదకరంగా ఉంటుందని, దేశ ప్రజలకు భంగపాటు తప్పదని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. అందుకే తెలంగాణలో ఒక్క సీటు కూడా బీజేపీని గెలవనీయబోమని స్పష్టం చేశారు. తాము బలంగా ...11లో



తెలంగాణలో పదికిపైగా స్థానాలు గెలుస్తాం

- 400పైగా సీట్లతో మళ్లీ కేంద్రంలో అధికారంలోకి బీజేపీ : కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా

నవతెలంగాణ-కాగజ్‌నగర్

రాష్ట్రంలో పదికిపైగా ఎంపీ స్థానాలు, కేంద్రంలో 400 స్థానాలు బీజేపీ దక్కించుకోవడం ఖాయమని, మూడోసారీ మోడీ సర్కార్ ఏర్పాటు కాబోతోందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గొడం నగేష్‌కు మద్దతుగా ఆదివారం కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్‌లోని ఎస్పీఎం క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన జనసభలో అమిత్ షా పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో బీజేపీ క్రమక్రమంగా తమ ఓటుశాతాన్ని పెంచుకుంటూ వస్తోందని, విజయం సాధించనున్న పదిస్థానాల్లో ఆదిలాబాద్ ఎంపీ స్థానం ఉంటుందన్నారు. దేశ ఔన్నత్యాన్ని కాపాడాలనే ఆకాంక్షతో ప్రధాని మోడీ పండుగ రోజుల్లో సైతం విరామం ...11లో

జూన్ 6 తర్వాత సర్దుకోవాల్సిందే

- రేవంత్‌రెడ్డి చెవులు నిక్కరించి విను
- కేసులకు భయపడను..హైకోర్టుకెళ్లి ఎదుర్కొంటా
- ఈటల బలమైన బీసీ నేత : అమిత్‌షా

వివరాలు 10లో

ఇండియా బ్లాక్ పావులుగా ముస్లింలు

ప్రధాని మోడీ



సీతాపూర్ (యూపీ) : కాంగ్రెస్, ఇండియా బ్లాక్‌లు తమను పావులుగా వాడుకుంటున్నాయని ముస్లింలు ఇప్పుడు అర్థం చేసుకున్నారని ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం వ్యాఖ్యానించారు. బీజేపీ చేస్తున్న అభివృద్ధిని చూసిన తర్వాత వారు ఆ రెండింటికీ దూరంగా వుంటున్నారని అన్నారు. దౌరహరలో బీజేపీ అభ్యర్థికి మద్దతుగా ఎన్నికల సభలో ఆయన ప్రసంగిస్తూ, నిరుపేదలు, ...11లో



రాజ్యాంగాన్ని మార్చే కుట్ర

రిజర్వేషన్లు తొలగించేందుకు బీజేపీ ప్రయత్నం

- బడుగు, బలహీనవర్గాల హక్కులు లాక్కొంటోంది
- ధనికులకు రూ.16లక్షల కోట్లను మోడీ మాఫీ చేశారు
- తెలంగాణ పథకాలు దేశవ్యాప్తంగా అమలు
- ప్రతి మహిళా ఖాతాలో ఏటా రూ.లక్ష జమ : నిర్మల్, గద్వాల జనజాతర సభల్లో.. ఏఐసీసీ నాయకులు రాహుల్‌గాంధీ

దేశంలో అభద్రతలో మైనార్టీలు

నవతెలంగాణ- ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధులు

దేశంలో బడుగు, బలహీన వర్గాలకు హక్కులు కల్పిస్తున్న రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర జరుగుతోందని, ఇదే జరిగితే రిజర్వేషన్లు తొలగిపోతాయని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. వెనుకబడిన తరగతులు, దళితులు, గిరిజనులు, మైనార్టీల హక్కులను బీజేపీ లాక్కొనే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశంలో రాజ్యాంగ విధ్వంసానికి, ప్రజల హక్కుల పరిరక్షణకూ మధ్య యుద్ధం జరుగుతోందని చెప్పారు. కొద్ది మంది ధనికులకు లాభం చేసేందుకే మోడీ పనిచేస్తున్నారని, 22 కార్పొరేట్ కుటుంబాలకు రూ.16లక్షల కోట్ల రుణాలు మాఫీ చేశారని, అదే తాము రైతులకు రుణమాఫీ చేస్తామంటే రైతులను సోమరిపోతులను ...11లో

9 లోపు అందరికీ రైతుభరోసా

- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



రాష్ట్రంలో రైతు భరోసా రానివారందరికీ ఈ నెల 9లోపు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని, ఇది వరకు చెప్పినట్లుగానే ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణ మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలు అమలు కావడం లేదని మాజీ మంత్రి కేటీఆర్ అంటున్నారని, ఆయన చీరకట్టుకొని ఆర్టీసీ బస్సు ఎక్కాలని, అక్కడ జీరో టికెట్ ఇస్తారని.. అప్పుడు అమలవుతున్నాయో లేదో ఆయనకు తెలుస్తుందని అన్నారు. ఆదిలాబాద్‌లో సిమెంట్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని, ప్రాజెక్టులు నిర్మించి సస్యశ్యామలం చేస్తామని ...11లో



బీజేపీకి వ్యతిరేక గాలి

- ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి : విశాఖలో సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కరత్

విశాఖ : దేశంలోని అత్యధిక రాష్ట్రాల్లో బీజేపీ వ్యతిరేక గాలి వీస్తోందని, గడచిన పదేండ్లలో ఎన్‌డీఏ పాలనలో అధిక ధరలు, ప్రభుత్వ రంగ సంస్థల విధ్వంసానికి పాల్పడుతూ దేశాన్ని ప్రమాదంలో పడేసిందని, దేశ రక్షణ, ప్రజల అజెండాతో ఇండియా వేదిక 2024 ఎన్నికల్లో అధికారంలోకి రానుందని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కరత్ వెల్లడించారు. ఉత్తరాంధ్రలో ఇండియా వేదిక తరపున ప్రచారానికి విచ్చేసిన ఆమె ఆదివారం ఉదయం విశాఖలోని సీపీఐ(ఎం) కార్యాలయం (ఎన్‌పిఆర్ భవన్)లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రసంగించారు. సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి, గాజువాక అభ్యర్థి ఎం.జగ్గునాయుడు, కాంగ్రెస్ పార్టీ తరపున విశాఖ పార్లమెంట్ బరిలో దిగిన సత్యారెడ్డి, పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థి విమల అభ్యర్థిత్వాలకు మద్దతుగా తాను విచ్చేశానన్నారు.

ఏపీకి విభజన హామీలైన ప్రత్యేక హెూదా, విశాఖకు రైల్వేజోన్, పోలవరం ప్రాజెక్టు అమలులో బీజేపీ విఫలమైందని బృందా ఎద్దేవా ...10లో

ఇండియా కూటమిని గెలిపించాలి

సీపీఐ(ఎం) ఎన్నికల సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

- ఇండియా కూటమి పేరు వింటేనే మోడీకి చెమటలు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య



నవతెలంగాణ-మహబూబాబాద్

దేశ సమైక్యత, సమగ్రత కోసం దేశంలో జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బాలాజీ గార్డెన్‌లో కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ గెలిపించాలని కోరుతూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికల సభలో మంత్రితో పాటు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. తప్పు చేసిన వారిని ఎండగట్టి నిలదీసేది సీపీఐ(ఎం)యేనని అన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ తప్పు చేసినా నిలదీసి ప్రజల కోసం నిలబడగలిగేది వామపక్షాలేనని అన్నారు. వామపక్ష పార్టీల మొదటి తరం నాయకులతో కలిసి పనిచేసిన రోజులు, అనుభవాలు తనకు ఉన్నాయని గుర్తు చేశారు. దేశం కోసం, దేశ రక్షణ కోసం, దేశ భవిష్యత్తు కోసం ఇండియా కూటమిని ఐక్యం చేసి ఈరోజు ఎన్నికల్లో ముందుకు దూసుకుపోవటంలో సీపీఐ(ఎం) పాత్ర ఎంతో ఉందని కొనియాడారు. కులాలు, మతాల పేరుతో ప్రజలను విచ్ఛిన్నం చేస్తూ వారి ...12లో



ఆరు గ్యారంటీలేమాయే

కరువు తెచ్చిన కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి

- మోడీ పనితనం బాగుంటే.. రూపాయి విలువ ఎందుకు పడిపోయింది
- గోదావరి నీళ్లు తరలించుకుపోయేందుకు మోడీ కుట్ర
- తెలంగాణ హక్కులపై పోరాడాలంటే పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీలుండాలి: కేసీఆర్

వివరాలు 12లో

కష్టంగా నీట్ కెమిస్ట్రీ ప్రశ్నలు

ప్రశాంతంగా ముగిసిన నీట్ 2024పరీక్షలు

- 557 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ
- మధ్యాహ్నం 2నుంచి 5:20వరకు కొనసాగిన పరీక్ష
- 24లక్షల మందికి పైగా దరఖాస్తులు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశ వ్యాప్తంగా మెడికల్ ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్(నీట్- 2024) ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. పరీక్షను నేషనల్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహించింది. కెమిస్ట్రీకి సంబంధించిన ప్రశ్నలు కొంచెం కష్టంగా వచ్చినట్టు పరీక్షకు హాజరైన విద్యార్థులు వాపోయారు. బోటనీ, జువాలజీ, ఫిజిక్స్ ప్రశ్నలు సాధారణంగా ఉన్నాయని చెప్పారు.అయితే ఒకటి రెండు ప్రశ్నలు అవుటాఫ్ సబ్జెక్ట్ నుంచి వచ్చినట్టు విద్యార్థులు భావిస్తున్నందున వాటిపై ఎన్‌టీఏ వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. భారత దేశంతో పాటు ఇతర దేశాల్లో నీట్ పరీక్షను ...11లో



(ఫైల్)

ఏపీ డీజీపీపై బదిలీ వేటు


- తక్షణమే విధులనుంచి వైదొలగాలని ఎన్నికల సంఘం ఆదేశం

అమరావతి: జగన్‌కు అనుంగఅధికారిగా ముద్రపడిన డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిపై ఎన్నికల సంఘం ఎట్టకేలకు బదిలీ వేటు వేసింది. తక్షణమే విధుల నుంచి వైదొలగాలని పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆయనకు ఎలాంటి బాధ్యతలు అప్పగించొద్దని పేర్కొంటూ సీఎస్ జవహర్‌రెడ్డికి ఆదేశాలిచ్చింది. సోమవారం ఉదయం 11గంటల్లోగా సీనియర్ ఐపీఎస్ అధికారులతో కూడిన ముగ్గురి పేర్లను పంపించాల్సిందిగా ఈసీ ఉత్తర్వుల్లో పేర్కొంది. వీరందరికీ సంబంధించిన ఐదేళ్ల పనితీరు నివేదిక, విజిలెన్స్ క్లియరెన్స్ నివేదికల్ని కూడా కమిషన్‌కు పంపించాల్సిందిగా సూచించింది. గత కొంతకాలంగా విపక్షాల నుంచి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు రావడంతో ఈసీ చర్యలకు ఉపక్రమించింది.

డీజీపీ కేవీ రాజేంద్రనాథరెడ్డి తొలి నుంచి వైసీపీ కార్యకర్తలా పనిచేస్తున్నారన్న ...11లో

సిట్ కస్టడీకి హెచ్.డి.రేవణ్ణ

హసన్‌లో మహిళలపై అఘాయిత్యాల కేసులో అరెస్టు



బెంగళూరు : హసన్‌లో మహిళలపై అఘాయిత్యాలకు సంబంధించిన దర్యాప్తు కోసం జేడీ(ఎస్) నేత, మాజీమంత్రి హెచ్‌డీ రేవణ్ణను మూడు రోజుల పాటు సిట్ కస్టడీకి పంపారు. శనివారం సాయంత్రం ఆయనను సిట్ అధికారులు అరెస్టు చేశారు. ఆదివారం సాయంత్రం కోరమంగళలోని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. అంతకుముందు ఆయనకు బౌరింగ్ అండ్ లేడీ కర్జన్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈనెల 8 వరకు దర్యాప్తు బృందం కస్టడీలో వుంటారు. మైసూరులో పనిమనిషి కిడ్నాపింగ్ కేసులో ఆయనను అరెస్టుచేశారు.



విషాహార భోజనంబు

సుగంధ ద్రవ్యాల్లో మోతాదుకు మించి క్రిమిసంహారక మందులు

- పది రెట్లు పెంపునకు ఎఫ్ఎస్ఎస్ఏఏ గ్రీన్‌సిగ్నల్
- ప్రజల ప్రాణాలతో చెలగాటమే..పౌర సంఘాలు

కల్తీలకు కాదేదీ అనర్హం అన్నట్టుగా దందా సాగుతోంది. మనం పైసలు పెట్టి కొనే ఉప్పు,పప్పులే కాదు నూనెలు, సుగంధ ద్రవ్యాలన్నింట్లోనూ కల్తీ యథేచ్ఛగా పారుతోంది. అక్రమార్కులకు కోట్లు కూడబెడుతోంది. జనం ప్రాణాలతో వ్యాపారులు చెలగాటమాడుతున్నా.. మోడీ సర్కార్ మాత్రం కిమ్మర్నాస్తిగా ఉండిపోతోంది. విదేశాలకు పంపిన దేశీయ ఉత్పత్తుల్లో క్రిమిసంహారక మందులు మోతాదుకు మించి ఉన్నాయని తిరస్కరిస్తూంటే.. దేశీయ ప్రజలు మాత్రం ఆ విషాహారాన్ని తిని ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఎఫ్ఎస్ఎస్ఏఐ కూడా ఫెస్టిసైడ్ మోతాదు పెంచమని ఉత్తర్వులు ఇస్తే..జనం ప్రాణాలకు బాధ్యులెవరని పౌర సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

న్యూఢిల్లీ : దశాబ్దకాలంగా దేశంలో ఎటు చూసినా కల్తీనే. అక్రమార్కుల భరతం పడతానంటూ అధికారంలోకి వచ్చిన మోడీ సర్కార్..దేశ ప్రజల ఆరోగ్యాల కన్నా..అక్రమ వ్యాపారులకు అండగా నిలుస్తోందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

పేద,మధ్య తరగతి ప్రజల ఆరోగ్యాలను బేఖాతరు చేస్తున్నదనటానికి తాజా నిదర్శనలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. తినే వస్తువుల్లో కల్తీ కలిపేసుకుని..దండుకోండి..అన్నట్టుగా కేంద్ర వ్యవహరిస్తోంది. ఆ కోణంలోనే.. సుగంధ ద్రవ్యాల్లో పెస్టిసైడ్స్ పరిమాణాన్ని పెంచుతూ ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గరిష్ట అవశేష పరిమితి (ఎంఆర్ఎల్)ని పది రెట్ల వరకు పెంచింది. ఈ పెరుగుదల కిలోగ్రాము(కేజీ)కు 0.01 మిల్లిగ్రాము(ఎంజీ)ల నుంచి 0.1 ఎంజీకి పెంచింది. ఇది గతంలో అనుమతించిన స్థాయి, పరిమాణం కంటే అధికం



కావటం గమనార్హం. ఈ పెరుగుదలపై పలువురు మార్కెట్, ఆరోగ్య నిపుణులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అధిక మొత్తంలో పెస్టిసైడ్‌ల వినియోగం కారణంగా అది క్యాన్సర్‌కు దారి తీయొచ్చని హెచ్చరిస్తున్నారు.

ఎగుమతులు, దిగుమతులపై ప్రభావం

ఈ సడలింపు కారణంగా కొన్ని పెద్ద మార్కెట్లలో భారత సుగంధ ద్రవ్యాల ఎగుమతులు ఎక్కువగా తిరస్కరణకు గురవుతాయని పెస్టిసైడ్ ...11లో



రేపే పోలింగ్

ముగిసిన మూడో దశ ప్రచార పర్వం

- 12 రాష్ట్రాల్లో 95 స్థానాలకు పోలింగ్
- మొత్తం 1,351 మంది అభ్యర్థులు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సార్వత్రిక ఎన్నికల్లో మూడో దశ పోలింగ్ రేపు (మంగళవారం) జరగనుంది. ఈ నేపథ్యంలో ఆ యా ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం ఆదివారం సాయంత్రంతో ముగిసింది. ఈ దశలో మొత్తం 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని మొత్తం 95 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 1,351 మంది అభ్యర్థులు బరిలో దిగారు. ఈ దశలో బరిలో నిలిచిన ప్రముఖులు కేంద్ర మంత్రులు అమిత్ షా (గాంధీనగర్), జ్యోతిరాదిత్య సింధియా (గుణ), బీజేపీ తిరుగుబాటు నాయకుడు కెఎస్ ఈశ్వరప్ప(షిమోగా), డింపుల్ యాదవ్ (మెయిన్‌పురి), శివరాజ్ సింగ్ చౌహాన్ (విదిశ), సుప్రియా సులే (బారమతి) తదితరులు ...10లో

సమస్యల పరిష్కారంలో మోడీ విఫలం

- ఎమర్జెన్సీ, నియంతృత్వాన్ని తలపిస్తున్న బీజేపీ పాలన
- మల్కాజ్‌గిరి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునితా మహేందర్‌రెడ్డిని గెలిపించండి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జి.నర్సింహారావు
- ఉప్పల్, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో బైక్ ర్యాలీ





నవతెలంగాణ-సిటీబ్యూరో/ఉప్పల్

పదేండ్ల పాలనలో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రధాని మోడీ విఫలమయ్యారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి. నర్సింహారావు అన్నారు. బీజేపీని ఓడించండి.. కాంగ్రెస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఉప్పల్‌లో ప్రారంభమైన ఈ ర్యాలీ.. నాచారం, మల్లాపూర్, మల్కాజిగిరి, నేరెడ్‌మెట్, ఏఎస్‌రావు నగర్ మీదుగా ఈసీఐఎల్‌లో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో డిజి.నర్సింహారావు మాట్లాడుతూ.. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించాలని, హస్తం గుర్తుకు ఓటేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పదేండ్ల మోడీ పాలన ఎమర్జెన్సీని మించిన నియంతృత్వాన్ని తలపిస్తోందన్నారు. రాజ్యాంగ మౌలిక సూత్రాలైన ప్రజాస్వామ్యం, లౌకిక విలువల మీద బీజేపీ దాడి చేస్తున్నదని తెలిపారు. మతం, రాముడి పేరుతో ప్రజల దృష్టిని మరలిస్తూ, విభజన సృష్టిస్తూ, ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నదని ఆరోపించారు. ఈసారి మళ్ళీ బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్నే రద్దు చేసి మత రాజ్యం స్థాపించాలని ప్రయత్నిస్తోందన్నారు. ఈ చర్యలు ప్రజల శాంతియుత జీవనానికి, దేశ సమైక్యతకు, శ్రామికుల ఐక్యతకు ప్రమాదకరమని, అందుకే మోడీని గద్దె దించి దేశాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న అన్ని పోరాటాలకూ సీపీఐ(ఎం) అండగా నిలుస్తుందని అన్నారు. ప్రత్యామ్నాయ విధానాలు అమలు చేయడం ద్వారా కేరళ వామపక్ష ప్రభుత్వం దేశానికే దిక్సూచిగా నిలిచిందన్నారు. దేశాన్ని పట్టి పీడిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి వామపక్ష లౌకికవాదులందరూ ఏకమై ఇండియా కూటమిగా ఏర్పడ్డాయన్నారు. తెలంగాణలో భువనగిరి స్థానం మినహా, మిగతా 16 స్థానాల్లో కాంగ్రెస్‌కు ఓటేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. పదేండ్ల మోడీ పాలనలో ధరలు తారా స్థాయికి చేరుకున్నాయన్నారు. 50 ఏండ్ల గరిష్ట స్థాయికి నిరుద్యోగం పెరిగిందని చెప్పారు. పెద్ద నోట్ల రద్దుతో లక్షలాది మందికి ఉన్న ఉపాధి పోయిందనీ, అయినప్పటికీ ఉపాధి హామీ చట్టాన్ని పట్టణాలకు విస్తరించకపోగా, బీజేపీ ప్రభుత్వం దీన్ని మరింత నీరుగార్చిందన్నారు. సీపీఐ(ఎం) మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోమటి రవి మాట్లాడుతూ.. దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగాయన్నారు. ఇప్పటికే రూ.17.46లక్షల కోట్ల బ్యాంకుల అప్పు ఎగవేసిన బడాబాబులకు మళ్ళీ అప్పులిచ్చేందుకు మోడీ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందనీ, పేదల స్థితిగతులు మాత్రం మరింత దిగజారుతున్నాయన్నారు. ఆకలి సూచీలో మన దేశం 111వ స్థానంలో ఉందని చెప్పారు. దేశంలో 32శాతం పౌష్టికాహార లోపం, 44శాతం వంట గ్యాస్ కొరత ఉందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే బీజేపీని ఓడించి, సీపీఐ(ఎం) బలపర్చిన పట్నం సునీతా మహేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జె.చంద్రశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్, జి.శ్రీనివాసులు, ఎన్.శ్రీనివాస్, ఉప్పల్ నాయకులు జె.వెంకన్న, ఎస్.నాగరాజు, ఎండీ గౌస్, వై.వెంకటేశ్వర్లు, కాప్రా మండల నాయకులు పి.గణేష్, బీవీ.సత్యనారాయణ, డి.కొండల్ రెడ్డి, ఎం.శ్రీనివాస్‌రావు, మల్కాజిగిరి మండల కార్యదర్శి కృపాసాగర్, మండల నాయకులు బి.నర్సింగ్‌రావు, పి.మంగ, బి.కొండల్, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సమస్యల పరిష్కారం కోసం కృషి

- డాక్టర్ కిరణ్ మాదాల



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్యుల సమస్యల పరిష్కారం కోసం అందర్నీ కలుపుకుని కృషి చేస్తామని ప్రముఖ వైద్యులు డాక్టర్ కిరణ్ మాదాల తెలిపారు. ఆదివారం తెలంగాణ ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం ఎన్నికల ఫలితాలను రాష్ట్ర స్థాయి సమావేశంలో వెల్లడించారు. నూతనంగా ఎన్నికైన వారు 2024 నుంచి 2026 వరకు ఆయా పదవుల్లో ఉండనున్నారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా డాక్టర్ కిరణ్ కుమార్ బోల్లేపాక, సెక్రటరీ జనరల్‌గా డాక్టర్ కిరణ్ మాదల, కోశాదికారిగా డాక్టర్ ఎల్.రమేష్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ కిరణ్ ప్రకాష్‌తో పాటు ఏడు జోన్లకు ప్రాంతీయ కార్యదర్శి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కిరణ్ మాదాల మాట్లాడుతూ తమ సంఘం ఎవరికి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. అధ్యక్షులు డాక్టర్ కిరణ్ బొల్లేపాక మాట్లాడుతూ బోదనా వైద్యుల బదిలీలు, వైద్యుల వేతన స్థిరీకరణ తదితర సమస్యల సాధనకు కృషి చేయనున్నట్టు తెలిపారు.

మొగులయ్యకు కేటీఆర్ ఆర్థిక సాయం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

జానపద కళాకారుడు పద్మశ్రీ దర్శనం మొగులయ్యకు మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆర్థిక సహాయం చేశారు.ఆయనకు గత ప్రభుత్వం ఇచ్చిన కళాకారుల పెన్షన్ ఆపివేయడంతో, కూలి పని చేసుకుంటున్నట్టు వచ్చిన వార్తలకు స్పందించిన కేటీఆర్ ఆయనకు ఆర్థిక సహాయం చేశారు. మొగులయ్యకు గత ప్రభుత్వం ఇచ్చిన కళాకారుల పెన్షన్‌తో పాటు అన్ని రకాల హామీలు నెరవేర్చాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మొగులయ్య లాంటి జానపద కళాకారులు తెలంగాణకి గర్వకారణమనీ, వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక సహాయం చేసిన మాజీ మంత్రి కేటీఆర్‌కు మొగులయ్య ధన్యవాదాలు తెలిపారు.

కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మట్లేదు

మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మట్లేదని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. ఆదివారం నాడిక్కడి తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజల ఓట్లు దండు కోవడం కోసమే రాహుల్ గాంధీ, ప్రధాన మోదీ ప్రసంగాలు ఉంటున్నాయన్నారు. కులగణన, సామాజిక న్యాయం గురించి జాతీయ నాయకులు మాట్లాడుతున్నారనీ, రాష్ట్రంలో ఆపార్టీలు 17 పార్లమెంట్ సీట్లలో చేసిన సామాజిక న్యాయం లేదన్నారు. కేవలం ఎన్నికల టార్గెట్‌గా సామాజిక న్యాయం అనే మాటలు ప్రస్తావిస్తున్నారని ఆక్షేపించారు. కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రంలో ఇచ్చిన హామీలకే దిక్కు లేదనీ, ఇక దేశంలో ఏం అమలు చేస్తారని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి ఏం చేశారో చెప్పకొనేందుకు మోడీ వద్ద ఎలాంటి సమాధానాలు లేవన్నారు. రెండు జాతీయ పార్టీలకు తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

కార్పొరేట్‌లకు బీజేపీ కొమ్ము కాస్తోంది

- జీఎస్టీ తెచ్చి నిత్యావసర ధరలు పెంచింది
- అదానీ, అంబానీలను కుబేరులు చేసింది
- కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మళ్లీ మోసపోతాం : ఆర్ఎస్ ఆశీర్వాద సభలో మాజీ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ - చందుర్తి

బీజేపీ కార్పొరేట్ కొమ్ముకాస్తూ అదానీ, అంబానీలను కుబేరులను చేసిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్‌కు తిట్లు, దేవుని మీద ఓట్లు అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రిని విమర్శించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి, రుద్రంగి మండలాల్లో ఆదివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. ప్రజలు మార్పు కోసం ఆశ పడ్డారని, కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు కరెంట్ సక్రమంగా ఉండేదని, కేసీఆర్ కిట్టు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వచ్చేదన్నారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఏ ఒక్కటీ రాకుండా చేసిందని విమర్శించారు. ఆరు గ్యారంటీలను హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని చెప్పి మాట తప్పారని ఆరోపించారు బాండ్లు బౌన్స్ అయ్యాయని అన్నారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని చెప్పారని, ఈ నాలుగు నెలల్లో ఎంతమంది మహిళలకు ఇచ్చారని ప్రశ్నించారు. బీజేపీ సిలిండర్ ధర పెంచిందని, బీడీ కట్టపై పుర్రె గుర్తు తెచ్చి బీడీ కార్మికుల పొట్టకొట్టి ఉపాధి లేకుండా చేసిందన్నారు. కేంద్రంలో మన సమస్యలపై పోరాడాలంటే కారు గుర్తుకు ఓటు వేసి బోయినిపల్లి వినోద్ కుమార్‌ను గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. మళ్లీ అబద్ధాల కాంగ్రెస్‌కు ఓటు వేసి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చలిమెడ లక్ష్మి నరసింహారావు, జెడ్పి చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి, తుల ఉమ, ఏనుగు మనోహర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

సభకు వచ్చిన మహిళకు రోడ్డు ప్రమాదం..

బీఆర్‌ఎస్ ఆశీర్వాద సభకు వచ్చిన మహిళకు రోడ్ ప్రమాదంలో కాలు విరిగింది. సభ ముగియగానే ఒక్కసారిగా జనం గుంపులుగా రోడ్డు దాటుతుండగా కోరుట్ల నుంచి వేములవాడకు వెళుండగా ఎన్‌గల్ గ్రామానికి చెందిన మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. దాంతో ఆమెను నాయకులు ఓ ప్రయివేట్ వాహనంలో వేములవాడ ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు.

ఉపాధ్యాయ పదోన్నతుల్లో 'టెట్' సంక్షోభం

- పరిష్కారానికి టీఎస్ యూటీఎఫ్ డిమాండ్
- విద్యాశాఖ కమిషనర్ దేవసేన నిర్లక్ష్యమే కారణం : చర్యలకు టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతుల సంక్షోభానికి కారణమైన అర్హత పరీక్ష (టెట్) వివాదం పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యాశాఖ కమిషనర్ దేవసేనను ఆ బాధ్యతల నుంచి తొలగించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత సెప్టెంబర్‌లో అర్ధాంతరంగా నిలిచిపోయిన పదోన్నతులను కొనసాగించాలని కోరారు. దీనికి ఆటంకంగా ఉన్న టెట్‌పై ఎన్సీటీఈ వివరణ తీసుకోవాలని.. అనేక సార్లు కమిషనర్‌కు విన్నవించామని తెలిపారు. ఖమ్మం పట్టణంలోని టీఎస్ యూటీఎఫ్ భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవి మాట్లాడారు. పదోన్నతులపై స్పష్టత కోసం ఫిబ్రవరిలో ఎన్సీటీఈకి లేఖ రాసినా రహస్యంగా ఉంచారని చెప్పారు. ప్రధానోపాధ్యాయులకు పనిచేస్తున్న పాఠశాలల స్థాయిలో మార్పు లేనప్పుడు పదోన్నతులకు టెట్ అవసరం లేదని పేర్కొంటూ ఏప్రిల్ 8న స్పష్టతనిచ్చినా బయటకు వెల్లడించకుండా ఉపాధ్యాయులను మానసిక ఆందోళనకు గురిచేశారన్నారు. అంతేకాక అందరినీ టెట్‌కు దరఖాస్తు చేయించడం ద్వారా రూ.లక్షలు వృథా చేయించారని కమిషనర్ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడేండ్లుగా కమిషనర్ పనితీరు బాగో లేదని, ఉపాధ్యాయులు, సంఘాలు చివరికి ప్రజాప్రతినిధులతో సైతం సరిగ్గా వ్యవహరించటం లేదని ఆరోపించారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించటంలో ఆమె విఫలమయ్యారని అన్నారు. ఎన్నికలు ముగిసేలోగా ఎన్సీటీఈ నుంచి మరికొన్ని అంశాలపై వివరణ తీసుకుని.. ఆ వెంటనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని, విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పాఠశాలల్లో విద్యావాలంటీర్లను నియమించాలని కోరారు.

సర్వీసు పర్సన్స్‌ను నియమించాలని, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో నూతన ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలన్నారు. గురుకులాల్లో బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు వాయిదాల డీఏను విడుదల చేయాలని కోరారు. గత పీఆర్సీ బకాయిలతో సహా ట్రెజరీ ఆమోదం పొంది ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ తక్షణమే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావ దుర్గాభవాని, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు బుర్రి వెంకన్న, కోశాధికారి వల్లంకొండ రాంబాబు, కార్యదర్శులు పి.సురేష్, ఉద్దండు షరీఫ్, డి. నాగేశ్వరరావు, ఎస్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి రక్షణ కల్పించాలి

- మ్యాన పవన్ కుమార్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రతి జిల్లాలో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలకు పైన నమోదవుతున్న నేపథ్యంలో ఎన్నికల సిబ్బందికి ఎండలతీవ్రత నుంచి రక్షణ కల్పించాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మ్యాన పవన్ కుమార్ ఎన్నికల కమిషన్ కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఈనెల 13న జరగనున్న లోక్‌సభ ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగ ఉపాధ్యాయులకు అన్ని సదుపాయాలు కల్పించాలని కోరారు. అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేయాలనీ, ఎన్నికల సిబ్బందిని పోలింగ్ స్టేషన్‌లో తీసుకెళ్లే వాహనాలు ఎక్కువ సంఖ్యలో అందుబాటులో ఉంచాలనీ, రిసెప్షన్ సెంటర్లో ఉద్యోగ, ఉపాధ్యాయులకు అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించాలని సూచించారు. ప్రతి ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో, పోలింగ్ స్టేషన్‌లో తప్పనిసరిగా కూలర్లు, చల్లని త్రాగునీరు, ఓఆర్‌ఎస్ అందుబాటులో ఉండే విధం గా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఎన్నికల సమయాన్ని పెంచిన దృష్ట్యా సిబ్బంది రాత్రి సమయంలో సొంత ప్రాంతలకు వెళ్లే విధంగా వాహనాల సౌకర్యం కల్పించాలని మ్యాన పవన్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

రేవంత్ ప్రభుత్వాన్ని పడగొడతామనే ప్రచారం అవాస్తవం

- అధికారం కోల్పోయి కేసీఆర్ ఇష్టారీతిన ప్రవర్తిస్తున్నారు
- హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చే ప్రసక్తి లేదు
- మరోసారీ మోడీ ప్రధాని కావాలని ప్రజలు కోరుకుంటున్నారు : మీట్ ది ప్రెస్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సర్కార్ ఐదేండ్ల పాటు కొనసాగాలని బీజేపీ కోరుకుంటున్నదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(టీయూడబ్ల్యూజే) ప్రధాన కార్యదర్శి విరాసత్ అలీ అధ్యక్షతన నిర్వహించిన మీట్‌ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ "రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్నీ పడగొడతామనే ప్రచారంలో వాస్తవం లేదు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కలిసి ప్రభుత్వం పడగొట్టుకుంటే మాకు సంబంధం లేదు. ప్రభుత్వం పడిపోవాలని మేము కోరుకోవడం లేదు. కేసీఆర్, కేటీఆర్, రేవంత్ రెడ్డి నోర్లకు కీ నాదగ్గర లేదు. ఒక 'కీ' ఫాం హౌజ్‌లో ఉంటే, ఒక 'కీ' సోనియా గాంధీ చేతిలో ఉంది. బీఆర్‌ఎస్‌కు ఈ ఎన్నికల్లో ఒక్క స్థానం వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు" అని అన్నారు. ప్రజలు అవినీతి రహిత ప్రభుత్వాన్ని కోరుకున్నారని తెలిపారు. పదేండ్ల బీజేపీ పాలనలో అవినీతిపై అత్యంత కఠినంగా వ్యవహరించామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో దేశంలో అనేక చోట్ల ఉగ్రదాడులు, బాంబు పేలుళ్ళు, కర్ఫ్యూలు సాధారణంగా ఉండే వన్నారు. మోడీ అధికారంలోకి వచ్చాక జీరో టాలరెన్ పద్ధతిని కొనసాగించడం వల్ల ఉగ్రవాదం పూర్తిగా తగ్గిందని చెప్పారు. రాష్ట్రంలో 25 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయడంతో పాటు రోడ్ వే, ఎయిర్‌లైన్లు తదితర అన్ని రంగాలకు పెద్దపీట వేసామని పేర్కొన్నారు. రిజర్వేషన్లను రద్దు చేస్తామని ఎవరన్నారో రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని వంద సార్లకు పైగా మార్చిన కాంగ్రెస్ పార్టీ, రాజ్యాంగం గురించి నీతులు చెబుతున్నదని విమర్శించారు. మరోసారీ నరెంద్రమోడీ దేశ ప్రధాని కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి సినియర్ జర్నలిస్టు రవికాంత్ రెడ్డి సమన్వయ కర్తగా వ్యవహరించారు.

కాంగ్రెస్ నాయకులపై కత్తులతో దాడి

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు
- పాత కక్షలే కారణం



నవతెలంగాణ-రాజేంద్రనగర్

పాత కక్షల నేపథ్యంలో ఇద్దరు కాంగ్రెస్ నాయకులపై ఒక వ్యక్తి కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో ఒకరు మృతి చెందగా.. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సులేమాన్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ నేతలు మక్బూల్(60), మనోజ్.. శనివారం సాయంత్రం చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో అక్కడ పార్టీ ఆఫీసులో స్థానికులతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మరి కొద్ది గంటల్లో రంజిత్‌రెడ్డి ఆ ప్రాంతానికి వస్తారనగా.. స్థానిక ఎంఐఎం నాయకులు అంజద్ అక్కడకు చేరుకొని మక్బూల్‌తో గొడవకు దిగాడు. దాంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది.

అంజాత్ తనతో తెచ్చుకున్న కత్తితో మక్బుల్‌పై విచక్షణ రహితంగా దాడి చేయడంతో అతను అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందారు. అక్కడే ఉన్న మనోజ్‌పై కూడా అంజద్ కత్తితో దాడి చేసి పరారయ్యాడు. ఒక్కసారిగా జరిగిన ఈ ఘటనతో స్థానికులు భయభ్రాంతులకు గురై అక్కడ నుంచి పారిపోయారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న రాజేంద్రనగర్ డీసీపీ చింతామణి శ్రీనివాస్ తీవ్ర గాయాలపాలైన మనోజ్‌ను స్థానికం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉంది. మృతి చెందిన మక్బూల్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

అయితే ఈ ఘటనకు పాత కక్షలు కారణమని పోలీసులు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అక్కడ ప్రచారం చేయకుండానే వెనుతిరిగారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుని కోసం గాలిస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి

- గాలించే ప్రయత్నంలో నీటమునిగి మరో వ్యక్తి మరణం
- సంగారెడ్డి జిల్లా కేరూరు గ్రామంలో ఘటన



నవతెలంగాణ-వట్‌పల్లి

చెరువులో చేపల వేటకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. అతని మృతదేహం కోసం గాలిస్తుండగా చెరువులోని చెట్టుకు బట్టలు తట్టుకుని మరో వ్యక్తి మరణించారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం కేరూరు గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బరుగు కిరణ్(23) తన స్నేహితులతో కలిసి శనివారం సాయంత్రం గ్రామ శివారులోని ఉమ్మడి అల్లాదుర్గం మండలం గడి పెద్దాపూర్ పెద్దచెరువులోకి చేపల వేటకు వెళ్లారు. అయితే ప్రమాదవశాత్తు కిరణ్ నీట మునిగారు. ఎంతకీ తేలకపోవడంతో.. అతని స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. శనివారం రాత్రి వరకూ గ్రామస్తుల సాయంతో గాలించినా ఫలితం దక్కలేదు. దాంతో ఆదివారం ఉదయం మరోమారు కొందరు గ్రామస్తులు చెరువులోకి దూకి మృతదేహాన్ని గాలించారు. అయితే గ్రామానికి చెందిన చిల్లి కిష్టయ్య(52) చెరువులో వెతుకుతుండగా.. చెరువులో ఉన్న ఓ చెట్టుకు అతని బట్టలు తట్టుకుని పైకి రాలేకపోయాడు. దాంతో ఊపిరాడక నీట మునిగి మృతి చెందారు. ఇద్దరి మృతితో వారి కుటుంబాల్లోనే కాకుండా గ్రామంలోనూ విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా ఈ మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు.

ఆ యువతి ఆచూకీ దొరికింది !



బెంగళూరు : కొద్ది రోజుల క్రితం కిడ్నాపింగ్‌కు గురైన యువతి ఆచూకీని కర్నాటక పోలీసులు కనిపెట్టారు. కెనహళ్లిలోని రాష్ట్ర ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణ సహాయకుడు రాజశేఖర్ ఫామ్‌హౌస్‌లో ఆ యువతి ఆచూకీ లభించింది. సస్పెన్షన్‌కు గురైన జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై లైంగిక వేధింపుల ఆరోపణలు రావడం, ఆయన విదేశాలకు పారిపోవడం, ప్రజ్వల్ తండ్రి హెచ్‌డీ రేవణ్ణను పోలీసులు అరెస్ట్ చేయడం తెలిసిందే. కర్నాటక పోలీసులకు చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) గాలింపు చర్యలు చేపట్టి యువతిని రక్షించారు. ఈ యువతిని రేవణ్ణ బంధువు సతీష్ బాబన్న గత నెల 29న కిడ్నాప్ చేశారని వార్తలు వచ్చాయి. అప్పటి నుండి ఆమెను రాజశేఖర్ తన వ్యవసాయ క్షేత్రంలో బందీగా ఉంచారు. బాధితురాలిని సిట్ అధికారులు బెంగళూరు తీసుకొచ్చారు. వెలుగులోకి వచ్చిన ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల ఆడియో టేపుల్లో బాధితురాలు కూడా ఉన్నారు. అంతకుముందు కిడ్నాపింగ్ కేసుకు సంబంధించి హెచ్‌డీ రేవణ్ణను ఆయన తండ్రి, మాజీ ప్రధాని దేవెగౌడ నివాసంలో సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. అరెస్టు నుండి తనకు రక్షణ కల్పించాల్సిందిగా రేవణ్ణ దాఖలు చేసిన పిటిషన్‌ను బెంగళూరు కోర్టు తోసిపుచ్చింది.

పూరీ కాంగ్రెస్ అభ్యర్థిగా జై నారాయణ్ పట్నాయక్

పూరీ : ఒడిశాలోని పూరీ నియోజకవర్గానికి ఇంతకు ముందే ఖరారైన సుచరిత బదులు జై నారాయణ్ పట్నాయక్‌ని అభ్యర్థిగా కాంగ్రెస్ ప్రకటించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి వేణుగోపాల్ ప్రకటన విడుదల చేశారు. మాజీ ఎంపి బ్రజామోహన్ మహంతీ కుమార్తె, మాజీ జర్నలిస్టు అయిన సుచరితా మహంతిని కాంగ్రెస్ పార్టీ పూరీ నియోజకవర్గానికి తొలుత ప్రకటించింది. అయితే తన దగ్గర డబ్బుల్లేవంటూ ఎన్నికల్లో పోటీ చేయనని తేల్చి చెప్పారు.

తనకు అధిష్టానం ఆర్థిక సహకారం నిరాకరించిందని.. దీంతో తాను ఈ ఎన్నికల్లో పోటీ చేయనని కెసి వేణుగోపాల్‌కు లేఖ రాశారు. సుచరిత పోటీ నుంచి తప్పుకోవడంతో ఆమె స్థానంలో నారాయణ్ పట్నాయక్ బరిలో నిలిచారు. కాగా పూరీ లోక్‌సభ స్థానానికి ఆరోవిడతలో మే 25న పోలింగ్ జరగనుంది. నామినేషన్లకు చివరి గడువు మే 6 వరకు ఉంది

ఇదేమి నిష్పాక్షికత?

ఈసీ పనితీరుపై ప్రశ్నలు, సందేహాలు



ముఖ్యమంత్రులనూ అరెస్ట్ చేస్తున్నారు
మతం పేరుతో ఓట్లను దండుకోవాలని చూస్తున్నారు
ప్రధాని, మంత్రులు కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారు
సూరత్‌లో బలవంతంగా 'ఏకగ్రీవం' చేయించారు
అయినా కళ్లు తెరవని ఎన్నికల కమిషన్

న్యూఢిల్లీ : ఎన్నికల కమిషన్‌పై ప్రజలు, రాజకీయ పార్టీలకు విశ్వాసం రానురానూ సడలిపోతోంది. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలోనే దాని విశ్వసనీయత, స్వతంత్రతను పలువురు ప్రశ్నించారు. జూలై 2న లోక్‌సభ ఎన్నికలు ముగిసిన వెంటనే 64 మంది ప్రభుత్వ మాజీ ఉన్నతోద్యోగులు, సాయుధ దళాలకు చెందిన 83 మంది మాజీ అధికారులు కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఉద్దేశిస్తూ ఘాటుగా ఓ లేఖ రాశారు. 2019 లోక్‌సభ ఎన్నికల నిర్వహణను వారు తప్పు పట్టారు. అవి స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగలేదని, గత మూడు దశాబ్దాలలో ఇంత దారుణమైన పరిస్థితిని ఎన్నడూ చూడలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ ఈసీ పనితీరులో ఏ మాత్రం మార్పు రాలేదు. ఈసారి కూడా పక్షపాతపూరితంగా వ్యవహరిస్తూ ఎన్నికల ప్రక్రియను ఓ ఫార్సుగా మార్చేసేందుకు కంకణం కట్టుకుంది.

గత నెల 11న ప్రభుత్వ మాజీ ఉన్నతోద్యోగులు ఈసీకి ఓ లేఖ రాశారు. ఎన్నికల నిర్వహణపై ప్రజలు, రాజకీయ పార్టీల మనసులో ఉన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు ఈసీ చేస్తున్నది ఏమీ లేదని మండిపడ్డారు. ఈవీఎంల పనితీరు, వీవీప్యాట్ల లెక్కింపుపై ప్రజలు అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదని తెలిపారు. అధికార పక్షం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తుంటే ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఇటీవలి కాలంలో ఈసీ చర్యలు వింతగా ఉన్నాయని వ్యాఖ్యానించారు.

పర్యవేక్షణకు స్వతంత్ర కమిటీ

ఎవరెన్ని లేఖలు రాసినా, అభ్యర్థనలు పంపినా ఎన్నికల సంఘం దున్నపోతు మీద వాన పడినట్లే వ్యవహరిస్తోంది. అంతేకాక అబద్ధాలను పదేపదే వల్లె వేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోంది. ఈ నేపథ్యంలో పౌర సమాజ గ్రూపులు ఒక్కటై ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణకు ఓ స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేశాయి. మార్చి 15న ప్రారంభమైన ఈ కమిటీ స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు, కోడ్ ఉల్లంఘనలపై ఈసీకి ఎప్పటికప్పుడు నివేదికలు, వారానికి ఒక బులెటిన్ పంపుతోంది. వాటిలోని కొన్ని ముఖ్యాంశాలు....

మతం పేరుతో ఓట్ల అభ్యర్థన

స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలపై ప్రభావం పడేలా ప్రధాన స్రవంతి మీడియాలో పక్షపాతపూరితమైన, సమతూకంగా లేని వార్తలు వస్తున్నాయి. ఓటర్ల జాబితా నుండి ఓ పద్ధతి ప్రకారం ముస్లింలు, దళితులు, ఇతర అణగారిన వర్గాల వారిని తొలగించారు. ఎన్నికల సీజన్‌లో కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేశారు. వామపక్షాలకు ఆదాయపన్ను నోటీసులు ఇచ్చారు. అధికార బీజేపీ నేతలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి మతాలను అభ్యర్థిస్తూ ప్రకటనలు ఇస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఓట్లను అభ్యర్థిస్తూ అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ట, రామనవమిని ప్రస్తావిస్తున్నారు.

బీజేపీ మంత్రులు తమ ఎన్నికల సందేశాలలో సైనిక చిహ్నాలను దుర్వినియోగం చేశారు. మోడీ సైనిక యూనిఫారంలో ఉన్న వీడియోలను పోస్ట్ చేశారు. బీజేపీ సీనియర్ నాయకులు మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొడుతుంటే ప్రభుత్వం ఓ పద్ధతి ప్రకారం స్వతంత్ర మీడియాను లక్ష్యంగా చేసుకుంటోంది. ప్రధాని మోడీ తన ఎన్నికల ప్రచారంలో పలు సందర్భాలలో మతపరమైన ప్రస్తావనలు తీసుకొస్తున్నారు. పౌర సమాజం పలు సందర్భాల్లో అనేక ప్రశ్నలు లేవనెత్తుతూ, ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ ఈసీ మాత్రం ఈవీఎంల భద్రత, పనితీరుపై ఒక్క ప్రశ్నకూ సమాధానం ఇవ్వలేదు. దీనిపై కేంద్ర సమాచార కమిషన్ కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.

ఇంత దారుణమా?

ఎన్నికల తరుణంలో కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రతిపక్ష నేతలకు నోటీసులు జారీ చేస్తున్నప్పటికీ ఈసీ వాటిని పరిగణనలోకి తీసుకోలేదు. ప్రధాని మోడీ ఏప్రిల్ 21న తన ఎన్నికల ప్రచారంలో ముస్లింలను కించపరిచేలా ప్రసంగించారు. అయినా ఈసీలో కదలిక లేదు. ప్రధాని పేరును ప్రస్తావించకుండా బీజేపీకి నోటీసు ఇచ్చి చేతులు దులుపుకుంది. ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వ అధికారులే ఓటర్లను పోలింగ్ కేంద్రాల వద్ద అడ్డుకున్నారు. పోలింగ్ కేంద్రాలను స్వాధీనం చేసుకున్నారన్న ఆరోపణలు కూడా వచ్చాయి. ఎన్నికల ప్రక్రియనే అపహాస్యం చేస్తూ సూరత్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించి, స్వతంత్ర అభ్యర్థులతో బలవంతంగా ఉపసంహరింపజేసి బీజేపీ అభ్యర్థి విజయం సాధించినట్లు ప్రకటించారు. ఇండోర్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వ్యక్తి తన నామినేషన్‌ను ఉపసంహరించుకొని బీజేపీలో చేరిపోయారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి బీజేపీ నాయకుల విషయంలో చూసీ చూడనట్లు వ్యవహరిస్తూ ప్రతిపక్ష నేతలకు మాత్రం నోటీసులు జారీ చేస్తున్నారు. తొలి దశ పోలింగ్ జరిగిన 11 రోజుల తర్వాత ఓటింగ్ శాతాన్ని వెల్లడించారు. ఇంత జరుగుతున్నా ఈసీ తనకేమీ పట్టనట్లుగానే వ్యవహరిస్తోంది.

అరెస్టులతో సమానావకాశాలు ఎలా?



ఎన్నికల షెడ్యూలు ప్రకటనకు కేవలం ఒక రోజు ముందు ఇద్దరు ఎన్నికల కమిషనర్లను తొందరపాటుతో, నర్మగర్భంగా పక్షపాతపూరితంగా నియమించారు. ఏడు దశల సుదీర్ఘ ఎన్నికల ప్రక్రియ అధికార పార్టీకి, దాని స్టార్ క్యాంపెయినర్లు... ముఖ్యంగా ప్రధాని మోడీకి ప్రయోజనం చేకూర్చేలా ఉంది. ఎన్నికల సమయంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం అనేక అనుమానాలు రేకెత్తిస్తోంది. ప్రతిపక్షానికే చెందిన జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్‌ను అరెస్ట్ చేసిన వెంటనే కేజ్రీవాల్‌ను కూడా అరెస్ట్ చేయడం జరిగింది. అలాంటప్పుడు ఎన్నికల ప్రక్రియలో అందరికీ సమానావకాశాలు ఎలా లభిస్తాయి?





కేంద్ర హెూం మంత్రి అమిత్ షా పోటీ చేస్తున్న గాంధీనగర్ లోక్‌సభ స్థానంపై బీజేపీ శ్రేణులు 'భారీ' ఆశలే పెట్టుకున్నాయి. అమిత్ షా గెలుపును ముందుగానే ఊహించికుంటున్న ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు.. పది లక్షల మెజారిటీని టార్గెట్‌గా పెట్టుకున్నారు. అయితే, ఎన్నికలు, రాజకీయ విశ్లేషకులు మాత్రం ఇది అసాధ్యమని కొన్ని గణాంకాలను ఉదహరిస్తున్నారు.

గాంధీనగర్ సీటుపై బీజేపీ ఆశలు

కేంద్ర హెూం మంత్రి అమిత్ షా పోటీతో ప్రతిష్టాత్మకం

- ఇక్కడ ఉన్న ఓట్లు దాదాపు 25 లక్షలు
- ఓటింగ్ శాతం సగటున 55 శాతానికి తక్కువే

గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లు 26 శాతానికి పైనే

- కాషాయపార్టీ చెప్తున్న భారీ మెజారిటీ అసాధ్యం
- ఎన్నికలు, రాజకీయ విశ్లేషకులు

గాంధీనగర్ : గుజరాత్‌లో మొత్తం 26 లోక్‌సభ స్థానాలున్నాయి. అన్నిటితో పాటు ఈ నియోజకవర్గానికి కూడా 7న మూడో దశలో భాగంగా ఎన్నికలు జరగనున్నాయి. కాగా, గాంధీనగర్ బీజేపీకి పట్టున్న సీటే అయినప్పటికీ.. ఈసారి తమకు గతంలో కంటే ఎక్కువ మెజారిటీ వస్తుందని బీజేపీ శ్రేణులు చెప్పుకుంటున్నాయి. తమకు ఇక్కడ పోటీయే లేదనీ, పది లక్షల మెజారిటీని సునాయాసంగా సాధించి అమిత్ షా ఇక్కడి నుంచి ఘన విజయం సాధిస్తారని బీజేపీ నాయకులు చెప్తున్నారు.

ఈ స్థానం మూడు దశాబ్దాలకు పైగా కమలం పార్టీదే

గుజరాత్‌లోని గాంధీనగర్ లోక్‌సభ స్థానం బీజేపీకి చాలా కీలకం. 1989 నుంచి ఆ పార్టీ ఈ సీటును గెలుచుకుంటూ వస్తున్నది. బీజేపీ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన మాజీ ఉప ప్రధాని, ఆ పార్టీ కురువృద్ధుడు ఎల్.కె అద్వానీ ఇక్కడ నుంచి ఆరు సార్లు ఎంపీగా గెలిచారు. 1996-98 మధ్య భారత మాజీ ప్రధాని, బీజేపీ అగ్రనాయకుడైన వాజ్‌పేయి సైతం ఆ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఇక్కడ నుంచి పోటీ చేసిన అమిత్ షా.. 5 లక్షల పైచిలుకు ఓట్ల తేడాతో విజయం సాధించారు. అయితే, ఈ సారి మెజారిటీ పది లక్షల తేడాతో ఉండనున్నదని బీజేపీ ఆశలు పెట్టుకున్నది.

ఎట్టకేలకు బరిలో 14 మంది

ప్రస్తుతం గాంధీనగర్ లోక్‌సభ స్థానానికి మొత్తం 39 మంది నామినేషన్లు వేశారు. చివరకు 16 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను వెనక్కి తీసుకోగా.. 9 మంది పత్రాలు తిరస్కరణకు గురయ్యాయి. దీంతో 14 మంది బరిలో ఉన్నారు. కాగా, నామినేషన్లు వెనక్కి తీసుకున్నవారిలో పది మంది బీజేపీ నుంచి వచ్చిన ఒత్తిళ్ల మేరకే వెనక్కి తగ్గామని చెప్పటం గమనార్హం. అయినప్పటికీ.. ఇటు పోలీసు అధికారుల నుంచి కానీ, అటు ఎన్నికల అధికారి నుంచి కానీ ఎలాంటి చర్యలూ లేవు. ఇలా పోటీ నుంచి తప్పుకున్న అభ్యర్థుల్లో ఒకరైన జితేంద్ర సింగ్ చౌహాన్.. తన జీవితం ప్రమాదంలో ఉన్నదని ఒక వైరల్ వీడియోలో ఆరోపణలు వినిపంచటం తెలిసిందే. ఆలిండియా పరివార్ పార్టీ తరఫున గాంధీనగర్ నుంచి పోటీలో ఉన్న ఈయన.. బీజేపీ నాయకులు, కార్యకర్తల నుంచి వచ్చిన ఒత్తిళ్ల మేరకే పోటీ నుంచి తప్పుకున్నట్టు వివరించాడు. మధ్యప్రదేశ్‌లోని భింద్‌కు చెందిన చౌహాన్ ఒక పెయింటర్. కాగా, వీడియో వైరల్ అయినప్పటి నుంచి తనకు పని దొరకటం లేదనీ, గతంలో కలిసి పని చేసినవారు కూడా ఫోన్లు ఎత్తటం లేదని ఆయన వాపోయాడు.



బీజేపీవి అనైతిక చర్యలు : కాంగ్రెస్

ఇక్కడ కాంగ్రెస్ ఎంతో కొంత ఓట్లను రాబట్టగలిగే స్థాయిలో ఉన్నా.. మరింత పోటీ ఇవ్వకపోవటానికి గల కారణం బీజేపీ అనైతిక చర్యలేనని ఆ పార్టీ అంటున్నది. " బీజేపీకి చాలా వనరులున్నాయి. హోర్డింగ్‌లు, బ్యానర్‌లు ఏర్పాటు చేయటానికి బీజేపీ వారు ఎవరి దగ్గరి నుంచీ అనుమతి తీసుకోరు. మేము మాత్రం అనుమతి తీసుకోవాలి. హోర్డింగ్‌లను ఏర్పాటు చేయటానికి ప్రజలు మాత్రమే కాదు.. కాంగ్రెస్ మద్దతుదారులు కూడా జంకుతున్నారు. ఇదే పెద్ద సమస్య" అని కాంగ్రెస్ అభ్యర్థి సోనాల్ పటేల్ తెలిపారు. ఒకవేళ కాదని ఎవరైనా ధైర్యం చేస్తే పోలీసుల నుంచి వారికి బెదిరింపు కాల్స్ వస్తాయని, ఇలా చాలా మంది కాంగ్రెస్ కార్యకర్తలు దీనిని ఎదుర్కొన్నారని వివరించారు.

సమావేశాలు ఏర్పాటు చేద్దామన్నా.. 'ఒత్తిళ్లే' కాంగ్రెస్ సేవాదళ్‌కు చెందిన ముకేశ్ మరు మాట్లాడుతూ.. "గాంధీనగర్‌లోని ఒక హాల్‌లో సమావేశం ఏర్పాటు చేద్దామనుకుంటే.. ఆ హాల్‌కు చెందిన యజమానిపై ఒత్తిళ్లు వచ్చాయి. దీంతో పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేయలేకపోయింది. ఆ తర్వాత రెండు హాల్‌లను సంప్రదించినా.. భయంతో ప్రతి ఒక్కరూ నిరాకరించారు. దీంతో సమావేశాన్ని మేము పార్టీ కార్యాలయంలో నిర్వహించాల్సి వచ్చింది" అని తెలిపారు.

కాంగ్రెస్ నుంచే ప్రధాన పోటీ

ఈ స్థానం నుంచి పలు పార్టీలకు చెందినవారు 14 మంది బరిలో ఉన్నప్పటికీ.. బీజేపీకి ప్రధానంగా పోటీ ఉన్నది మాత్రం కాంగ్రెస్ నుంచే. ఇక్కడ హస్తం పార్టీ నుంచి సోనాల్ పటేల్ ఉన్నారు. 2019 ఎన్నికల్లో అప్పటి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఛతుర్‌సిన్హ్ జవాన్జీ చవ్‌డా 26 శాతానికి పైగా ఓట్లను సాధించగలిగారు. అయితే, ఇక్కడ కాంగ్రెస్ కొంత వరకు బలంగానే ఉన్నది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో బీజేపీ చెప్తున్న 10 లక్షల మెజారిటీ మాట సాధ్యం కాని విషయమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. పైగా నియోజకవర్గంలో ఉన్నది దాదాపు 25 లక్షల ఓటర్లనీ, సగటు ఓటింగ్ 55 శాతం కంటే తక్కువగా ఉంటుందనీ, అలాంటప్పుడు అంత భారీ మెజారిటీ ఆశ అనేది ఒక ప్రచారం మాత్రమేనని విశ్లేషకులు చెప్తున్నారు.

మితిమీరుతున్న విష ప్రచారాలు

సోషల్ మీడియాలో హద్దులు దాటుతున్న బీజేపీ తీరు

రిజర్వేషన్ అంశంపై ఒక వర్గాన్ని టార్గెట్ చేస్తూ వివాదాస్పద పోస్టు
ఎక్స్‌లో పోస్ట్ చేసిన బీజేపీ కర్నాటక యూనిట్
కమలం పార్టీ తీరుపై నెటిజన్ల తీవ్ర ఆగ్రహం



బెంగళూరు : లౌకిక భారతదేశంలో బీజేపీ మత పిచ్చిని రేపుతున్నది. లోక్‌సభ ఎన్నికల్లో ఒక అజెండా అంటూ లేకుండా.. కేవలం మతాల మధ్య విద్వేషాలు రగిలేలా బీజేపీ ప్రచారం చేస్తున్నది. బహిరంగ సమావేశాలైనా, బహిరంగ సభలైనా విభజనవాదాన్ని మాత్రమే ఆ పార్టీ వినిపిస్తున్నది. ప్రధాని మోడీ, కేంద్ర హెూం మంత్రి అమిత్ షా మొదలు కింది స్థాయి నాయకులు, కార్యకర్తల వరకు కూడా ఇదే తీరును పాటిస్తున్నారు. బీజేపీ చేస్తున్న ప్రచారతీరుపై ఇప్పటికే సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ పార్టీ తీరులో మాత్రం మార్పు కనిపించటం లేదు.

కర్నాటకలో మతం ఆధారంగా ఒక వర్గాన్ని అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం ఓబీసీ కేటగిరిలో చేర్చిందని బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. ఇది అసలైన ఓబీసీల రిజర్వేషన్‌ను దెబ్బతీస్తుందని ఆరోపిస్తున్నది. అయితే, ఆ వర్గాన్ని కాంగ్రెస్ తీవ్రంగా బుజ్జగిస్తున్నదనీ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లకు భంగం కలిగేలా ఆ వర్గాన్ని అక్కున చేర్చుకుంటున్నదనే అర్థం వచ్చేలా కర్నాటక కాంగ్రెస్ యూనిట్ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో ఒక వీడియోను పోస్ట్ చేసింది.

వివాదాస్పద వీడియోలో ఏమున్నది?

ఈ వీడియోలో ఉన్న కంటెంట్‌ను బట్టి చూస్తే.. ఒక గూడులో మూడు గుడ్లు ఉంటాయి. ఒక్కో గుడ్డు పైన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు అని రాసి ఉంటుంది. అయితే, ఆ గూడులో ఉన్న మూడు గుడ్లకు అదనంగా కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ, కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యలు మరొక గుడ్డును అదనంగా తెచ్చి వేస్తారు. ఆ గుడ్డుపై ఒక మతానికి చెందిన పేరు ఉంటుంది. తర్వాత ఆ నాలుగు గుడ్ల నుంచి వచ్చిన పిల్లల్లో ఒకదానికి 'ఒక మతం'ను సూచించేలా నెత్తిన టోపీ ఉంటుంది. సిద్ధరామయ్యతో కలిసి వచ్చిన రాహుల్ గాంధీ ఆ మతానికి చెందిన పక్షికి మాత్రమే 'నిధుల'తో పోషిస్తున్నట్టు కనిపిస్తుంది. ఆ తర్వాత ఆ పక్షి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ గుడ్ల నుంచి పొదిగిన పక్షి పిల్లలను ఆ గూడు నుంచి తోసేయటం, రాహుల్ గాంధీ, సిద్ధరామయ్య పాత్రలు నవ్వటం కనిపిస్తుంది.

వివాదాస్పద పోస్ట్‌పై కాంగ్రెస్ ఫిర్యాదు

ఇటు ఈ అంశంపై కాంగ్రెస్ కూడా స్పందించింది. బీజేపీ జాతీయాధ్యక్షుడు జె.పి నడ్డా, ఆ పార్టీ ఐటీ విభాగం ఇంఛార్జ్ అమిత్ మాల్వియా, బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బి.వై విజయేంద్రలపై కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. మతాల మధ్య విద్వేషాన్ని రగిల్చేలా, శతృత్వాన్ని పెంపొందించేలా బీజేపీ పోస్ట్ ఉన్నదని కాంగ్రెస్ ఆరోపించింది. బీజేపీ వీడియో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిందని తెలిపింది. మైనారిటీలను ఈ విధంగా చిత్రీకరించే బీజేపీ పోస్ట్ ఆమోదయోగ్యం కాదని కాంగ్రెస్ నాయకుడు మానిక్యం ఠాగోర్ అన్నారు.

దేశం బీజేపీకి తగిన పాఠం నేర్పుతుంది : ప్రకాశ్‌రాజ్



ఈ వివాదాస్పద పోస్టుపై పలువురు ప్రముఖులు, నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా స్పందిస్తున్నారు. ఒక మతానికి చెందినవారిపై చెడు అభిప్రాయం వచ్చేలా బీజేపీ షేర్ చేసిన వీడియో ఉన్నదనీ, ఇలాంటి చర్యలు సమాజానికి శ్రేయస్కరం కావని మేధావులు అన్నారు. అసహ్యమైన, ద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్న, మత రాజకీయాలు చేస్తున్న హిందూత్వ పార్టీకి కర్నాటక, దేశం తగిన సమాధానం చెప్తుందని ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్ ఆరోపించారు. బీజేపీ వీడియోను 'సిగ్గులేని' పోస్ట్‌గా ఆయన అభివర్ణించారు. బీజేపీ షేర్ చేసిన వీడియో అనేది ఎన్నికల కోడ్ ఉల్లంఘన కాకపోతే కోడ్‌నే రద్దు చేయాల్సిన అవసరం ఉంటుందని విశ్లేషకులు, రాజకీయ వ్యాఖ్యాత సుమంత్ రామన్ ఆరోపించారు. బీజేపీ చర్య అవమానకరమైనదిగా అభివర్ణించారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుగాలి


ఆదివాసీల అణచివేత...మావోయిస్టుల ఎన్‌కౌంటర్లు

అదానీ కోసం లక్షల చెట్ల నరికివేత
వనరులపై కార్పొరేట్ల పంజా
ఈసారి బీజేపీకి షాకే..: కాంగ్రెస్‌కు రాహుల్ జోడో యాత్ర మేలు
రేపు 7 స్థానాల్లో పోలింగ్

రాయపూర్ : ఛత్తీస్‌గఢ్‌లోని మొత్తం 11 నియోజకవర్గాల్లో దేశ వ్యాప్తంగా ఏప్రిల్ 26న జరిగిన రెండవ దశలో 4 స్థానాల్లో ఎన్నికలు జరిగాయి. మిగిలిన ఏడు సీట్లకు మూడో విడతలో మే 7న పోలింగ్ జరగనుంది. జాంజ్‌గీర్, బిలాస్‌పుర్, కోర్బా, రాయ్‌గఢ్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ బలంగాఉంది. బీజేపీ హిందుత్వ రాజకీయాలను, కార్పొరేటీకరణకు గిరిజనులు వ్యతిరేకిస్తున్నారు. రాజధాని రాయ్‌పుర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి వికాస్ ఉపాధ్యయ్‌కు పోటీగా బిజెపి అభ్యర్థి బ్రిజ్‌మోహన్ అగర్వాల్ పోటీ పడుతున్నారు. ఈసారి బీజేపీ సిట్టింగ్ ఎంపీ సునీల్ సోనీని మార్చేసి సీనియర్ ఎంఎల్‌ఏ అగర్వాల్‌కు ఇచ్చింది. ఈ స్థానంలో ఏడుసార్లుగా బీజేపీ గెలుస్తోంది. స్టీల్, ఇనుము, పరిశ్రమల కార్మికులు ఎక్కువగా ఉన్నారు. మూడు లక్షల మంది ఎస్సీలు, 1,28 లక్షలమంది ఎస్టీలు ఉన్నారు. ఇక్కడ 11.29 లక్షల పట్టణ ఓటర్లే కీలకం. దుర్గ్ లోక్‌సభ స్థానంలో ఒకసారి కాంగ్రెస్, మరోసారి బిజెపి గెలుస్తున్నాయి. దుర్గ్ పరిధిలోని 9 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ 8, బీజేపీ ఒకటి గెలిచాయి. దుర్గ్ ప్రాంతానికి దగ్గరలోనే బిలాయ్ స్టీల్ ప్లాంట్ ఉంది. రాష్ట్రంలో అభివృద్ధి చెందిన నగరాల్లో దుర్గ్ ఒకటి. కాంగ్రెస్ నుంచి రాజేంద్ర సాహుకు పోటీగా బిజెపి సిట్టింగ్ ఎంపీ విజయ్ బఘెల్ పోటీపడుతున్నారు.

మతతత్వానికి బీజేపీ పదును

ఆదివాసీ ప్రాబల్యమున్న జాంజ్‌గీర్ ఎస్సీ రిజర్వుడు సీటు. కాంగ్రెస్ నుంచి శివ్‌కుమార్ దహ్రియా, బీజేపీ నుంచి కమలేశ్ జంగడే తలపడుతున్నారు. గత ఎన్నికల్లో బీజేపీ గెలుపొందింది. రాహుల్ జోడో యాత్ర ఛత్తీస్‌గఢ్‌లో జాంజ్‌గీర్ నుంచే ప్రారంభమైంది. గిరిజనులు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారు. మోడీ పర్యటనలో భాగంగా ఏప్రిల్ 23న జంజ్‌గిర్-చంపాలో జరిగి న ర్యాలీలో రామనామి తెగ మత పెద్దలను (ముఖంపై రామనామ ం పచ్చబొట్టు వేయించుకున్నవా రు) మోడీ తన పక్కనే కూర్చోబెట్టుకోవడం, అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ట ఆహ్వానాన్ని కాంగ్రెస్ తిరస్కరించడం రాముడి తల్లి ఇలాకా అయిన ఛత్తీస్‌గఢ్‌కు అగౌరవం కాదా అని మోడీ చేసిన వ్యాఖ్యలు మతతత్వ రాజకీయాలకు అద్దంపడుతున్నాయని విశ్లేషకులు అంటున్నారు. క్రైస్తవ మిషనరీల ముసుగులో మతమార్పిడిలకు పాల్పడుతున్నారని బిజెపి సిఎం స్వయంగా ఆరోపించారు. రాయగఢ్‌లో గోండు గిరిజనుల ప్రాబల్యమెక్కువ. ఎస్టీలకు రిజర్వ్ చేయబడిన ఈ స్థానంలో కాంగ్రెస్‌కు పట్టుంది. కాంగ్రెస్ సిట్టింగ్ ఎంపీ పుష్పాదేవికి బదులు ఆమె చెల్లి మేనకా దేవికి టిక్కెట్టు దక్కింది. మేనకా తండ్రి రాజానరేష్ చంద్రసింగ్ మధ్యప్రదేశ్ కాంగ్రెస్ సీఎంగా, మంత్రిగా పనిచేశారు. బిజెపి నుంచి రాథేశ్యాం రాఠియా పోటీ చేస్తున్నారు.



బొగ్గు కాలుష్య సమస్య

దేశంలోనే అత్యధిక బొగ్గు ఉత్పత్తి జరిగే జిల్లా కోర్బాలో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. పోటీ కూడా మహిళల మధ్యే నడుస్తోంది. కాంగ్రెస్ అభ్యర్థి జోత్స్న మహం త్‌కు పోటీగా బీజేపీ అభ్యర్థి సరోజ్ పాండే పోటీ పడుతున్నారు. ఈ నియోజకవర్గంపై కాంగ్రెస్‌కు పట్టుంది. 2014 మినహా ప్రతిసారీ కాంగ్రెస్ గెలుపొందుతోంది. సరోజ్‌పాండే రాజ్యసభ సభ్యురాలు, గతంలో దుర్గ్ నుంచి ఎంపిగా ఎన్నికయ్యారు. బొగ్గు గనుల నుంచి వచ్చే దుమ్ము వల్ల పర్యావరణ కాలుష్యం, గనుల కోసం భూములిచ్చిన వారికి పరిహారం, ఉద్యోగ కల్పన వంటి స్థానిక సమస్యలున్నాయి.

అదానీ చెట్ల నరికివేతపై వ్యతిరేకత

బిలాస్‌పుర్‌లో కాంగ్రెస్ నుంచి దేవేంద్ర యాదవ్‌కు పోటీగా బీజేపీ అభ్యర్థి తోఖన్‌సా హు బరిలో నిలిచారు. దేవేంద్ర యాదవ్ బిలాయ్ నగర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే ఈ టిక్కెట్ జగదీష్ కౌశిక్ తనకు కేటాయించాలని కోరినప్పటికీ దేవేంద్రకే సీటు దక్కింది. దేవేంద్ర యాదవ్ దేశంలోనే అతి చిన్న వయస్సులో 25 ఏండ్లకే మేయరుగా ఎన్నికయ్యారు. ఈ ప్రాంతంలోనూ రాహుల్ పర్యటించారు. సర్గుజా ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి గోండ్ వర్గానికి చెందిన యువనాయకురాలు శశి సింగ్‌తో బిజెపి అభ్యర్థి చింతామణి మహారాజ్ పోటీ పడుతున్నారు. 2023లో చింతామణి కాంగ్రెస్ నుంచి బీజేపీ లోకి చేరడంతో ఆయనకు ఈ సీటు దక్కింది. అదానీ గ్రూపు బొగ్గు గనుల కోసం 2 లక్షలకు పైగా చెట్ల నరికివేత బిజెపి ప్రభుత్వం పట్ల స్థానిక ప్రజలు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు.

- గిరిజన హక్కులను కాలరాసి కార్పొరేట్ ప్రయోజనాల కోసం బీజేపీ పనిచేస్తోంది. కార్చిచ్చులు పేరిట, మైనింగ్ ప్రాజెక్టుల కోసం అరణ్యాలను కరిగించేస్తోంది. నీరు, అరణ్యం, భూముల కోసం ఆదివాసీల ఆందోళనలను రాష్ట్ర బీజేపీ ప్రభుత్వం అమానుషంగా అణచివేస్తోంది.
- రెండేండ్లలో నక్సలైట్లను ఏరిపారేస్తామన్న కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటనను రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తోంది. ఏప్రిల్ 16న 29 మంది, 30న 10 మంది మావోయిస్టులను భద్రతా బలగాలు ఎన్‌కౌంటర్ చేశాయి. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 91 మంది మావోయిస్టులు పోలీస్ కాల్పుల్లో చనిపోయారు. 123 మంది అరెస్టు కాగా, 250మంది లొంగిపోయారు. లోక్‌సభ ఎన్నికలపై ఈ పరిణామాల ప్రభావం పడుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

స్మృతి ఇరానీని ఓడించడం ఖాయం : కెఎల్ శర్మ

అమేథీ : కాంగ్రెస్ పార్టీ ఎన్నోరోజులు చర్చలు జరిపి అమేథీ, రాయ్‌బరేలీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. రాయ్‌బరేలీ నుంచి రాహుల్ గాంధీ, అమేథీ నుంచి కిశోరీలాల్ శర్మ పోటీ చేస్తున్నారు. అమేథీ నుంచి బరిలోకి దిగిన కెఎల్ శర్మ మీడియాతో మాట్లాడుతూ.. 'ఈ ఎన్నికల్లో స్మృతి ఇరానీని ఓడించడం ఖాయం. ఇది నేను చేస్తున్న పెద్ద ప్రకటన. నేను అమేథీ నుంచి పోటీ చేయడమనేది అధిష్టానం నిర్ణయం.' అని అన్నారు. కాగా, కెఎల్ శర్మ 1983లో రాజీవ్ గాంధీతో కలిసి పనిచేశారు. 1991లో రాజీవ్ గాంధీ తర్వాత కెప్టెన్ సతీష్ శర్మతో కలిసి అమేథీలో పనిచేశారు. ఆ తరువాత సోనియగాంధీ 1999లో అమేథీ నుంచి పోటీ చేసినప్పుడు ఆ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా పనిచేశారు. ఆ తర్వాత రాయ్‌బరేలీ, అమేథీ రెండుస్థానాలకు ఆయన ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. గాంధీయేతర కుటుంబ సభ్యులు అమేథీ నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ఇది రెండోసారి. గతంలో 1991లో ఈ స్థానం నుంచి సతీష్ శర్మ లోక్‌సభకు ఎన్నికయ్యారు.

లౌకిక దేవాలయం కోసం

కూలి పోయిన గోడల మధ్య
నేనూ, ప్రజాస్వామ్యం నివాసముంటున్నాం
నెత్తిన ఆకాశమే పైకప్పు
సముద్రం ఆటుపోట్ల మధ్య
తూట్లు పడ్డ పడవలో మా ఉనికి
ఒకే బోనులో పులిని,
మేకను కట్టేసినట్లుంది
ఈదురు గాలులు,
వడగాడ్పుల మధ్య
మేం కాపురంలో
వున్నాం చీకిపోయిన
నూలుపోగులతో
సమాన హక్కుల శాలువా
నేయబడుతూనే వుంది
చిరుగులపై అతుకులు,
చింపుతూ నేస్తూనే వున్నారు
అతుకుల బొంతగా మార్చే ప్రయత్నం ఆగటం లేదు
శిథిలాల మధ్య మా కాపురం!
దీపం రెపరెపల మధ్య నిండు జీవితాలు
ప్రజాస్వామ్య ఉనికి మినుకు, మినుకు మంటుంది
నిందలు, అపనిందలు వీడి
ఆరోపణ, ప్రత్యారోపణలకు స్వస్తిపలికి
వెలుగు చీకట్ల మధ్యైనా సరే రా నేస్తం
మానవ హారంగా ఓ వంతెనను నిర్మిద్దాం
అటునుంచి నువ్వు, ఇటు నుంచి నేను కదిలి
భారతీయ ఆత్మను మన కలయిక చిహ్నంగా
లౌకిక దేవాలయం నిర్మిద్దాం



- హనీఫ్, 9247580946

రేపటి సమాజానికి నేటి భరోసా



- ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్
98490 82693

35 మంది కవులు పాల్గొన్న ఈ సమ్మేళనం దేశంలోని అసమానత్వాన్ని ప్రశ్నించింది. భారత రాజ్యాంగ పరిరక్షణ ఆవశ్యకతను నొక్కి చెప్పింది. మనుషుల మధ్య ఉండాల్సిన స్నేహ సంబంధాలు మతం ఎగదోస్తున్న మంటల్లో సజీవంగా ఆహుతి అవుతున్న దుఃఖ సమయానికి విచారం వ్యక్తం చేసింది. కార్మికుల, కర్షకుల స్వేద దరహాసాన్ని ఆవిష్కరించింది. ఏప్రిల్ 28న కాకతీయ యూనివర్సిటీలో సమూహ సమావేశంపై జరిగిన దాడిని సమ్మేళనం తీవ్రంగా ఖండించింది.

మహాకవి శ్రీశ్రీ 114వ జయంతిని, కార్మిక దినోత్సవం మేడేను పురస్కరించుకుని తెలంగాణ సాహితి ఏప్రిల్ 30న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన శ్రామిక కవి సమ్మేళనం వర్తమానంలోని మతోన్మాద చర్యలను నిరసిస్తూ, ప్రజలు కలలుకంటున్న ప్రజాతంత్ర సమాజాన్ని హామీ ఇచ్చింది. మనుషులను మనుషులుగా కాకుండా కులాలుగా, మతాలుగా చూసే రోజు వచ్చిందని విచారం వ్యక్తం చేశారు అధ్యక్షత వహించిన ఏబూషి నర్సింహ. **"చీమలకు చక్కర వేసి - పాములకు పాలుపోసిన దయగల దేశం మనదేనా!? మరి మూకదాడులతో హింసోన్మాదం సృష్టిస్తున్నం ఎందుకనీ? ఎందుకనీ?? పిల్లలూ దేవుడూ చల్లని వారని పాట పాడుకున్నోళ్ళం - మరి పిల్లల తల్లుల చెరిపి చంపుతె చూసి మాట్లాడ వెందుకనీ !? ఎందుకనీ!??"** అంటూ వారు రాసి పాడిన పాట మతోన్మాద శక్తులను గల్లాపట్టి ప్రశ్నించింది.

"రెండు రెళ్ళు నాలుగన్నందుకు/ గుండాలు గండ్రాళ్ళు విసిరే సీమలో/ క్షేమం అవిభాజ్యం అంటే/ జైళ్ళు నోళ్ళు తెరిచే భూమిలో నే మనం ఇంకా ఉన్నాం" అంటూ - మనం నిజాలు మాట్లాడుతుంటే మన మీద నిప్పుల వర్షం కురిపిస్తున్న ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా మనం పెద్ద యుద్ధమే చేయాల్సి ఉందంటూ ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కవి యాకూబ్ పిలుపు నిచ్చారు.

మన చుట్టూ ఉన్న మనుషులను మనం మనుషులుగా కాకుండా వారి వేషధారణను బట్టి అనుమానించే రోజులు రావడం మన భారత రాజ్యాంగాన్ని అవహేళన చేయడమేనని నిరసించారు. ఈ సభకు విశిష్ట అతిథిగా వచ్చిన మహెజబీన్ 'పౌరసత్వం అపహాస్యం చేయబడుతున్న వేళ/ Fundamental rights ఏం చేసుకోను?' ప్రశ్నే దేశ ద్రోహమవుతున్న వేళ నేను అస్తిత్వ వేదనా కెరటమై ఎగిసిపడక తప్పదంటూ మన పాలకుల అప్రజాస్వామిక ధోరణిపై ఆగ్రహ కవిత్వమై పోయారు. తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ఆనందాచారి మాట్లాడుతూ.. మార్క్స్ చెప్పిన సారాంశాన్నే శ్రీశ్రీ కవిత్వంగా అందించారని తెలిపారు. ఫాసిజం ప్రపంచమంతా, ముఖ్యంగా మన దేశంలో విస్తరించేందుకు యత్నిస్తున్న తరుణంలో శ్రీశ్రీ కవిత్వం మరింత అవసరమని అన్నారు. మనుషులను విభజిస్తున్న ఈ పరిస్థితిలో వర్గ సంఘర్షణతోనే మనిషి మనిషిగా మారతాడని తెలిపారు. హిందూ ముస్లీం ఘర్షణ జరిగిన ముజఫర్‌నగర్‌లో రైతు ఉద్యమంతో వర్గ సంఘర్షణ వారిని కలిపిందని చెప్పారు. అలాంటి సంఘ ర్షణకు ఉత్సాహమిచ్చే కవిత్వం రావాలని ఆకాంక్షించారు. సంపద సృష్టికర్తలు శ్రామికులేననే విషయాన్ని జగమంతా చెప్పాలని పిలుపునిచ్చారు.

సుమారు 30 మంది కవులు పాల్గొన్న ఈ సమ్మేళనం దేశంలోని అసమానత్వాన్ని ప్రశ్నించింది. భారత రాజ్యాంగ పరిరక్షణ ఆవశ్యకతను నొక్కి చెప్పింది. మనుషుల మధ్య ఉండాల్సిన స్నేహ సంబంధాలు మతం ఎగదోస్తున్న మంటల్లో సజీవంగా ఆహుతి అవుతున్న దుఃఖ సమయానికి విచారం వ్యక్తం చేసింది. కార్మికుల, కర్షకుల స్వేద దరహాసాన్ని ఆవిష్కరించింది. ఏప్రిల్ 28న కాకతీయ యూనివర్సిటీలో సమూహ సమావేశంపై జరిగిన దాడిని సమ్మేళనం తీవ్రంగా ఖండించింది.

"ముళ్ళ మధ్య గులాబి పువ్వులాంటి సున్నితత్వం కార్మికుల నైపుణ్యం" అంటూ ఆలోచించదగిన కవిత వినిపించారు హనీఫ్. "స్వేదం అంటని పద్యాలకు పాదాలుండవు రెక్కలు తప్ప" అంటూ కోట్ల వెంకటేశ్వరరెడ్డి తన కవితలో ఉదయాస్తమయాల ఉనికిని ఎరుక చెప్పారు. "పని పొగరు నా నెత్తిమీద రుమాలుకు నెమలీక రంగులద్ది నాట్యమాడుతది" అంటూ డా. రూప్ కుమార్ డబ్బీకార్ రాసిన కవితలో ప్రభుత్వం ఇచ్చే ఉచిత పథకాల కన్నా పని చేసుకొని బతకడమే మాకు గౌరవంగా ఉందంటూ శ్రమ జీవుల అంతరంగాన్ని ఆవిష్కరించారు. "ప్రపంచీకరణ చంపుడు పందెంలో కుల వృత్తుల ఉనికే తీరని ప్రశ్న" అంటూ మండల స్వామి రాసిన కవిత పనిముట్లకు పదునెక్కించిన వృత్తి కార్మికుల దైన్య స్థితికి అద్దం పట్టింది. "ఎర్రటి ఎండల్లో నక్షత్రాల్లా మెరుస్తున్నారు కార్మికులు" అంటూ భాగ్య మంచి కవిత వినిపించారు.

"అవును. అతను మళ్ళీ ఈ దారిలోనే వస్తాడు. అతనికి స్వాగతం చెప్పేందుకు కొన్ని కొత్త పిడికిళ్ళను పోగేయాలి" అంటూ రేపటికి భరోసా కలిగించే కవిత్వం డా.చెమన్ వినిపించారు. "అందమయిన వికృత ముఖ చిత్రం" ఎలా ఉందో జ్వలిత వినిపిస్తూ సమాజం కారుస్తున్న మొసలి కన్నీటిని బట్టబయలు చేశారు. "రాతి గోడలు, ముళ్ళ పొదల్లోని నిగూఢ రహస్యాలను, నిషేధించిన స్వప్నాలను" సి.హెచ్. ఉషారాణి తన కవితలో వినిపించారు. "మానవ సంబంధాలకు వ్యాపారపు రంగుపూసి/ దుఃఖపు వాకిలిలో చేరగిలపడ్డామ" అంటూ ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్ మలినమైన మానవ సంబంధాల మడత పేచీని విప్పి చెప్పారు. "ప్రజాస్వామ్యం అంతా చిందర వందర గందరగోళమై శునకాలు చింపిన విస్తరి అయ్యింది" అంటూ మహేష్ దుర్గే తన కవితలో ఆవేదన వ్యక్తం చేశారు.

"మంచి మాటల నీతులు/ సమసమాజ నిర్మాణ రీతులు/ నీ కవితా జలపాతాలు/ కవీ, నీ గీతాలు" అంటూ డా. రాపోలు సుదర్శన్ శ్రీ శ్రీ పై కవిత వినిపిస్తే... "నీవెప్పుడూ/ నిప్పులు కక్కుతూ/ నింగికి ఎగిరే వాడివే/ నిప్పు కణికవై నిత్యం మాలో ప్రవహించే వాడివే" అంటూ నస్రీన్ ఖాన్ శ్రీశ్రీ ని మరోకోణంలో స్మరించుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు చూసి కవి ఎంత బలంగా ప్రభావితం అవుతాడో చెప్పడానికి ఎలాంటి సందేహం అవసరం లేదు. అలాంటి వారిలో శ్రీశ్రీ కూడా అందుకు మినహాయింపు కాదు. అలాంటి కవి అవసరం నేడే ఎక్కువగా ఉంది. నేడు దేశంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను అర్థం చేసుకొని ప్రభావవంతమైన కవిత్వం రాయడం, తద్వారా సమాజాన్ని చైతన్యం చేయాల్సిన అవసరం వర్తమాన కవులపై, మరి ముఖ్యంగా యువతపై ఉందని ఈ సమ్మేళనం అభిప్రాయపడింది. ఇంకా ఈ సమ్మేళనంలో కందుకూరి శ్రీరాములు, నాంపల్లి సుజాత, దాసరి మోహన్, కుడికాల వంశీధర్, ఉప్పల పద్మ, కొండా రవీంద్ర, ముజాహిద్, అశోక్ దుర్గం వారి వారి కవితలను వినిపించారు.





సాహితీ వార్తలు

ఆహ్వానం

ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటలకు హైదారబాద్ జూబ్లీహిల్స్‌లోని ముప్పవరపు వెంకయ్య నాయుడు స్వగృహంలో చెన్నమనేని రంగనాయకమ్మ స్మారక విశిష్టాద్వైత జాతీయ సాహిత్య పురస్కార సభ జరుగుతుంది. ఇందులో ముప్పవరపు వెంకయ్య నాయుడు, రేవూరి అనంత పద్మనాభరావు, శ్రీదేవి మురళీధర్, డా॥వైష్ణవ వేంకటరమణమూర్తి, గార రంగనాథం పాల్గొంటారు.

పెందోట సాహిత్య పురస్కారాలు

పెందోట సాహిత్య పురస్కారాలకై 2023 సంవత్సరములు ముద్రితమైన 1. పద్య కావ్యాలు, 2. వచన కవిత సంపుటాలు 3. కథా సంపుటాలు 4. బాలకథ సంపుటాలు, 5 బాలగేయ సంపుటాలు, 6. బాల కవిత,గేయ, కథా సంకలనాలను రెండు ప్రతులను ఈ నెల 15వ తేదీలోపు 'ఇంటి నంబరు 17-128/3, శ్రీనగర్ కాలనీ, సిద్ధిపేట-502103' చిరునామాకు పంపాలి. జూన్ నెలలో శ్రీ వాణి సాహిత్య పరిషత్ పదవ వార్షికోత్సవ సభలో నగదు బహుమతి, శాలువా, ప్రశంసా పత్రం ఇవ్వబడును

- పెందోట వెంకటేశ్వర్లు, 9440524546

గీతమ్ పురస్కారం కొరకు...

గీతమ్ సంస్థ పన్నెండవ వార్షికోత్సవం సందర్భంగా ఉత్తమ కవితా సంపుటాల పోటీ నిర్వహిస్తున్నారు. అత్యుత్తమ సంపుటికి 10116/- రూపాయలు, జ్ఞాపికతో పురస్కారం వుంటుంది. 2016 నుండి 2024 మధ్య కాలంలో విడుదలైన సంపుటాల 3 కాపీలు 'అధ్యక్షులు, గీతమ్ సాహితీ సంస్థ, పిఠాపురం - 533450' చిరనామాకు జూన్ నెలలోపు పంపాలి. వివరాలకు : 9848398240.

నెలపాడుపును తుంచటమే

చెట్టు పుట్ట గట్టులా
మందిర్ మసీదు చర్చీలు
చెలిమెలు నదులు సముద్రాలలా
రంగురంగుల పూలసమ్మేళనంలా భిన్నత్వంలో ఏకత్వం
ఆలయాలు మతప్రబోధకులెందరున్నా
అన్నం పెట్టేది రైతన్నలే గాయమైతే అమ్మనే తలిచేది
ఓదార్చేది అమ్మనే బతుకు దారి చూపేది నాన్ననే!
లేని జన్మల కోసం పాకులాడి
స్వర్గంకోసమని చెడ్డదారులకు సున్నమేయకు
సహృదయంతో హరితగీతమై ప్రతిధ్వనించు
చేతులుంటే అశోకుడులా చెట్లు నాటు
నిందితుడు నవ్వడం కాదు
సామాన్యుడు నక్షత్రమై మెరువాలి
దేవుడు ఊరేగడము కాదు
మానవుడు మహాత్ముడై నడువాలి
దారితప్పిన ఆలోచనలకు చరమగీతమై
సామాజిక ధర్మధ్వజం ఎగురవేయ్
ద్వేషంతో అవమానించకు
భారతప్రజల చెమటతడుల సమ్మేళనమే భారత రాజ్యాంగం
అమ్మానాన్నలు కలిసి రాసిన రాజ్యపత్రం
నిచ్చెనకెన్ని మెట్లో అన్ని అవమానాలు
భూమికెన్నీ గాయాలో అన్ని అణచివేతలు
పీడితుల కన్ని దుఃఖాలు
సమతను తలపాగగా మనవత్వాన్ని శిఖరం చేశాడు
ప్రజాస్వామ్యాన్ని ఆకాశంగా స్వేచ్ఛను
హిమాలయం చేశాడు
ఓటు సకలజనుల హక్కుగా
సామాజిక న్యాయపు బావుటాగా
అస్తిత్వ చైతన్యపు జెండను ఎగరేసినందుకేనా రాజ్యాంగంపై
బుద్దిలేని కూతలు
పెట్టుబడుల గారడీలతో అడుగడుగు విద్వేషపు కత్తులై
ఊపిరినలిపె అరాచకాలు
భూగోళం వంటినిండా కురుపులు
గోవుమాంసపు యజమానులతో
ఎలక్టోరల్ బాండ్ల స్వైరవిహారాలు
సరిహద్దుల్లో నెత్తురు పండుగకాదు
సర్వప్రాణులపై ప్రేమను పంచు
నీ ఆశయం సూర్యుడైతే దారులన్ని వెలుగుచెయ్
పవిత్ర భూమిగ్రంథ్యనదులు
అద్భుత స్వయంభూ ఆలయాలు
రుషితుల్యులు త్యాగ ధనులు నడయాడిన నేలన
రక్తాభిషేకాలేమిటి
పంట రాశుల సంకల్పాలు చెదలుపట్టి
డిల్లీలో రైతుల తండ్లాటలేమిటి
భక్తి ప్రబోధాలన్నీ బండల పాలా
మణిపూర్ ను మంట పెట్టడం
చందమామను కాల్చుకు తినటమే
సెక్యులరిజాన్ని చెరిపేయటం
నెలపాడుపును తుంచటమే
లౌకిక వాదమే ఈ దేశ తిలకం
భారత రాజ్యాంగమే ఈ దేశపు గుండె

- వనపట్ల సుబ్బయ్య, 9492765358

ఒక ఉద్యమకారుడి ముచ్చట

సింగరేణి బొగ్గు గనుల్లో ఉద్యోగిగా చేసి కార్మికుల హక్కుల కోసం పోరుబాటను ఎంచుకొని లాకప్పులు, పోలీసు చిత్రహింసలను, జైలు జీవితాన్ని, అజ్ఞాత జీవితాన్ని అనుభవించి ఆనాటి కాలానికి, పోరాట ఘట్టాలకు సాక్షి భూతమైన ఒక ఉద్యమకారుడు రాసిన తన స్వీయ జీవితమే "బొగ్గు రవ్వలు" పుస్తకం.

భారత విప్లవ చరిత్రలో రైతాంగ పోరాటాలతో పాటుగా కార్మిక పోరాటాలకు కూడా మహెూన్నతమైన స్థానం ఉన్నది. అలాంటి చారిత్రక ఘటనల్లో తెలుగు నేల మీద తనదంటూ ఒక పోరాటాన్ని, ధిక్కారాన్ని చరిత్రలో బదిలీపరచుకున్నది సింగరేణి.

ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలో విస్తరించిన సింగరేణి బొగ్గుగనులోని కార్మికుల జీవితాలు దుర్భరంగా ఉండేవి కనీస హక్కులు అమలు కానీ అలాంటి యాజమాన్య నియంతత్వం నుండి కార్మికులను విముక్తి చేసే దిశగా జరిగిన పోరాటాలు చెప్పుకోదగ్గవి.

సింగరేణి కార్మికుల పోరాటం కేవలం కార్మికుల హక్కుల కోసం, హక్కుల సాధన కోసం మాత్రమే జరిగిన పోరాటంగా కాక భారతదేశ ఆర్థిక విధానాల పైన సామాజిక రుగ్మతల పైన పోరాడినటువంటి చరిత్ర సింగరేణి కార్మికులకు ఉన్నది.

సింగరేణి బొగ్గు గనుల్లో ఉద్యోగిగా చేసి కార్మికుల హక్కుల కోసం పోరుబాటను ఎంచుకొని లాకప్పులు, పోలీసు చిత్రహింసలను, జైలు జీవితాన్ని, అజ్ఞాత జీవితాన్ని అనుభవించి ఆనాటి కాలానికి, పోరాట ఘట్టాలకు సాక్షి భూతమైన ఒక ఉద్యమకారుడు రాసిన తన స్వీయ జీవితమే "బొగ్గు రవ్వలు" పుస్తకం.



ప్రపంచ పోరాటాల చరిత్రలో ఉద్యమకారుడే స్వయంగా రచయితగా మారి రాసిన అనుభవాలను పుస్తకంగా తెచ్చిన వారు చాలా తక్కువగా కనిపిస్తారు. అలాంటి బహు అరుదైన ఉద్యమ రచయితలలో గురిజాల రవీందర్ ఒకరు. ఇక్కడ విశేషమేమంటే రవీందర్ మొదటి నుండి రచయిత కాదు. గతంలో ఎలాంటి పుస్తకాలను ఆయన రాయలేదు. కానీ తాను చూసిన తాను భాగస్వామ్యమైన ప్రజా పోరాట కాలాన్ని అక్షరబద్ధం చేయడానికి ఆయన రచయితగా మారవలసిన అనివార్య స్థితిలోంచి ఈ పుస్తకాన్ని రాసాడు.

తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో పేరుకుపోయిన వెట్టి చాకిరి, భూస్వాముల దౌర్జన్యాలు, రైతు కూలీల సమస్యలపై విప్లవోద్యమం ప్రజలను చైతన్యపరచడంలో పూర్తి విజయాన్ని సాధించింది. ప్రజల కోసం జరుగుతున్న ఈ పోరాటం విద్యార్థులను కూడా ప్రభావితం చేసింది. దానితో అనేక మంది విద్యార్థులు పోరాటంలో భాగస్వామ్యం అయ్యేందుకు గ్రామాల్లో ప్రజలను చైతన్యపరిచే బాధ్యతను తీసుకున్నారు. అదే సమయంలో తెలంగాణ నాలుగు జిల్లాల్లో విస్తరించి ఉన్న సింగరేణి కార్మికులను కూడా ఈ పోరాటాలు ప్రభావితం చేసాయి. సింగరేణి ఉద్యోగులందరూ ఇదే జిల్లాల లోని గ్రామీణ ప్రాంతాల్లో నుండి వచ్చిన వారు కావడం వల్ల, రైతు కూలీ కుటుంబాల నుండి వచ్చిన వారైనందువలన ఈ పోరాటాలు సింగరేణి కార్మికులను సహజంగానే ప్రభావితం చేయగలిగాయి. గ్రామాల్లోని భూస్వామ్య సమస్యలు లాంటివే సింగరేణిలో ఉండటం వలన సింగరేణి యాజమాన్యం నియంతత్వాలకు వ్యతిరేకంగా కార్మిక హక్కుల కోసం సింగరేణి కార్మికులు పెద్ద ఎత్తున ఉద్యమించారు.

ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమంలో భాగంగా మందమర్రి బెల్లంపల్లి ప్రాంతాల్లో ప్రజలను యువకులను చైతన్య పరుస్తున్న క్రమంలో రవీందర్ గంగారాంకు పరిచయమయ్యాడు. సమాజ స్థితిగతులు ప్రజల బాధలు అవి మార్చవలసిన అవసరాన్ని గురించి గంగారం ఆలోచనలు రవీందర్ ను బాగా ప్రభావితం చేశాయి. అలా ప్రజల కోసం పనిచేయాలనే రవీందర్ ఆలోచన ఆయనను ఉద్యమంలో భాగస్వామ్యం చేసింది. ప్రభుత్వం పోలీసులు ఉద్యమకారులను ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం, పరస్పర దాడులు.. దానితో ఉద్యమకారులు అజ్ఞాతంలోకి వెళ్లడం రవీందర్ ఆయన శ్రీమతి సరళా కూడా పోలీసులకు దొరకకుండా రహస్య జీవితంలోకి వెళ్లడం ఆ తర్వాత వాళ్ళు ఎదుర్కొన్న నిర్బంధాలు, కష్టాలు పుస్తకంలో మనకు ఒక సినిమా లాగా కనిపిస్తాయి. పుస్తకం మొదటి నుండి చివరి వరకు కూడా వదిలిపెట్టకుండా చదివించే విధానంలో రవీందర్ తన మొదటి పుస్తకం తోనే విజయం సాధించాడు. సాధారణంగా మనం కాల్పనిక కథల్లో అలాంటిది చూస్తాం. కానీ పూర్తిగా యదార్ధ జీవిత సంఘటనలను మాత్రమే చెప్పిన రవీందర్ - సరళ ల ఉద్యమ జీవిత కథ అంతే ఏకబిగిన చదివించే విధంగా ఉండడం తో పాఠకుణ్ణి పూర్తిగా తనతో పాటుగా తీసుకెళుతూ ఆ సంఘటనల దశ్యాల్లో లీనం చేయడం గొప్ప విషయం.

డేవిడ్ గిల్బర్ట్ రాసిన 'లవ్ అండ్ స్ట్రగుల్' స్వీయ కథలాగా రవీందర్ తన విప్లవ జీవితాన్ని మన పక్కన కూర్చొని చెబుతున్నట్టుగా ఉంటుంది. మరింత మెరుగైన సమాజం కోసం, స్వేచ్ఛకోసం, ఉదారమైన ప్రపంచం కోసం గిల్బర్ట్ కలలు కన్నాడు. తీవ్ర నిర్బంధాలను ఎదుర్కొని జైలు జీవితంతో ఆయన ఈ పుస్తకాన్ని రాశాడు. రవీందర్ జీవితంలో కూడా జైలు జీవితం ఒక ప్రత్యేకమైన ఘట్టం. జైలు అనగానే మన అందరి దష్టిలో ఉండే ఒక నేరపూరిత వ్యక్తులు ఉండే చోటుగా కాకుండా ఒక భిన్నమైన ఆలోచనత్మకమైన, మేధోపరమైన చర్చలతో కొనసాగే వ్యక్తులు మనకు జైలులో కనిపిస్తారు. ఎవరో అన్నట్టు జైల్లో ఉండవలసిన వారు బయట ఉన్నారు బయట ఉండవలసిన వారు జైల్లో ఉన్నారని అనిపిస్తుంది మనకు ఈ పుస్తకం చదివితే. రవీందర్ - సరళలు ఉద్యమం కోసం పనిచేసే క్రమంలో వేరువేరు చోట్ల ఉండాల్సి రావడం ప్రజల కోసం పనిచేసే క్రమంలో అజ్ఞాతంగా పోలీసులకు దొరకకుండా సరళ నెలల చంటి పిల్లతో ఊరూరు తిరగడం, దగ్గర వారు కూడా వాళ్ళ ఇళ్లలో ఉంచుకోవడానికి వెనకడుగు వేయడం అన్ని సంఘటనలు మన కళ్ళ ముందు రీళ్ళు రీళ్లుగా కదులుతుంటాయి. నిజానికి అజ్ఞాత విప్లవ మహిళా జీవితాల గురించిన సాహిత్యం గాని స్వీయ చరిత్రలు గాని మనకు బహు అరుదుగా కనిపిస్తాయి.

రవీందర్ పుస్తకంలో రాసిన ఆనాటి సన్నివేశాలు చాలా ఆసక్తికరంగా నడుస్తుంది. భార్యాభర్తలిద్దరు ఉద్యమంలో పనిచేయడానికి వీలు లేకపోవటంతో ఉద్యమాన్ని వీడి బయటికి రావాలని నిర్ణయించుకోవడం, ఆ తర్వాత కోర్టులో లొంగిపోవడం వరకు పాఠకుడు ఎక్కడ ఆగకుండా చదివించే సన్నివేశాలు ఈ పుస్తకంలో మనకు కనిపిస్తాయి. చాలావరకు విప్లవ సంఘాల్లో పని చేసేవారు విప్లవనిబద్ధతను, నిర్బంధాలను తట్టుకోలేక విప్లవ పార్టీల నుండి దూరం అవ్వడం మనం చూస్తుంటాం. కానీ పనిచేయడానికి సరైన అవకాశం పార్టీ ఇవ్వలేదని పార్టీ నుండి బయటికి వచ్చిన రవీందర్ - సరళ లాంటి వారు చాలా అరుదుగా ఉంటారు. విప్లవ కార్యచరణలోని నిర్బంధాలతో పాటుగా మనుషులు నిత్య చైతన్యమవడం మనకు ఈ పుస్తకంలో చూస్తాం ఈ పుస్తకం చదువుతున్నప్పుడు ఆ కాలంలో జరిగిన అనేక సంఘటనలు పత్రికలో మనం చదివిన కొన్ని సంఘటనలు, కొంతమంది వ్యక్తుల పేర్లు, ప్రాంతాలు మనకు తారసపడతాయి. తాను రచయితను కాను అని ముందే చెప్పుకున్న గురిజాల రవీందర్ తన స్వీయ విప్లవ జీవితాన్ని మనకు చెప్పిన ఒక సంభాషణగానే భావించాడు. కానీ ఈ పుస్తకం ఒక మంచి రచన కిందనే పరిగణించవచ్చు. ఉద్యమకారుడే రచయితగా మారి రాసిన బహు అరుదైన ఒక కీలక ప్రక్రియను మనకు ఈ పుస్తకం పరిచయం చేస్తుంది. ఒక మంచి రచయితగా మారే అనేక లక్షణాలు రవీందర్ లో ఉన్నాయనే విషయాన్ని ఈ పుస్తకం మనకు చెప్పకనే చెబుతుంది.సామాజిక అంశాలు ఎత్తి చూపే పుస్తకాలను ప్రచురించే పర్స్పెక్టివ్ ప్రచురణ సంస్థ ఈ పుస్తకాన్ని ప్రచురించింది.



- చెమన్ , 9440385563

తర్జుమా తరంగిణి

ముందుకా, వెనుకకా?

నేను ముందుకు కదిలానా,
లేక వెనుకనే ఉండిపోయానా? చెప్పడం కష్టం!
మనుషుల ప్రధాన స్రవంతిలోంచి
విడివడ్డానని మాత్రమే తెలుసు నాకు
నేను ముందు ఉన్నానోక వెనుక ఉన్నానా అనేదాన్ని
పైనుంచి చూస్తున్న వ్యక్తి చెప్పగలడు బహుశా
ఒకవేళ అతనూ నేనూ కలుసుకుంటే.
ఎప్పుడో ఒకసారి నేనక్కడికి చేరుకుంటానేమో,
అప్పుడు ఇక్కడి దృశ్యం కనిపించవచ్చు
నేను ముందు ఉన్నానా వెనుక ఉన్నానా
అనేదాన్ని నిర్ధారించుకునే అవసరముండదు అప్పుడు

మరాఠీ మూలం: **ప్రఫుల్ శిలేదార్**
ఆంగ్లానువాదం: **మాయా పండిట్**
తెలుగు సేత: **ఎలనాగ**

రంగు



అతడు ..కురుక్షేత్ర నాటకంలో
శ్రీకృష్ణ పాత్ర వేసేడు గుర్తు పట్టేను
హరిశ్చంద్రలో నక్షత్రక పాత్ర వేసేడు గుర్తుపట్టేను
గయోపాఖ్యానంలో గయుడు పాత్ర వేసేడు గుర్తు పట్టేను!
యిలా.. అతడు ముఖానికి రంగేసుకున్నప్పుడల్లా పోల్చుకున్నాను!
యివాల.. బతుకు నాటకంలో.. అతడు యే రంగూ వేసుకోలేదు
అయినా.. పోల్చుకోలేక పోతున్నాను !
బహుశ .. ముఖానికి బదులు మనసుకు రంగేసుకున్నట్లున్నాడు !!

- సిరికి స్వామి నాయుడు

దర్వాజ పేజీపై మీ అభిప్రాయాలను, సూచనలను, సలహాలను, రచనలను darwajapage@gmail.com కు పంపించగలరు. చిరునామా : దర్వాజ, నవతెలంగాణ, ప్లాట్‌నెం. 21/1, అజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్- 500020

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
సోమవారం మే 6, 2024 www.navatelangana.com



ప్రజల మధ్య బీజేపీ మతోన్మాద చిచ్చు

ధరల భారంతో పేదల జీవితాలు ఆగం

భూక్యా బావుసింగ్ వర్ధంతి సభలో సీపీఐ(ఎం) వేత భూక్యా వీరభద్రం

నవతెలంగాణ-కారేపల్లి

బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజల మధ్య మతోన్మాద చిచ్చు రగిలిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్యా వీరభద్రం విమర్శించారు. ఆదివారం కారేపల్లి మండలం నానునగర్‌తండాలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు పోడు పోరాట యోధుడు భూక్యా బావుసింగ్ 2వ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా బావుసింగ్ స్థూపానికి వీరభద్రం పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా యనమనగండ్ల రవి అధ్యక్షతన జరిగిన సభలు భూక్యా వీరభద్రం మాట్లాడుతూ బీజేపీ పాలనలో పేదలు, మధ్యతరగతికి ఒరిగిందేమి లేదన్నారు. నిత్యావసర వస్తువులు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో పేదల జీవితాలు ఆగం అయ్యాయన్నారు. ప్రజా సంపదైన ప్రభుత్వ రంగ సంస్థలు మోడీ తన అనంగులైన అదానీ, అంబానీలకు అప్పనంగా కట్టపెడ్తున్నాడని విమర్శించారు. మోడీ పాలనతో ప్రపంచ వ్యాప్తంగా భారత దేశ ప్రతిష్ట మసకబారిందన్నారు. చీమలపాడు ప్రాంతంలో పోడు, కూలీ పోరాటాలలో భూక్యా బావుసింగ్ అయన కుటుంబం భాగస్వామ్యం ఎంతో ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ దాని మద్దతు పార్టీలను ఓడించటమే అమరులైన బావుసింగ్‌కు ఇచ్చే నివాళ్ల అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కే.నరేంద్ర, నాయకులు వల్లబోయిన కొండలరావు, మన్నెం బ్రహ్మయ్య, ఎరిపోతు భద్రయ్య, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు అజ్మీర శోభన్ బాబు, మాలోతు హనుమా, భారతలక్ష్మి మాచర్ల రమేష్, రాంజీ, భూక్య బావుసింగ్, హరిచంద్ర కు టుంబ సభ్యులు పాల్గొన్నారు.

డీప్‌ఫేక్ ఆడియోలతో ముప్పు

గత కొంత కాలంగా తనపై అసత్య ప్రచారం

గత ఎన్నికల్లో కూడా ఇలానే చేశారు...

కృత్రిమ మేథస్సుతో పొంచి ఉన్న ప్రమాదం

తన గొంతును పోలిన మాటలతో వెలువడిన ఓ ఆడియోపై మాజీ మంత్రి పువ్వాడ స్పందన



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

డీప్‌ఫేక్ ఆడియోలు పెను ముప్పుగా పరిణమిస్తాయని, ఇవి సమాజంలో గందరగోళానికి కారణమవుతున్నాయని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. తన గొంతును పోలిన మాటలతో ఆదివారం వెలుగు చూసిన ఓ ఆడియోపై ఆయన స్పందించారు. గత కొంత కాలంగా తనపైన అసత్య ప్రచారం చేస్తున్నారని, గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంలోనూ ఇదే మాదిరిగా చేశారని తెలిపారు. ఇప్పుడు లోక్ సభ ఎన్నికల సమయంలో కూడా కొందరు ఆగంతకులు తను మాట్లాడినట్టుగా ఓ డీప్‌ఫేక్ ఆడియోను సృష్టించారని పేర్కొన్నారు. ఈ విధమైన దుష్ప్రచారం చేసే వారిపై చట్టపరంగా న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటువంటి డీప్‌ఫేక్ ఆడియోలపై ప్రజలకు మీడియా అవగాహన కల్పించాలని కోరారు. కానీగ కొన్ని దినపత్రికలు, మీడియా సంస్థలు దురుద్దేశపూర్వకంగా వాటిని ప్రజల్లో నిజం అని మైమరిపించేలా తప్పుడు ప్రచురణ, ప్రసారం చేస్తున్నాయని.. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు. కృత్రిమ మేథస్సుతో సృష్టించే ఇటువంటి ఆడియోలతో పెను ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. సమస్యాత్మకమైన ఇటువంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని మీడియాను మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కోరారు.



రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ సీపీఐ(ఎం) ఇంటింటి ప్రచారం

ప్రజాస్వామ్య లౌకిక శక్తులను గెలిపించండి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

నవతెలంగాణ-ఖమ్మం

సీపీఐ(ఎం) బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం ఖమ్మంలోని 31వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ ఎర్ర గోపి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం తిరిగి ఏర్పాటయితే దేశంలో మరింత మతోన్మాద ప్రైవేటీకరణ చర్యలు వేగవంతమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. దేశంలో అమల్లో ఉన్న భారత రాజ్యాంగం పూర్తిగా మార్పు చేసి రాజ్యాంగం స్థానంలో మనువాదాన్ని తీసుకువచ్చే ప్రయత్నాలు జరుగుతాయన్నారు. దేశంలో లౌకికవాద శక్తులు నిలబడాలన్నా ప్రజాస్వామ్యం పునరుద్ధరింపబడాలన్న మతోన్మాద చర్యలు ఎండగట్టాలన్నా ఇండియా కూటమి అభ్యర్థి రఘురాంరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్ర శ్రీకాంత్, జిల్లా నాయకులు ఎర్ర శ్రీనివాసరావు, తుషాకుల లింగయ్య 3 టౌన్ కార్యదర్శి భూక్య శ్రీనివాసరావు, ఎస్కే మస్తాన్, పోతురాజు జార్జి, యర్రా మల్లికార్జున్, ఎడెల్లి నరసింహారావు, ఎర్ర నాగరాజు, రావుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతో భారత రాజ్యాంగానికి ప్రమాదం

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు సమన్యాయం

ఆర్టీఐ మాజీ కమిషనర్ డాక్టర్ శంకర్‌నాయక్



నవతెలంగాణ-కారేపల్లి

బీజేపీతో లౌకిక ప్రజాస్వామ్య భారత రాజ్యాంగానికి ప్రమాదమని ఆర్టీఐ మాజీ కమిషనర్ గుగులోత్ శంకర్‌నాయక్ అన్నారు. ఆదివారం కారేపల్లిలోని కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్టీఐ మాజీ కమిషనర్ మాట్లాడుతూ పదేండ్ల బీజేపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బలహీన వర్గాలు దాడులకు గురైన్నారన్నారు. ఈశాన్య రాష్ట్రాలలో గిరిజనులపై దాడులు, ఉత్తరప్రదేశ్‌లో ఎస్సీలు, మైనార్టీల ఇండ్లను బుల్డోడర్‌తో కూల్చివేతలు నిత్యకృత్యంగా మారాయని విమర్శించారు. రాజ్యాంగం పరిరక్షణ, అన్ని వర్గాల అభ్యున్నతి, సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి గెలుపు ద్వారా కేంద్రంలోని రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలం చేకూర్చాలని కోరారు. వైరా నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ నాయకత్వంలో కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ తీసుకవద్దామన్నారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు సురేందర్ మునియార్, ఎస్టీ సెల్ జిల్లా నాయకులు గుగులోత్ భీముడు, మండల కోఆప్షన్ సభ్యులు ఎండీ.హనీఫ్, షంషుద్దీన్, తాజుద్దీన్, ఓయూ నాయకులు ప్రవీణ్ కుమార్, ఎం.అనిల్ కుమార్, రాజశేఖర్ యాదవ్, రంజిత్ సింగ్, బి.సురేష్ పాల్గొన్నారు.

8న ప్రపంచ తలసేమియా దినోత్సవం

సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ బాధ్యులు

నవతెలంగాణ-ఖమ్మం

ప్రపంచ తలసేమియా దినోత్సవం ఈ నెల 8న సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ కోశాధికారి పి.రవిచంద్రలు తెలిపారు. ఆదివారం ఖమ్మంలోని రితన్య ఆసుపత్రిలోని తలసేమియా డేకేర్ సెంటర్‌లో చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాదిలా ఈ ఏడాది కూడా నెల రోజుల కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. చిన్నారులకు అవసరమైన రక్తం కోసం రక్తదాన శిబిరాలు, వ్యాధిని అరికట్టేందుకు అవగాహన కార్యక్రమాలు, ఉచిత మందుల పంపిణీ నిర్వహించామన్నారు. ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8న బుధవారం జరిగే కార్యక్రమంలో చిన్నారులకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 8 మంది చిన్నారులకు బోన్ మ్యారో చికిత్స చేయించి విజయం సాధించామని, ఈ ఏడాది ఎక్కువ మంది చిన్నారులకు బోన్‌మ్యారో చికిత్స చేయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. డేకేర్ సెంటర్‌లో చిన్నారులకు మ్యూజికల్ చైర్, లేమన్ స్పూన్, బెలూన్స్ తదితర పోటీలు నిర్వహించామని, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డి.నారాయణమూర్తి, సంస్థ ఉపాధ్యక్షురాలు పి.పావని, సభ్యులు పి.ఉదయ్‌భాస్కర్, పి.అనిత, ఎన్.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డిప్యూటీ సీఎం ముదిగొండ రాక

నవతెలంగాణ-ముదిగొండ

ఈనెల 13న జరిగే పార్లమెంటరీ ఎన్నికల్లో భాగంగా సోమవారం సాయంత్రం ముదిగొండలో జరిగే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డి ఎన్నికల ప్రచార సభలో రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పాల్గొనున్నారు. రామసహాయం రఘురామిరెడ్డి ఎన్నికల ప్రచార సభకు మండలంలోని వివిధ గ్రామాల నుండి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు అధికసంఖ్యలో పాల్గొనే జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు కొమ్మినేని రమేష్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

ముదిగొండలో నేడు నామ పర్యటన

బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు సోమవారం ఉదయం మండల కేంద్రమైన ముదిగొండలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా జరిగే ఎన్నికల ప్రచార సభలో ఆయన పాల్గొనున్నారు. నామ నాగేశ్వరరావు ఎన్నికల ప్రచార సభకు నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు వాచేపల్లి లక్ష్మారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

రఘురాంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం

నేలకొండపల్లిలో పొంగులేటి విస్తృత ప్రచారం

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-నేలకొండపల్లి



మండలంలోని మోటాపురం, అమ్మగూడెం, కొరట్లగూడెం, కోనాయిగూడెం, ఆరెగూడెం, ఆచార్లగూడెం, ముజ్జుగూడెం, అనాసాగరం, సదాశివపురం, కొత్త కొత్తూరు గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి ఆదివారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రసాద్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున హాజరై ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధాని చేయాలనే లక్ష్యంతో ప్రజలంతా హస్తం గుర్తుపై ఓటేయాలని కోరారు. ఖమ్మం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రఘురాంరెడ్డికి భారీ మెజారిటీ అందించాలని కోరారు. రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయంతో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడి పేదలందరికీ ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలు అందించడం జరిగిందన్నారు. దేశంలో కూడా ఇందిరమ్మ రాజ్య స్థాపన ద్వారా ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందించడంతో పాటు దేశం వ్యవసాయకంగా, పారిశ్రామికంగా అన్ని రంగాలలో అభివృద్ధి సాధించబోతుందన్నారు. అనంతరం మండలంలోని ముజ్జుగూడం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన 25 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పొంగులేటి ప్రసాద్‌రెడ్డి వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో గంధం నాగరాజు, సీమ విజయ్, సీమ బాబు, భాస్కర్, మోకాలు రాములు, యాతాకుల రాజా, శ్రీనివాసరావు, నారాయణ, గోవిందు, నాగేంద్ర తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వజ్జా రమ్య, నాయకులు నెల్లూరి భద్రయ్య శాఖమూరి రమేష్, కొడాలి గోవిందరావు, వేగినాటి లక్ష్మీనరసయ్య బొడ్డు బొందయ్య మామిడి వెంకన్న గుడిమళ్ల మధు కొమ్మూరి నరేష్ బచ్చలకూరి నాగరాజు, బచ్చలకూరి మైసయ్య, కొత్తపల్లి సుబ్బారావు, మారుతి కోటి, కడియాల నరేష్, సిపిఎం జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, అడపాల సత్యనారాయణ, దండ సూర్యనారాయణ, గురజాల ఉపేందర్, వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు భాగం హేమంతరావు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ధరణి సిగ్నేచర్ రుసుం పెంపుదల ఉపసంహరించుకోవాలి

పెండింగ్‌లో ఉన్న రైతు బంధు డబ్బులు విడుదల చేయాలి

తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ-వైరాటౌన్



ధరణి పోర్టల్ పెండింగ్ డిజిటల్ సిగ్నేచర్ రుసుం 45 రూపాయలు నుంచి వేయి రూపాయలకు రాష్ట్ర ప్రభుత్వం పెంపుదల చేయడం రైతులపై భారం మోపడమే అని, పెంచిన పెండింగ్ డిజిటల్ సిగ్నేచర్ రుసుం వెంటనే తగ్గించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. ఆదివారం వైరా బోడేపూడి వెంకటేశ్వరరావు భవనంలో జరిగిన స్టడీ సర్కిల్‌లో బొంతు రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పైన ఎన్నో రకాల అంచనాలతో రైతులు ఉన్నారని, పెండింగ్‌లో ఉన్న రైతులకు రైతు బంధు డబ్బులు విడుదల చేయాలని కోరారు. సమగ్ర వ్యవసాయ విధానం కోసం విస్తృత చర్చ చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ నాయకత్వంలో అనుసరిస్తున్న విధానం మూలంగా మూడు కోట్ల మంది రైతులు వ్యవసాయ రంగం నుంచి వైదొలిగారని, దేశ జిడిపిలో వ్యవసాయ రంగం వాటా 34 శాతం నుంచి 18 శాతంకు పడిపోయిందని అన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరలకు గ్యారంటీ ఇవ్వాల్సి అవసరం ఉందని, దేశ రాజకీయాల్లో మార్పు ద్వారానే రైతులకు మద్దతు ధర చట్టం వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) వైరా మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, మాజీ ఎంపిపి బొంతు సమత, పారుపల్లి చంద్రశేఖర్ బాబు, వడ్లమూడి మధు, కోటా ప్రేమ్ కుమార్, పుప్పాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులు...వడగడ్ల వాన

నేల కూలిన విద్యుత్ స్తంభాలు

పిడుగుపాటుకు ఇద్దరికి గాయాలు

నవతెలంగాణ-కారేపల్లి



కారేపల్లి మండలంలో ఆదివారం వడగండ్ల వాన కురిసింది. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్లవాన పడింది. రోడ్ల మీద వడగండ్ల రాళ్ల పడుతుండటం వాహనాలను పక్కకు నిలిపేశారు. రేగులగూడెం సమీపంలో గ్రామానికి, వ్యవసాయ బావులకు విద్యుత్ సరఫరా అయ్యే విద్యుత్ స్తంభాలు గాలికి నేలకూలాయి. రోడ్డు పక్కన విద్యుత్ స్తంభం పడిపోవటంతో రోడ్డుపై విద్యుత్ వైర్లు పడి పోయి నాలుగు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జమాళ్లపల్లి సమీపంలో చేనులో పని చేస్తుండగా పిడుగుపాటుకు గుర్రై పేరుపల్లికి చెందిన తెలగొర్ల భద్రి, మరొకరికి గాయాలైనాయి. వారిని ఆసుపత్రికి తరలించారు. కారేపల్లి వడగండ్ల వానలో వానరాళ్లను సేకరించటానికి పిల్లలు పోటీలు పడ్డారు. అరగంట సేపు వడగండ్ల వాన పడటంతో మామిడి తోటలలో కాయలు నేలపాలైనాయి.

ఖమ్మంరూరల్ : మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. అక్కడక్కడా వడగళ్లు పడ్డాయి. వెంకటగిరి, గుదిమళ్ల తదితర గ్రామాల పరిధిలో విద్యుత్తు స్తంభాలు విరిగి పడ్డాయి. విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్లు నేలకూలాయి.20 విద్యుత్తు స్తంభాలు,4 విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్లు నేలకూలాయి.నంద్యాతండాలో మూడు ఇళ్ల పైకప్పులు గాలికి ఎగిరిపోయాయి. మరో ఇంటి ఎదుట రేకులు గాలికి కొట్టుకుపోయాయి. ఇళ్లలోని సామగ్రి ధ్వంసమయ్యాయి. ఓ ఇంటిపై విద్యుత్తు స్తంభం విరిగిపడింది. విద్యుత్తు అధికారులు వెంటనే అప్రమత్తమై విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు. ఈదురు గాలి, వర్షం తగ్గగానే విరిగి పడ్డ విద్యుత్తు స్తంభాలు, ధ్వంసమయిన ట్రాన్స్ఫార్మర్స్ లను పరిశీలించి అధికారులు వెంటనే మరమ్మతు పనులు ప్రారంభించారు.ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు.

ముదిగొండ: మండలంలోని సువర్ణాపురం, పమ్మి, ముదిగొండ, చిరుమర్రి తదితర గ్రామాల్లో భారీ ఈదురుగాలులతో మబ్బులు తీవ్రంగా పట్టి ఉరుములు, మెరుపులతో ఆదివారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామాల్లో వృక్షాలు విరిగి నేలమట్టమైనాయి. సువర్ణాపురం గ్రామంలో రేకులషెడ్డుతో పాటు, విద్యుత్ తీగలు తెగిపడి స్తంభం విరిగి రోడ్డుపై పడింది. చెరుకూరి పిచ్చయ్యకు సుమారు లక్ష రూపాయల ఆస్తి నష్టం జరిగింది. మిని ట్రాన్స్‌ఫార్మర్ కూలిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామం అంధకారంలో ఉంది. కల్లాలలో ఉన్న మొక్కజొన్న పంటను వర్షానికి తడవకుండా రైతులు పట్టాలు కప్పుకున్నారు.

మహనీయుడు కారల్‌మార్క్స్

నవతెలంగాణ - బోనకల్

మానవాళి కోసం జీవితాంతం శ్రమించిన ఆలోచించిన మహనీయుడు కారల్‌మార్క్స్ అని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల భవనంలో కారల్ మార్క్స్ 206వ జయంతి వేడుకలను పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కారల్‌మార్క్స్ చిత్రపటానికి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దండపాటి నాగేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కారల్‌మార్క్స్ ప్రపంచ మానవాళి అభివృద్ధికి నిత్యం ప్రణాళికల రూపొందించిన మహనీయుడు అని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గూగులోతు నరేష్, మచ్చ గురవయ్య, ఏసుపోగు బాబు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ పంపిణీ

నవతెలంగాణ-వైరాటౌన్



జీవనోపాధికి అవసరమైన సామాగ్రిని అందించటం వలన జీవనానికి కావలసిన అవసరాలు తీర్చుకోవచ్చని లయన్స్ క్లబ్ గాట్ అంబాసిడర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ అన్నారు. లయన్స్ క్లబ్ వైరా అధ్యక్షులు పెనుగొండ ఉపేంద్ర రావు అధ్యక్షతన స్థానిక యం.కె ఐరన్ సిండికేట్ నందు జరిగిన కార్యక్రమంలో రీజన్ చైర్మన్ లగడపాటి ప్రభాకర్, లక్ష్మీరాజ్యం పెళ్లి రోజు సందర్భంగా వైరాకు చెందిన నిరుపేద మహిళకు కుట్టు మిషన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీఎంటి కోఆర్డినేటర్ యు.శ్యాంబాబు, రీజన్ చైర్మన్ లగడపాటి ప్రభాకర్, కార్యదర్శి అబ్బూరి రమేష్, మీల్స్ అండ్ వీల్స్ కోఆర్డినేటర్ చింతోజు నాగేశ్వరరావు, తాడికొండ రాము, చెరుకూరి శ్రీనివాసరావు, ఎలమద్ది శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రామసహాయం రఘురాంరెడ్డిని గెలిపించాలి

నవతెలంగాణ-ఖమ్మం



కాంగ్రెస్ పేదల ప్రభుత్వం అని, రఘురాంరెడ్డిని గెలిపించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుమార్తె సప్నిరెడ్డి అన్నారు. ఆదివారం ఖమ్మంలోని ఖిల్లా బాగ్‌లో మైనార్టీ మహిళా ఆత్మీయ సమ్మేళనం జిల్లా మైనార్టీ నాయకులు షేక్ జిలానీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సప్నిరెడ్డి మాట్లాడుతూ పొంగులేటి శ్రీనన్న ఎలా అయితే ప్రజలకు సేవ చేస్తు అందుబాటులో ఉంటున్నారో అదే విధంగా మా మావయ్యా రఘురాం రెడ్డి మీ అందరికీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవ చేస్తారని, వారికీ ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ కార్పొరేటర్ శౌకత్ ఆలీ మాట్లాడుతూ ప్రజలకు 6 పథకాలలో ఐదు అమలు చేసిందన్నారు. అర్హులందరికీ పథకాలు అందుతాయన్నారు. జిల్లా మైనార్టీ నాయకులు షేక్ జిలానీ మాట్లాడుతూ దేశంలో హిందు ముస్లింలు అన్నదమ్ముల కలసి మెలసి ఉండాలంటే ప్రతి ముస్లిం కాంగ్రెస్‌కు ఓటు వేసి రఘురామ్ రెడ్డిని గెలిపించి రాహూల్‌గాంధీని ప్రధాని చేయాలని కోరారు. మైనార్టీ మహిళా ఆత్మీయ సమ్మేళనంలో ఆశిత, రామసహాయం అర్జున్‌రెడ్డి, కార్పొరేటర్ అలియా శౌకత్ ఆలీ, డివిజన్ ప్రెసిడెంట్ గౌస్, ముక్రమ్, అన్, అఫ్సర్, ముకీమ్ గఫూర్, గౌస్, సలీం తదితరులు పాల్గొన్నారు.



ఎర్రుపాలెం : ఇండియా కూటమి అభ్యర్థిగా సీపీఐ(ఎం), సిపిఐ బలపరుస్తున్న ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురామరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ మండల కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం ఎస్సీ కాలనీ నందు ఇంటింటా ప్రచారాన్ని నిర్వహిస్తూ రఘురామిరెడ్డికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం ప్రతాప్‌రెడ్డి, ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి, బండారు నరసింహరావు, అనుమోలు కృష్ణారావు, మల్లెల లక్ష్మణరావు, కడియం శ్రీనివాసరావు, షేక్ ఇస్మాయిల్, ఎంపీపీ దేవరకొండ శిరీష, దేవరకొండ రాజీవ్ గాంధీ, దేవరకొండ శ్రీనివాసరావు, గూడేటి బాబురావు, కంచర్ల వెంకటనర్సయ్య, దూపుకుంట పుల్లారావు, బుర్రా నారాయణ, సూరంసెట్టి రాజేష్, మెట్టు కృష్ణ, దేవరకొండ ఏసు, రేఖ నాగరాజు తదితరులు నాయకులు పాల్గొన్నారు.

కరుణగిరి చర్చిలో రఘురాంరెడ్డి ప్రత్యేక ప్రార్థనలు

ఖమ్మంరూరల్: ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కరుణగిరి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రఘురాంరెడ్డి చేత కరుణగిరి డైరెక్టర్ మాథ్యువర ప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. రఘురాంరెడ్డికి దేవుని ఆశీస్సులు ఉండాలని కరుణగిరి డైరెక్టర్ ప్రార్థనలో పేర్కొన్నారు. అనంతరం రఘురాంరెడ్డి కరుణగిరి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మద్దినేని స్వర్ణకుమారి, భూక్య సురేశ్ నాయక్, వెంపట రవి, చారి, శేషిరెడ్డి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశం...

మండల పరిధిలోని ఏదులాపురం,వరంగల్ క్రాస్ రోడ్డులో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం వరంగల్ క్రాస్ రోడ్డులో ఆదివారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం చేపట్టాల్సిన కార్యాచరణ, ఇంటింటి ప్రచారం గురించి చర్చించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన విభాగం పాలేరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు భూక్యా సురేశ్ నాయక్, నాయకులు వెంపటి రవి, చారి, కళ్లెం శేషిరెడ్డి, వెంకన్న, భుజంగరావు, విజయ్, శ్రీనివాస్, రాజు, వినోద్, గోపాల్ పాల్గొన్నారు.



6

నవ తెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఖమ్మం

సోమవారం | మే 06, 2024 | www.navatelangana.com

మాజీ మంత్రి పువ్వాడ ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-ఖమ్మం



బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపే లక్ష్యంగా ఆదివారం ఖమ్మం నగరం 49వ డివిజన్ రామాలయం సెంటర్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

నేడు బోనకల్‌లో రఘురాంరెడ్డి రోడ్ షో, కార్నర్ మీటింగ్

నవతెలంగాణ-బోనకల్

బోనకల్ మండల కేంద్రంలో నేడు (సోమవారం) ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్, ఇండియా కూటమి అభ్యర్థి రామ సహాయం రఘురామరెడ్డి రోడ్ షో, కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నారని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రఘురామరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఈ రోడ్ షో, కార్నర్ మీటింగ్ బోనకల్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. సిపిఐ(ఎం), సిపిఐ, కాంగ్రెస్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ రోడ్ షో, కార్నర్ మీటింగ్‌లో అభ్యర్థి రఘురామిరెడ్డితో పాటు రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగిలేటి శ్రీనివాస్‌రెడ్డి, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, సీపీఐ(ఎం), సిపిఐ, కాంగ్రెస్ జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డిని గెలిపించండి

నవతెలంగాణ-వైరాటౌన్

కురుమ, యాదవులకు తెలంగాణ ఏర్పడక ముందు కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన పథకాలే నేటి వరకు అమలవుతున్నాయని, కేసీఆర్ కురుమ యాదవులకు చేసింది ఏమీ లేదని, కురుమ యాదవుల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, డీసీసీబీ డైరెక్టర్, అఖిలభారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం వైరా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైరా మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ గుమ్మా రోశయ్య అధ్యక్షతన జరిగిన కురుమ యాదవుల సమావేశంలో మేకల మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ కెసిఆర్ కురుమ యాదవులను అభివృద్ధి చేస్తానని కల్లబొల్లి మాటలతో మోసం చేసి ఓట్లు వేయించుకుని గద్దెనెక్కారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వల్లనే బడుగు, బలహీన వర్గాలు, దళితులు, మైనారిటీల అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాం రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జవ్వాజి కృష్ణయ్య, బోళ్ళ గంగారావు, చెప్పెడి వెంకటేశ్వరరావు, ఇమ్మడి రామారావు, తోటకూర గోపి, వాడపల్లి రామారావు, జవాజి నాగరాజు, చంగల పరశురాం, నల్లగొర్ల భరత్, మూడుమంతుల గోపి, దొంత బోయిన కిషోర్ రాచబంటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెన్ బ్రోచర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఖమ్మం



రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీతో కలిసి పటేల్స్ ఎంటర్ ప్రెన్యూర్స్ నెట్ వర్క్ (పెన్)బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆదివారం ఖమ్మం బురహాన్ పురంలోని ఎంపీ రవిచంద్ర క్యాంపు కార్యాలయంలో ఈ బ్రోచర్ ఆవిష్కరణ చేశారు. పటేల్స్ ఎంటర్ ప్రెన్యూర్స్ నెట్ వర్క్ ఆధ్వర్యంలో హెూం, లైఫ్ స్టైల్,ఫేషన్ ట్రేడ్ ఫేర్ ఈనెల 25, 26 వతేదీలలో హైదరాబాద్ బోయినపల్లిలోని రాజరాజేశ్వరీ కన్వెన్షన్ హాలులో జరుగుతుంది. ఆ రెండు రోజులలో ఉదయం 11గంటల నుంచి రాత్రి 8గంటల వరకు జరిగే ఈ ప్రదర్శనను ఉచితంగా సందర్శించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మీసాల సందీప్ కుమార్, గొట్టం శ్రీనివాసరావు, గుండ్లపల్లి శేషగిరిరావు,తోట రామారావు, బొక్కా సత్యనారాయణ, నానబాల హరీష్, వెంపటి ఉపేందర్, కార్తీక్, గొట్టం ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-తల్లాడ



ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రామ సహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామంలో ఆదివారం ఇంటింటికి విస్తృత ప్రచారం నిర్వహించారు. తుమ్మలపల్లి రమేష్, పొన్నం కృష్ణయ్య, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు పులి వెంకట నరసయ్య ఇంటింటికి వెళ్లి పోస్టర్లు అంటించి ఓట్లు అభ్యర్థించారు. ఇందిరమ్మ రాజ్యం రావాలంటే రాహుల్ గాంధీ ప్రధాని కావాలని, చేతి గుర్తుకే ఓటు వేసి అత్యధిక మెజార్టీతో రఘురాంరెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రావుల గోపిగౌడ్, ముస్లిం మైనార్టీ సెల్ నాయకులు, యాకూబ్ భాష, తోట నర్సు, హెూసూర్ రామారావు పడ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.



'రఘురాంరెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించండి'

నవతెలంగాణ-ఖమ్మం

రామ సహాయం రఘురాంరెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఉషా కిరణ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మంలోని ప్రెస్ క్లబ్బులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిద్దాం గిరిజనుల ఆత్మ గౌరవాన్ని కాపాడుకుందామని అన్నారు. పది సంవత్సరాల బీజేపీ ప్రభుత్వ పరిపాలనలో పేదలను దోచి పెద్దలకు పెట్టిందని ఆరోపించారు. పెట్టుబడి దారి వ్యవస్థను పోషించి రైతుల, మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచిందన్నారు. ఆదివాసుల బతుకులును రోడ్‌న పడివేసిన బిజెపి ప్రభుత్వాన్ని ఓడిదమన్నారు. మనువాదాన్ని పోషించి, రాజ్యాంగాన్ని విస్మరించి, ప్రజాస్వామ్య విలువలను పతనం చేసిందని, బడులకు బదులు గుడులు నిర్మించి, పేదలను విస్మరించి సన్యాసులకు పట్టం కట్టిందని విమర్శించారు. ఆదివాసుల పక్షపాతి, ప్రజల పార్టీ కాంగ్రెస్ అని, కాంగ్రెస్ పార్టీని గెలిపిద్దామన్నారు. గెలిపించి రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడానికి రామ సహాయం రఘురాంరెడ్డిని గెలిపించుకుందామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మేడ విజయ్, కార్యదర్శి ఎల్లం దేవరాయ్, ఆర్గనైజర్ దేవరమ సురేష్, వలువాయి శ్రీను, మహిళలు ఝాన్సీ, వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తోపుడు బండి వితరణ

నవతెలంగాణ-వైరాటౌన్



గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షురాలు ఉండ్రు వరలక్ష్మి ఆధ్వర్యంలో రీజన్ చైర్ పర్సన్ లయన్ లగడపాటి ప్రభాకరరావు, లయన్ లగడపాటి లక్ష్మీరాజ్యం దంపతుల పెళ్లిరోజు సందర్భంగా వారి ఆర్థిక సహాయంతో చీరు వ్యాపారి అయిన బ్రాహ్మణపల్లికి చెందిన కుక్కల సంధ్య జీవనోపాది నిమిత్తం ఆదివారం తోపుడు బండి అందించారు. ఈ సందర్భంగా డిస్టిక్ పాస్ట్ గవర్నర్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ రోడ్డు పక్కన చీరు వ్యాపారం చేసుకుంటున్న వారికి జీవనోపాది కల్పించడంలో వైరా గ్రేట్ విజన్ క్లబ్ ముందు వుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎంటీ కోఆర్డినేటర్ ఉండ్రు శ్యామ్ బాబు, తోటకూర శ్రీకాంత్, గంగవరపు కిషన్, ఎనమద్ది శ్రీను, వుయ్యూరు రామకృష్ణ, గుత్తికొండ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

రఘురాంరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

- సీపీఐ(ఎం) నాయకులతో కలిసి విస్తృత ప్రచారం

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి రామ సహాయం రఘురామిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్ కోరారు. ఆదివారం ఖమ్మంలోని ప్రముఖ వస్త్ర దుకాణం జీవి మాల్లో రఘురామిరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ సీపీఐ(ఎం) నాయకులతో కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్తోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. గత పదేళ్లల్లో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం పెరిగిపోయిందని, 30 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా బీజేపీ ప్రభుత్వం నియామకాలు చేపట్టలేదని ఆరోపించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోతో అన్ని వర్గాల వారికి న్యాయం జరిగిందని, బీజేపీ మ్యానుఫెస్టోతో మాత్రం అంబానీ, ఆదానీలా కు మాత్రమే న్యాయం చేస్తారని తెలిపారు. మోడీ పదేళ్ల కాలంలో నిరుద్యోగం పెరిగిందని, 3.8 లక్షల ఎలక్ట్రోరల్ బాండ్ స్కామ్ జరిగిందని తెలిపారు. ఈసారి అధికారంలోకి వస్తే మోడీ దేశాన్ని తాకట్టు పెట్టేలా ఉన్నాడని తెలిపారు. కులతత్వ మతతత్వ పార్టీలకు బుద్ధి చెప్పి ప్రజాస్వామ్య బద్ధంగా పాలించే పార్టీ కాంగ్రెస్‌ను ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ 10 ఏళ్లలో ఎన్నో ఇబ్బందులు పడ్డామని నోట్ల రద్దు నుండి నిత్యవసర ధరల పెరుగుదల వరకు జరిగిన మార్పులను గుర్తుంచుకొని మోడీ నయవంచనకు బుద్ధి చెప్పాలని సూచించారు. పదేళ్ల కన్నీళ్లను గుర్తుంచుకొని ప్రజా ద్రోహుల పాలనను అంతమొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) ఖమ్మం అసెంబ్లి నియోజక వర్గ కో ఆర్డినేటర్ ఎర్రా శ్రీకాంత్, జిల్లా నాయకులు వై. విక్రమ్, ఎంఏ జబ్బార్, బండారు యాకయ్య, బోడపట్ల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం ఖాయం

- ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి
- కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎంపీపీ, జెడ్పీటీసీ

నవతెలంగాణ-వైరాటౌన్



కేంద్రంలో రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా వైరా మండలంలో బీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఆదివారం వైరా మండలం గొల్లపూడి గ్రాలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి ఎన్నికల ప్రచార సభలో ఎమ్మెల్యే మాలోత్ రామదాస్ నాయక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పువాళ్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో వైరా ఎంపీపీ వేల్పుల పావని, జెడ్పీటీసీ నంబూరు కనకదుర్గ, మాజీ సర్పంచ్ మేడూరు రామారావు, డాక్టర్ బీ.కోటయ్య పలు గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు కాంగ్రెస్ కండువాలు కప్పి ఎమ్మెల్యే మాలోత్ రామదాసు నాయక్, పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేసిందని తెలిపారు. గత పది సంవత్సరాల కాలంలో తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి తెచ్చారని, రాష్ట్రంలో పేద ప్రజలపై 7 లక్షల కోట్ల అప్పుల భారం మోపారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన రైతులకు రెండు లక్షల రుణమాఫీ, పేదలకు ఇండ్లు పలు సంక్షేమ పథకాలు పార్లమెంట్ ఎన్నికల అయిన వెంటనే అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం పాలన కొనసాగుతుందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేసేందుకు ఎంపీ అభ్యర్థి రఘురాం రెడ్డిగెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొర్రా రాజశేఖర్, వెంకట నర్సిరెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మీ ఊరి రైతు బిడ్డను ఆశీర్వదించండి

- నేనేంటో మీకు తెలుసు
- సేవతో రుణం తీర్చుకుంటా
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామ

నవతెలంగాణ-ఖమ్మం



మీ మధ్య పుట్టి పెరిగాను...నేనేంటో మీకు తెలుసు..మీ ఆత్మీయతను మర్చిపోలేను.. మీ రుణం సేవ ద్వారా తీర్చుకుంటున్నాను..ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తనకు సహకరించి మీ రైతు బిడ్డను మంచి మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మంలోని సప్తపది ఫంక్షన్ హాలులో బలపాల గ్రామస్తులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నామ వారితో మామేకమై ఆత్మీయతను, తీపి గుర్తులను, గత స్మృతులను వారితో పెనవేసుకున్న అనుభూతులను పంచుకున్నారు. ఈ సందర్భంగా నామ మాట్లాడుతూ బలపాల రైతు బిడ్డగా 25 ఏళ్ల తన రాజకీయ జీవితం తెరిచిన పుస్తకమన్నారు. దేశంలో ఏ ఎంపీకి దక్కని గౌరవం తనకు దక్కిందని చెప్పారు. పార్లమెంట్‌కు అత్యధిక రోజులు హాజరై, ఎక్కువ ప్రశ్నలు అడిగి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా అరుదైన గుర్తింపు పొంది బలపాల, ఖమ్మం జిల్లా ఖ్యాతిని దేశం నలు మూలల వ్యాపింప జేశానని తెలిపారు. రెండు సార్లు ఎంపీగా ఎంతో అభివృద్ధి చేశానని, మళ్లీ ఒకసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఆలివికాని హామీలతో మోసగించిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం నేర్పి, తనను గెలిపించి, కేసీఆర్ కు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లాలో ఉంటున్న బలపాల గ్రామస్తులతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కన్వీనర్ జీ. వీరభద్రం, భాగం కోటేశ్వరరావు, నామ సైదులు, దేవరపల్లి ఏకాంబరరావు, ముండ్ల రమేష్, నెల్లూరి చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

మార్నింగ్ వాక్‌లో నామ నాగేశ్వరరావు

కారు గుర్తుకు ఓటేసి మద్దతు నాకు ఇవ్వాలని ఖమ్మం పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు కోరారు. ఆదివారం ఉదయం ఖమ్మంలోని రాపర్తి నగర్ బీసి కాలనీ గ్రౌండ్‌లో మార్నింగ్ వాక్ లో భాగంగా పలువురు వాకర్స్‌ని కలసి కారు గుర్తుపై ఓటేసి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా పని చేశానని, ఖమ్మం ప్రజల సంక్షేమం, జిల్లా అభివృద్దే నా ధ్యేయం అన్నారు. ఆయన వెంట కార్పొరేటర్ దోరేపల్లి శ్వేత, పలువురు నాయకులు ఉన్నారు.

రాహుల్ గాంధీతోనే సంక్షేమ పాలన

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి

నవతెలంగాణ-ఖమ్మం



ఎలాంటి మత విద్వేషాలు లేకుండా ప్రజలందరికీ సంక్షేమ పాలన అందించడం రాహుల్ గాంధీతోనే సాధ్యమవుతుందని కాంగ్రెస్ ఖమ్మం లోక్‌సభ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని ఎన్ఎస్‌టీ రోడ్డు శ్రీదేవి నర్సింగ్ హెూమ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురాంరెడ్డి మాట్లాడుతూ ప్రజా సేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. అందరూ హస్తం గుర్తుపై ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బొల్లికొండ శ్రీదేవి, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, సీనియర్ నాయకురాలు మద్దినేని స్వర్ణ కుమారి, మొక్కా శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు అండగా ఉంటాం

ఆటో కార్మికులందరికీ ప్రభుత్వం తరపున అండగా నిలుస్తామని కాంగ్రెస్ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి రామ సహాయం రఘురాంరెడ్డి అన్నారు. ఆదివారం ఎస్ఆర్ కన్వెన్షన్‌లో ఐఎన్టీయూసీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయితీలు అందేలా చూస్తామని, సంక్షేమ పథకాలు వర్తింప చేస్తామని తెలిపారు. అందరూ తమ గ్రామాల్లో కాంగ్రెస్ తరఫున విస్తృత ప్రచారం చేయాలని, భారీ మెజారిటీ వచ్చేలా కృషి చేయాలని కోరారు. ఎన్నికలు ముగిశాక.. అర్హులందరికీ ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు మంజూరు చేయిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నగర అధ్యక్షులు మహమ్మద్ జావేద్, సీనియర్ నాయకులు మద్దినేని స్వర్ణకుమారి, మాజీ కార్పొరేటర్ దీపక్ చౌదరి, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు కొత్తా సీతారాములు, నగర అధ్యక్షులు నరాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపిద్దాం

- రఘురామిరెడ్డికి అత్యధిక మెజార్టీ సాధిద్దాం
- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వీరయ్య

నవతెలంగాణ-ఎర్రుపాలెం



దేశానికి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించి అ రాచక పాలన కొనసాగిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని మూడవ సారి అధికారంలోకి రాకుండా చమర గీతం పాడాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఖమ్మం పార్లమెంటుకు ఇండియా కూటమి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామసహాయం రఘురామరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ మండల కేంద్రమైన ఎర్రుపాలెంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు సీపీఐ(ఎం), కాంగ్రెస్ పార్టీల మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమన్వయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ ఈ లోకసభ ఎన్నికలలో బీజేపీని అధికారంలోకి రాకుండా ఓడించటమే లక్ష్యంగా సీపీఐ(ఎం) కృత నిశ్చయంతో పని చేస్తుందన్నారు. ఇండియా కూట మితో భాగస్వామి అయిన కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు సీపీఐ(ఎం) తెలియజేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇండి యా కూటమి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామ సహాయం రఘురామిరెడ్డికి అత్యధిక మెజార్టీ ఓట్లు సాధించేటకు వామపక్షాల కాంగ్రెస్ పార్టీల కార్యకర్తలు గ్రామాలలో కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ ఐలూరు వెంకటేశ్వర రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారు నరసింహారావు,సీలం ప్రతాపరెడ్డి, శ్రీనివాసరెడ్డి,అనుమోలు కృష్ణా రావు,కడియం శ్రీనువాస రావు, షేక్ ఇస్మాయిల్,మల్లెల లక్ష్మణరావు, రాజీవ్ గాంధీ దేవరకొండ శ్రీను, గుడేటి బాబురావు, బొర్రా నారాయణ, అనిల్‌కుమార్, సీపీఐ(ఎం) నాయకులు సగ్గుర్తి సంజీవరావు, నల్లమోతు హనుమంతరావు, గొల్లపూడి కోటేశ్వరరావు, ఆంగోతు వెంకటేశ్వర్లు, షేక్ నాగుల మీరా, నాగులవంచ వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ గతిని మార్చిన సిద్ధాంతకర్త కారల్ మార్క్స్

- సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్

నవతెలంగాణ-ఖమ్మం



ప్రపంచ గతిని మార్చిన మహెూన్నత సిద్ధాంత కర్త కారల్ మార్క్స్ అని, ఆయన సిద్ధాంతం అసమానం అజరామరమని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. కారల్ మార్క్స్ 206వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఖమ్మంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. శతాబ్దాల క్రితం శ్రమ, ఉత్పత్తి, పెట్టుబడి పాలకులు, పాలితుల గురించి ప్రజలకు తెలియజేప్పి ప్రజలను చైతన్యవంతుల్ని చేసిన వ్యక్తి కారల్ మార్క్స్ ఇప్పటికీ ప్రపంచ ఉద్యమాలకు చోదక శక్తిగా పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, ప్రజా సంఘాల బాధ్యులు గాదె లక్ష్మినారాయణ, తాటి నిర్మల, పగిడిపల్లి ఏసు, నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, పట్టణ నాయకులు యానాలి సాంబశివరెడ్డి, బి.శ్రావణ్ చానా, మేకల రవి, చందులాల్, శివ, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక, మతోన్మాద బీజేపీని ఓడించండి

- వామపక్ష, లౌకిక శక్తుల అభ్యర్థులను గెలిపించండి

నవతెలంగాణ-బోనకల్

కార్మిక వ్యతిరేక మతోన్మాద బీజేపీని ఓడించాలని, ఇండియా కుటమి అభ్యర్థి, కాంగ్రెస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని గెలిపించాలని ఆళ్లపాడు మాజీ సర్పంచ్ పారా లక్ష్మీనారాయణ కోరారు. మండల పరిధిలోని సీపీఐ(ఎం) ఆళ్లపాడు గ్రామ శాఖా సమావేశం షేక్ ఉద్దడుసాహెబు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ గత పది సంవత్సరాల కాలంలో దేశ ప్రజలను, కార్మిక వర్గాన్ని మోసం చేసిందని విమర్శించారు. ఈ ఎన్నికలలో వికసిత్ భారత్ సుస్థిర అభివృద్ధి రామరాజ్య స్థాపన వంటి నినాదాలతో మూడోసారి అధికారాన్ని చేజిక్కించుకునేందుకు బీజేపీ జిమిక్కులు చేస్తుందని విమర్శించారు. కార్మిక చట్టాలను రద్దుచేసి వారికి హక్కులు లేకుండా చేసిందని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు, నిరుద్యోగం వంటి కీలక సమస్యలను గాలికి వదిలేసిందని విమర్శించారు. కార్మికవర్గంపై బీజేపీ యుద్ధం చేస్తుందని, కనీస వేతనం రూ. 26,000 వేలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. సగటు కార్మికులు బతకలేని పరిస్థితులను బిజెపి కల్పించిందన్నారు. పెట్టుబడు దారుల ప్రయోజనం కోసం 29 కార్మికచట్టాలను సవరించి 4 లేబర్ కోడ్ లను తెచ్చిందని విమర్శించారు. గడిచిన పది సంవత్సరాలలో దేశంలో లక్ష మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. రైతాంగాన్ని వ్యవసాయం నుండి దూరం చేసి కార్పొరేట్ వ్యవసాయాన్ని బీజేపీ ప్రోత్సహిస్తుందని విమర్శించారు. ప్రతి ఏటా 2 కోట్ల ఉద్యోగాల హామీలిచ్చి మోసం చేసిన బీజేపీని ఓడించాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ మర్రి తిరుపతిరావు, శాఖా కార్యదర్శి బండి నాగేశ్వరరావు, పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవ్వుతో ఆరోగ్యవంతమైన జీవితం

- పెవిలియన్ గ్రౌండ్‌లో వరల్డ్ లాఫింగ్ డే

నవతెలంగాణ-ఖమ్మం

ఆరోగ్యవంతమైన జీవితానికి నవ్వు ఎంతో ఉపయోగపడుతుందని బెంగళూరు లాఫ్టర్ యోగా యూనివర్సిటీ ట్రైనర్ తెలంగాణ యోగా సంఘం అధ్యక్షులు, న్యాయవాది మరికంటి వెంకట్ తెలిపారు. ఆదివారం ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ యోగ సంఘం అధ్యక్షులు మరికంటి వెంకట్, ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షులు నేరెళ్ల శ్రీనివాసరావు, పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొండమీది వెంకట్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాకం శ్యామ్ బాబు ఆధ్వర్యంలో ప్రపంచశాంతికై నవ్వుదాం అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ ప్రపంచ నవ్వుల దినోత్సవం పురస్కరించుకొని స్థానిక పెవిలియన్ గ్రౌండ్లో వెంకటన్న నవ్వు - నవుమా ద్వి శతక పద్య మంజరి జీవనానంద యోగ వాచక ముద్రల వైద్య గ్రంథ రాజ పుస్తకం ఆవిష్కరించారు. పుస్తకాలు అందరికీ ఉచితంగానే అందిస్తామని మరికంటి వెంకట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మంద వెంకటేశ్వర్లు, పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ట్రెజరర్ పి.సుదర్శన్, రామనాథం, ఎం.దామోదర్‌రెడ్డి, తాల్లూరి వేణు, డాక్టర్ సీతయ్య, లకారం ట్యాంక్ బండ్ వాకర్స్ అసోసియేషన్, అధ్యక్షులు. డి.పూర్ణచందర్, సెక్రటరీ. జనార్ధన్, వెంకన్న, ఖాదర్, జ్యోతి, మాధవి, సత్యవతి, కళావతి, సౌజన్య, రజని, సబిత తదితరులు పాల్గొన్నారు.

నామ విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం

ఎర్రుపాలెం : బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. మండల పరిధిలోని సకినవీడు గ్రామంలో మండల పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహిస్తూ ఓటర్లను నామ నాగేశ్వరరావుకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా లింగాల కమల్ రాజు గోడ పత్రికలను అంటించారు. ఈ సంధర్భంగా కమల్ రాజు మాట్లాడుతూ నామ నాగేశ్వరరావును మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల పార్టీ అధ్యక్షుడు పంబి సాంబ శివరావు ఆధ్వర్యంలో జమలాపురం రేమిడిచర్ల తదితర గ్రామాలలో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ చావా రామక్రిష్ణ, జెడ్పీటీసీ సీలం కవిత, వైస్ ఎంపీపీ రామ కోటేశ్వరరావు, మండల అధ్యక్షులు పంబి సాంబశివ రావు, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ కిషోర్‌బాబు, కృష్ణారావు, మూలప్పారి శ్రీనివాసరావు, మాజి గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, గ్రామ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లాడ : మండల పరిధిలోని అంజనాపురం గ్రామంలో బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ పార్టీ శ్రేణులు ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేతినేని చలపతిరావు, కేతినేని వెంకటరామారావు, నల్లగొర్ల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | మే 06, 2024 | www.navatelangana.com



పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం మార్క్సిజమే

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య

నవతెలంగాణ-కొత్తగూడెం

పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం మార్క్సిజమే అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. ఆదివారం స్థానిక మంచి కంటి భవన్‌లో కార్ల్ మార్క్స్ 206వ జయంతి కార్యక్రమం జరిగింది. ముందుగా మార్క్స్ చిత్రపటానికి కనకయ్య పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కనకయ్య మాట్లాడుతూ పెట్టుబడుదారి సమాజంలో దోపిడీ సహజమని ఈ సమాజంలోనే నిరుద్యోగం ఆకలి పేదరికం విలయతాండవం చేస్తాయని సంక్షోభాలు కూడా పెట్టుబడిదారీ వ్యవస్థలో భాగంగానే వస్తాయని ఈ సంక్షోబాలకు పరిష్కార మార్గం పెట్టుబడుదారి వ్యవస్థ చూపించలేదని, అందుకని పెట్టుబడిదారీ దోపిడీ నుండి విముక్తికి సంక్షోభాల పరిష్కార మార్గానికి మార్క్స్ చెప్పిన పెట్టుబడిదారి గ్రంథంలో ఉందన్నారు. ప్రపంచ పెట్టుబడిదారీ విధానానికి తిరుగులేదు అని అజేయ శక్తిగా ముందుకు సాగుతుందని చెబుతున్న పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలే సంక్షోభాలకు పరిష్కారం మార్గాన్ని కనుగొనడానికి మార్క్స్‌ని అధ్యయనం చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. మానవ సమాజం మీద అత్యంత ప్రభావం చూపిన వ్యక్తిగా మిలీనియం మేధావిగా కామ్రేడ్ కార్ల్ మార్క్స్ ఆ ఖ్యాతిని గడించారని ఆయన అన్నారు. వర్గ పోరాటాల ద్వారానే సమాజం మారుతుందని ఆయన తన సిద్ధాంతం ద్వారా తెలియజేశారని అన్నారు. భవిష్యత్తు సమాజం మార్పుకై మార్క్సిజం ఆధారంగానే వర్గ పోరాటాల వెలుగులో సమాజ మార్పుకై కృషి చేయడమే మార్క్స్‌కి ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏజే.రమేష్, లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్, భూక్య రమేష్, టౌన్ కమిటీ సభ్యులు డి.వీరన్న, నందిపాటి రమేష్, కూరపాటి సమ్మయ్య, గాజుల రాజారావు, పద్మ సలీం, రసూల్, బి బాలకృష్ణ, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇల్లందు : మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కారల్ మార్క్స్ అని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అబ్దుల్ నబీ అన్నారు. కార్ల్ మార్క్స్ 207 జయంతిని పురస్కరించుకొని పార్టీ కార్యాలయం నందు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మన్యం మోహన్ రావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఆయన రచించిన మార్క్సిజం సిద్ధాంతం 200 సంవత్సరాలు దాటినప్పటికీ ఆనాడు ప్రపంచం ఏ గమనంలో పయనిస్తుందో ముందుగానే అర్థం చేసుకొని రచించాడని అన్నారు. బీజేపీ పార్టీ విధానాలను వ్యతిరేకిస్తూ ఇండియా కూటమి అభ్యర్థులకి ఓటు వేసి బీజేపీ పార్టీని అంతమొందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు ఆలేటి కిరణ్ కుమార్, హాజర, సర్వన్ కుమార్, హుస్సేన్, మద్దెల వీరస్వామి, నరేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులో 18 బీర్లు పట్టివేత

నవతెలంగాణ-టేకులపల్లి



మండలంలోని అంజనాపురం గ్రామంలో బెల్ట్ షాపులో 18 బీర్లు ఎఫ్ఎస్‌టీ అధికారులు పట్టుకున్నట్లు ఎస్ఐ ఎస్.కె.సైదారాహూఫ్ ఆదివారం తెలిపారు. బెల్టు షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన బీర్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌టీ బృందం అధికారిని వాసవి రాణితో పాటు పలువురు సిబ్బంది ఉన్నట్లు తెలిపారు.

సింగరేణి మాజీ చైర్మెన్ శ్రీధర్ అవినీతిపై విచారణ జరిపించాలి

- బీఎస్పీ ఎంపీ అభ్యర్థి యెర్రా కామేష్

నవతెలంగాణ-కొత్తగూడెం

బీఆర్ఎస్ పార్టీ అధికారాన్ని అడ్డం పెట్టుకొని అప్పటి సింగరేణి సీఎండీ శ్రీధర్ చేసిన అవినీతి అక్రమాలను అధికారంలోకి వచ్చిన వెంటనే విచారణ చేసి చర్యలు తీసుకుంటామని అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన సవాల్ ఏమైందని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఖమ్మం బీఎస్పీ ఎంపీ అభ్యర్థి యెర్రా కామేష్ ప్రశ్నించారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణిలో 2015 నుండి 2023 వరకు జరిగిన అవినీతిపై విచారణ జరిపిస్తామని, ఆనాటి సీఎండి శ్రీధర్ పై విచారణ జరిపించి, జైలుకు పంపిస్తామని ఎన్నికలకు ముందు రామగుండంలో విసిరిన సవాల్ విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు విచారణకు ఆదేశించడం లేదని ప్రశ్నించారు. 2015లో జరిగిన క్లరికల్ పరీక్ష ప్రశ్నపత్రాల లీకులు, 2020లో జరిగిన ఈ అండ్ ఎం పరీక్ష, 2022లో జరిగిన కర్లికల్ కుంభకోణంపై కూడా విచారణ జరిపించాలని అన్నారు. 2015 నుండి కేటాయించిన సీయస్ఆర్, డిఎంఎఫ్‌టి నిధుల దారి మళ్లింపు పై సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సింగరేణిలో జరిగిన అవినీతి, అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ విలేకర్ల సమావేశంలో సందేల సందీప్, తారిపాముల హరికృష్ణ, ధనుంజయ్, విన్ను తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కి 'వామపక్షాల' అభయహస్తం

ఇండియా కూటమితో 'బలరాం' గెలుపుకి 'ఎర్ర' తివాచి





- 9న కాంగ్రెస్, కామ్రేడ్ల ఉమ్మడి సమావేశం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

దేశంలో రోజురోజుకీ పెరిగిపోతున్న మతోన్మాద విష కోరలను నిర్మూలించేందుకు ఇండియా కూటమిలో భాగస్వాములై బీజేపీని నివారించేందుకు వామపక్షాలు తీసుకున్న రాజకీయ ఎత్తుగడ భద్రాచలం మన్యంలో మతోన్మాద విష సర్పాలు విస్తరించకుండా నివారిస్తుందని స్పష్టమవుతుంది.

ఈ నెల 13వ తారీకున జరగనున్న మానుకోట పార్లమెంటు ఎన్నికలలో వామపక్షాల అభయహస్తంతో పోరిక బలరాం నాయక్ విజయం నల్లేరుపై నడకేనని స్పష్టమవుతుంది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు కలిగి ఉన్న మహబూబాద్ పార్లమెంటు పరిధిలో కాంగ్రెస్ పార్టీకి మద్దతిస్తున్న సీపీఐ(ఎం), సీపీఐ పార్టీలు రాజకీయంగా బలమైన ప్రజా పునాది కలిగిన పార్టీలు కావడంతో ఇండియా కూటమి నుండి పోటీ చేస్తున్న పోరిక బలరాం నాయక్‌కి భారీ మెజార్టీ ఖాయమని స్పష్టమవుతుంది. మహబూబాద్ పార్లమెంటు పరిధిలో భద్రాచలం, పినపాక, ములుగు, ఇల్లందు, నర్సంపేట నియోజకవర్గాలలో సీపీఐ(ఎం), సీపీఐ పార్టీలకు అధిక ఓట్లు ఉండటంతో పాటు పార్లమెంటు పరిధిలో సుమారు లక్ష నుండి లక్ష 50 వేల ఓట్ల వరకు సీపీఐ(ఎం), సీపీఐ పార్టీలు కలిగి ఉండటం కాంగ్రెస్‌కి రాజకీయంగా కలిసొస్తుంది. మతోన్మాద వికృత చర్యలతో దేశాన్ని ముక్కలుగా విభజించి మతాల మధ్య చిచ్చును పెట్టి రాజకీయంగా లబ్ధి పొందాలనుకుంటున్న బీజేపీని నివారించేందుకు ఇండియా కూటమిలో భాగస్వాములైన వామపక్ష పార్టీలు తెలంగాణ రాష్ట్రంలో భువనగిరి మినహా మిగిలిన అన్నిచోట్ల కాంగ్రెస్‌కి పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మానుకోట పార్లమెంట్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేస్తున్న పోరిక బలరాం నాయక్‌కి సీపీఐ(ఎం), సీపీఐ పార్టీలు సంపూర్ణ మద్దతుని తెలియజేయడమే కాక గెలుపులో కీలక పాత్ర పోషిస్తున్నారు. అందులో భాగంగానే ఈనెల 9వ తారీఖున భద్రాచలం, పినపాక నియోజకవర్గం పరిధిలోని పార్టీ కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశాన్ని కూడా నిర్వహించి కూటమి ఓట్లు చెదిరిపోకుండా జాగ్రత్తలు పడుతున్నారు. ఇండియా కూటమి బరిలో దిగిన నాటి నుండే ప్రత్యర్థి పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఓటమిని అంగీకరించి ప్రచారాన్ని సైతం నామమాత్రంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

బీఆర్ఎస్ పార్టీకి మహబూబాద్ సిట్టింగ్ స్థానం అయినప్పటికీ ఈ నియోజకవర్గం పై ఇటు పార్టీ నాయకత్వానికి గాని అభ్యర్థి కవిత గాని ఏమాత్రం ఆసక్తి లేదని స్పష్టమవుతుంది. మరో ప్రత్యర్థి అయిన బీజేపీ సైతం మానుకోటపై ఆశలు ముందే వదులుకుందని అందులో భాగంగానే ఈ ప్రాంతంలో ఎన్నికల ప్రచారానికి సైతం ఆ పార్టీ నుండి అటు నాయకులుగాని ఇటు కార్యకర్తలు గాని కదిలే పరిస్థితి లేదని తెలుస్తుంది. ఒకవైపు ప్రత్యర్థుల బలహీనతతో పాటు వామపక్షాల మద్దతుతో ఇండియా కూటమి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయిన పోరిక బలరాం నాయక్ సుమారు రెండు లక్షల ఓట్ల మెజార్టీతో మహబూబాబాద్ పార్లమెంటు సభ్యుడిగా గెలవబోతున్నారని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఏదేమైనాప్పటికీ మహబూబాద్ పార్లమెంట్ పరిధిలో రాజకీయంగా బలంగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి ప్రజా పోరాటాలతో స్థిరమైన ఓటింగ్ ప్రజా పునాది కలిగి ఉన్న వామపక్ష పార్టీల మద్దతుతో బలరామనాయక్ గెలుపుకి ఎర్ర తివాచీ పరిచారని స్పష్టమవుతుంది.

మన్నెంలో మతోన్మాద పార్టీలను అడుగుపెట్టనివ్వం



మూడోసారి అధికారం చేపట్టి భారత రాజ్యాంగానే మార్చేయాలని కుట్రలు పన్నుతున్న బీజేపీని నివారించేందుకు సీపీఐ(ఎం) ఇండియా కూటమిలో భాగస్వామ్య మతోన్మాద బీజేపీని ఓడించేందుకు పోరాడుతుంది. ఇండియా కూటమిలో భాగంగా మహబూబాద్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌కి సంపూర్ణ మద్దతు ఇవ్వటమే కాక భారీ మెజార్టీతో గెలిపించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తుంది. ఇండియా కూటమి ఎన్నికలలో విజయం సాధించేందుకు 8వ తారీకు భద్రాచలం పట్టణంలో పినపాక, భద్రాచలం నియోజకవర్గం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తుంది. ఈ సమావేశానికి పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయకతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా సీపీఐ(ఎం), కాంగ్రెస్ ముఖ్య నాయకత్వం హాజరై కార్యకర్తలకు దిశ నిర్దేశం చేయనున్నారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టిన ఐదు పంచాయతీలను భద్రాచలంలో కలిపేందుకు ఎన్నికల అనంతరం సీపీఐ(ఎం) తన పోరాటాన్ని కొనసాగిస్తుంది

- సీపీఐ(ఎం) భద్రాచలం నియోజకవర్గం కన్వీనర్ మచ్చా వెంకటేశ్వర్లు

బలరాం నాయక్‌కి 2 లక్షల మెజార్టీ ఖాయం



ఈ నెల 13వ తారీఖున జరగనున్న మహబూబాద్ పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేస్తున్న పోరిక బలరాం నాయక్‌కి వామపక్షాల మద్దతు లభించటం ఈ కలయికలో బలరాం నాయక్ 2 లక్షల మెజార్టీ ఓట్లతో విజయం సాధించడం ఖాయం. 2009లో బలరాం నాయక్ పార్లమెంట్ సభ్యుడిగా గెలిచి కేంద్ర మంత్రిగా ఈ ప్రాంతంలో చేసిన అభివృద్ధి పనులు ఈ ప్రాంత ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరు. బలరాం నాయక్ మరొక్కసారి అవకాశం ఇస్తే ఆంధ్రాలో కలిసిన ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపడంతో పాటు భద్రాచల నియోజకవర్గ సంపూర్ణ అభివృద్ధికి కృషి చేస్తారు. ఈ ప్రాంతంలో బలమైన ఓటు బ్యాంకు ఉన్న వామపక్షాలను కలుపుకొని భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ మరిన్ని విజయాలు సాధిస్తుంది అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఇప్పటికే ప్రత్యర్థులు ఓటమిని అంగీకరించారని స్పష్టమవుతుంది.

గ్రంథాలయం మాజీ చైర్మెన్ భోగాల శ్రీనివాస్ రెడ్డి

ఓపెన్ కాస్ట్‌ల్లో భగభగ మండుతున్న ఎండలు

- కార్మికుల ప్రాణాలకు రక్షణ చర్యలేవి : సీఐటీయూ

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో భగభగ మంటు ఎండలు మండుతున్నాయని, కానీ సింగరేణి యాజమాన్యం కార్మికుల ప్రాణాలకు రక్షణ చర్యలు కల్పించడంలేదని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు అన్నారు. ఆదివారం ప్రకటన విడుదల చేశారు. వేసవి ఎండల తీవ్రతతో ఉష్ణోగ్రత 48, నుండి 50 డిగ్రీలు దాటి నమోదు అవుతుందని చెప్పారు. మరొక పక్క ఓపెన్ కాస్టుల్లో గ్యాస్ వెలువడుతూ ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని కార్మికులు బిక్కుబిక్కుమంటున్నారని తెలిపారు. ప్రాణాలను అరిచేతులో పెట్టుకొని పని చేస్తున్న కార్మికులకు షిఫ్ట్ టైమింగ్స్ ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మార్చాలని, రెండో షిఫ్ట్ 4 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు మార్చమని కార్మికులు వేడుకున్నప్పటికీ గెలిచిన గుర్తింపు కార్మిక సంఘం, ప్రాతినిధ్య సంఘాలు మేనేజ్మెంట్ చెప్పినట్లు తెలుపుతూ తూతూ మంత్రంగా పని గంటలు మార్చి చేతులు దులుపుకోవడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఒక పక్కన ప్రభుత్వము ఈ ఎండలలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నప్పటికీ యాజమాన్యం పట్టించుకోకుండా, గతంలో షిఫ్ట్ టైమింగ్ మార్చినట్లుగా మార్పు చేయకుండా తిమ్మిని బమ్మిని చేసినట్లుగా టైమింగ్స్ మార్చి సింగరేణి మేనేజ్మెంట్ చేతులు దులుపుకోవడం సరైనది కాదన్నారు. ఇప్పటికైనా వెంటనే ఆ టైమింగ్స్‌ను మార్చాలని, లేనిపక్షంలో కార్మికుల నుండి తీవ్రమైన ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. గెలిచిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ఏఐటియుసి, ఐఎన్టీయూసీ కార్మికులను ఇలా మోసం చేయటం సరియైనది కాదని సూచించారు.

అశ్వారావుపేట అసెంబ్లీ సెగ్మెంట్‌లో 1,59,174 పార్లమెంట్ ఓటర్లు

- 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 1,55,961 మంది ఓటర్లు
- 3,213 మంది ఓటర్లు పెరుగుదల

నవతెలంగాణ-అశ్వారావుపేట

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల అధికారులు ఓటర్లు తుది జాబితా ప్రకటించారు. ఆ వివరాలు ప్రకారం అశ్వారావుపేట సెగ్మెంట్‌లో పార్లమెంట్ ఎన్నికలకు 1,59,174 మంది ఓటర్లు నమోదు అయ్యారు. 2023 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో 1,55,961 మంది ఓటర్లు నమోదు అయ్యారు. అసెంబ్లీ ఎన్నికలకు త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలకు అశ్వారావుపేట నియోజక వర్గంలో 3,213 మంది ఓటర్లు పెరిగారు. అశ్వారావుపేట నియోజక వర్గం ఏర్పడిన నాటి నుండి ఈ నెలలో జరిగే పార్లమెంట్ ఎన్నికల వరకు ఏ ఎన్నికలకు ఎంతమంది ఓటర్లు నమోదు అయ్యారో తెలుసుకుందాం.



నియోజక వర్గాలు పునర్విభజనలో భాగంగా 2009లో అశ్వారావుపేట నియోజక వర్గం రూపుదిద్దుకుంది. నాడు అశ్వారావుపేట, ములకలపల్లి, దమ్మపేట, కుక్కునూరు, వెలేరుపాడు మండలాలు నియోజక వర్గంలో ఉండేవి. ఈ ఏడాది అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 1,53,271 మంది ఓటర్లు నమోదు అయ్యారు.

2014 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 1,67,493 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రాల పునర్విభజనలో భాగంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి మొదటి సారి ఎన్నికలు జరిగాయి. ఈ సారి కుక్కునూరు, వెలేరుపాడు మండలాలు ఆంధ్రప్రదేశ్ విలీనం అయ్యాయి. మండలాల పునర్విభజనలో చంద్రుగొండ, అన్నపరెడ్డి పల్లి మండలాలు ఈ నియోజక వర్గంలో చేరాయి. 2018 అసెంబ్లీకి 1,43,960 మంది ఓటర్లు కాగా,2019 పార్లమెంట్ ఎన్నికల్లో 1,50,205 మంది ఓటర్లు ఉన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 1,55,961 మంది ఓటర్లు ఉండగా 2024 పార్లమెంట్ ఎన్నికల్లో 1,59,174 నమోదు అయి ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు రేపు జరగబోయే పార్లమెంట్ ఎన్నికలకు 3,213 మంది ఓటర్లు పెరిగారు. ఎంతమంది ఓటు హక్కు వినియోగించు కుంటారో వేచి చూద్దాం.

రానున్న 5 ఏళ్లలో సింగరేణి భవిష్యత్తు...

- 2029-30 వరకు 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం
- బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, లాభాల్లో వృద్ధి వివిధ రంగాల్లో అంశాలపై వర్క్ షాప్

నవతెలంగాణ్ణ-కొత్తగూడెం



రానున్న 5 ఏండ్లలో సింగరేణి భవిష్యత్తు, 2029నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలనే లక్ష్యంలో సింగరేణి సంస్థ సిఅండ్ఎండి ఎన్.బలరామ్ ఆదేశాల మేరకు సంస్థలోని పలు శాఖ డైరెక్టర్స్ వర్క్‌షాప్ నిర్వహించారు. కొత్తగూడెంలోని ఇల్లందు క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో వారు సింగరేణి భవిష్యత్తు గుర్తించి చర్చించారు. సంస్థ 2029-30 ఆర్థిక సంవత్సరం లోపు వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 100 మిలియన్ టన్నుల దిశగా పయనించటానికి చర్యలు, 2024-25 ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తిలో 10 శాతం వృద్ధి సాధించటానికి ప్రణాళికలు, బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, లాభాల్లో వృద్ధి, వివిధ రంగాల్లో విస్తరణ అంశాలపై తీసుకొనవలసిన భవిష్యత్ ప్రణాళికపై చర్యలను తీసుకోవటానికి సిపిపి, హెచ్ఆర్‌డి డిపార్ట్‌మెంట్స్ ఆధ్వర్యంలో జీఎం (సిపిపి) జక్కం రమేష్ అధ్యక్షతన వర్క్ షాప్ జరిగింది. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరక్టర్ పర్సనల్ అండ్ ఆపరేషన్స్ ఎస్‌వికే. శ్రీనివాస్, డైరక్టర్ (పి అండ్ పి) జి.వేంకటేశ్వర రెడ్డి, డైరక్టర్ (ఈ అండ్ఎం) డి.సత్యనారాయణ రావు మాట్లాడుతూ దేశ విద్యుత్, బొగ్గు వినియోగ అవసరాల దృష్ట్యా సింగరేణి సంస్థ భవిష్యత్తులో 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయటం అవసరమన్నారు. ఆ దిశగా వివిధ విభాగాలలో రక్షణ సూత్రాలు పాటిస్తూ, ఉత్పత్తి ఉత్పాదక పెంచుకోవాలని సూచించారు. సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తిలోనే కాకుండా థర్మల్, సౌర, జియో థర్మల్ ఉత్పత్తిలో కూడా అభివృద్ధి సాధించాలని అన్నారు. 100 మిలియన్ టన్నుల లక్ష్య సాధన కొరకు ప్రతి ఉద్యోగికి అవగాహన కల్పించాలని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రైవేట్ సెక్టార్ కంపనీలతో పోల్చుకుంటే ఉత్పత్తి వ్యయం తగ్గించుకొని వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేయాలని కోరారు. దేశ విద్యుత్ అవసరాలలో సింగరేణి సంస్థ తన వంతు భాగస్వామి గా ఉండటం మనకెంతో గర్వ కారణమన్నారు. దేశ బొగ్గు అవసరాలు గణనీయముగా పెరుగుతున్న దృష్ట్యా సింగరేణి సంస్థ తన వంతు భాద్యతగా బొగ్గు ఉత్పత్తి పెంచుకోవటానికి తగు ప్రణాళికలతో ఉత్పత్తి ఉత్పాదక పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మణుగూరు జీఎం దుర్గం రాంచందర్, కొత్తగూడెం ఏరియా జీఎం షాలెమ్ రాజు, ఇల్లందు ఏరియా జీఎం జాన్ ఆనంద్, కార్పొరేట్ జీఎంలు ఏ.రవి కుమార్, హబీబ్ హుస్సైన్, కె.గురవయ్య, జేవిఎల్ గణపతి, టి.సురేష్ బాబు, ఎం.సుబ్బా రావు, నారాయణ రావు, సుభాని, టి.సూర్యనారాయణ, సిహెచ్.నవీన్ కుమార్, ఎన్.దామోదర రావు, బి.వెంకయ్య, వై.రఘురామి రెడ్డి, ఎం.సుబ్బా రావు, జి.మోహన్ రెడ్డి, డివిఎస్ఎన్ రాజు, పిసి బస్వి రెడ్డి, జానకి రామ్, సుశాంత్ సహా, బిజిఎస్ఎస్ఎన్ మాచారయ్య, రామకుమార్ రావు, బి.హనుమంత రావు, బిఆర్.దీక్షితులు, పి.సామ్యూల్ సుధాకర్, కవితా నాయుడు, వీసం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని రకాల పరీక్షలు ఉచితం

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు దుర్గాభవాని

నవతెలంగాణ-పినపాక

ప్రభుత్వ వైద్య శాలల్లో అన్ని రకాల పరీక్షలు ఉచితంగా అందజేస్తున్నాం అని పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు దుర్గాభవాని తెలియజేశారు. డీఎంహెచ్వో ఆదేశాల మేరకు ఆదివారం పినపాక మండలం భూపాలపట్నం గ్రామపంచాయతీ పరిధిలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. భూపాలపట్నం గ్రామపంచాయతీలో 166 ఇండ్లు ఉండగా 525 మంది నివసిస్తున్నట్లుగా తెలియజేశారు. ఫీవర్ సర్వే 525 మందికి పూర్తి చేయడం జరిగిందని తెలియజేశారు. 33 మందికి పరీక్షలు నిర్వహించగా మూడు జ్వరం కేసులు, మలేరియా ఒక కేసు నమోదు అయినట్లుగా తెలియజేశారు. ఆర్‌బీఎస్‌కే టీం ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లుగా తెలియజేశారు. జ్వరం లక్షణాలు ఉంటే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశాలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.



అకాల వర్షం...

- మామిడి రైతులకు తీవ్ర నష్టం
- గాలి దుమారానికి పలుచోట్ల పడిపోయిన ఇండ్లు

నవతెలంగాణ-చంద్రుగొండ

ఒక్కసారిగా వచ్చిన ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం రైతులకు అనుకోని నష్టాన్ని మిగిల్చింది. మరి కొద్ది రోజుల్లో పంట చేతికొస్తుందనుకున్న క్రమంలో మామిడి తోటలో కాయలు రాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలాల్లోని చంద్రుగొండ, తిప్పనపల్లి, అయ్యన్నపాలెం, దామరచర్ల, మద్దుకూరు, సీతాయిగూడెం, గ్రామాల్లో మామిడి తోటల్లో కాయలు కింద రాలిపోయాయి. పలు గ్రామాల్లోని తోటల్లో 30శాతం నుంచి 50 శాతం వరకు మామిడి కాయలు నేలరాలాయి. ఇప్పటికే తేనెమంచుతో పూసిన పూతకు వాడిపోయి అంతంత మాత్రంగా కాసిన మామిడి ఇప్పుడు వర్షంతో కాసిన కాయలు కూడా రాలిపోవడంతో మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో వారం పది రోజుల్లో కాయలు కోసిమార్కెట్కు తరలించుకుందాం అనే సమయానికి అకాల గాలిదుమారం తమ ఆశలపై నీళ్ళ చల్లిందని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వాస్తవానికి మామిడి కాయల తడిచినా, మచ్చలు వచ్చినా మార్కెట్లో వాటిని కొనుగోలు చేయడానికి వ్యాపారులు ఆసక్తి చూపరు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. అయ్యన్నపాలెం గ్రామంలోని నరుకుల్ల వాసు, వెంకట రామారావుకు చెందిన మామిడి తోటలో సుమారు మూడు టన్నులకు పైగా మామిడి రాలిపోవడంతో రూ.లక్ష యాభై వేల పంట నష్టం వాటిల్లింది. అలాగే అకాల వర్షానికి దామరచర్ల గ్రామంలోని బండా వెంకటేశ్వర్లు, సగొండి వెంకటేశ్వర్లు, అయ్యన్నపాలెం ఎస్సీ కాలనీకి చెందిన పిడమర్తి వెంకటేశ్వర్లు, ఇంటి పై కప్పులు పూర్తిగా లేచిపోయాయి. దీంతో మూడు లక్షలు ఆస్తి నష్టం వాటిల్లింది. అలాగే కల్లాల్లో ఆరబోసిన వరి ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయింది. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతులు బాధితులు వేడుకుంటున్నారు.



జిల్లా స్థాయి ఎంసెట్ మోడల్ పరీక్షకు అనూహ్య స్పందన

నవతెలంగాణ-బూర్గంపాడు

మండల పరిధిలోని సారపాక బ్రిలియంట్ జూనియర్ కాలేజ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి ఎంసెట్ మోడల్ పరీక్షకు అనూహ్య స్పందన లభించింది. వివిధ కాలేజీల్లో చదువుతున్న ప్రభుత్వ, ప్రయివేటు కాలేజీల విద్యార్థులు దాదాపు 83 మంది ఈ మోడల్ పరీక్షకు హాజరై తమ ప్రతిభను చాటుకున్నారు. బీఎస్ఆర్ ఎంసెట్ మోడల్ పరీక్ష నిర్వహించి మారుమూల ప్రాంత విద్యార్థులకు పరీక్ష పై అవగాహన కల్పించడం ఎంతో సంతోషంగా ఉందని విద్యార్థుల తల్లితండ్రులు బీఎస్ఆర్‌ని ఎంతగానో కొనియాడారు. ఈ సందర్భంగా బ్రిలియంట్ విద్యాసం స్థల చైర్మెన్ బీఎస్ఆర్ మాట్లాడుతూ రెండు రోజులలో నిర్వహించే ఎంసెట్ పరీక్షకు హాజరు అయ్యే విద్యార్థులకు పరీక్షపై అవగాహన కల్పించడానికి ఈ మోడల్ పరీక్షలు నిర్వహించామన్నారు. ఎంసెట్ పరీక్ష రాసే గ్రామీణ ఏజెన్సీ విద్యార్థులకు మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులలో వారి సామర్థ్యాన్ని తెలుసుకునేందుకు ఈ పరీక్ష ఎంతగానో ఉపయోగ పడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆయన అన్నారు. మీరంతా డాక్టర్లు, ఇంజనీర్లు అయి తమ దేశానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మెన్ బీఎస్ఆర్, అధ్యాపకులు, విద్యార్థులు తల్లితండ్రులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

- మానవత్వం చాటుకున్న కాంగ్రెస్ నాయకులు బోడా రమేష్

నవతెలంగాణ-పినపాక

అనాథ శవానికి అంత్యక్రియలు జరిపి కాంగ్రెస్ నాయకులు బోడా రమేష్ మానవత్వాన్ని చాటుకున్నారు. పినపాక మండలం దుగినేపల్లి గ్రామంలో కొన్నేళ్లగా ఓ వ్యక్తి గ్రామంలోనే సంచరిస్తూ గ్రామస్తులు పెట్టిన భోజనాన్ని తింటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే అనారోగ్యం బారిన పడి 2 రోజుల క్రితం మృతి చెందాడు. పోలీసులకు సమాచారం అందించి మణుగూరులో పోస్టుమార్టం వరకు చేయించి ఆదివారం కాంగ్రెస్ నాయకులు రమేష్, ఆ గ్రామ పంచాయతీ సిబ్బంది రవితో పాటు మరికొంతమంది స్పందించి అనాథ శవానికి సాంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు జరిపారు. సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రమేష్‌ను పలువురు అభినందించారు.



ఎంసెట్ నమూనా పరీక్షలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

- నోడల్ అధికారి సులోచన రాణి
- విజయవంతమైన లిటిల్ ఫ్లవర్స్ ఎంసెట్ మోడల్ పరీక్ష

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు అవకాశం ఉన్న మేరకు నమూనా పరీక్షలలో పాల్గొని ప్రావీణ్యం పెంచుకోవాలని నోడల్ అధికారి సులోచన రాణి కోరారు. ఆదివారం భద్రాచలం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంసెట్ మోడల్ పరీక్ష పత్రాలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సులోచన రాణి మాట్లాడుతూ... ఎంసెట్ పరీక్ష కోసం సిద్ధమవుతున్న విద్యార్థులకు ఈ నమూనా పరీక్షలు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. పరీక్షల సమయాలలో విద్యార్థులు భయాన్ని వీడి ఏకాగ్రతతో పరీక్షలలో పాల్గొంటే మంచి ఫలితాలు సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థలు ఎంసెట్ మోడల్ పరీక్ష నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో లిటిల్ ఫ్లవర్స్ కళాశాల డైరెక్టర్ మాగంటి రమేష్ బాబు అధ్యాపకులు బషీర్ పాల్గొనగా ఈ నమూనా పరీక్షలో సుమారు 90 మంది విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథం

నవతెలంగాణ-పినపాక



దేశాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, త్వరలో జరగే లోక్‌సభ ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థును భారీ మెజార్టీతో గెలిపించి సత్తా చాటుదామని కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథం పిలుపునిచ్చారు. ఆదివారం పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 134 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీలోనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీల సారథ్యంలో పార్టీ బలంగా ఉందని రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యమన్నారు. నాడు బ్రిటీష్ దొరలను నేడు గడీల దొరలను కాంగ్రెస్ గడగడలాడించిందన్నారు. ప్రజలకు స్వేచ్ఛాయుతమైన జీవితాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్న బలరాం నాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి, సూరెడ్డి తిరుపతిరెడ్డి(బుల్లి రెడ్డి), మైనార్టీ సెల్ నాయకులు బసీరుద్దీన్, మీరా సాహెబ్, మాజీ ఉపసర్పంచ్ వెంకటేశ్వర రెడ్డి, కొండేరు సంపత్, తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బొంబే కాలనీలో వోల్టేజ్ సమస్యను పరిష్కరించాలి

నవతెలంగాణ-మణుగూరు



సింగరేణి కార్మికులు నివాసముండే బాంబే కాలనీలో వోల్టేజ్ సమస్య పరిష్కరించాలని టీబీజీకేఎస్ ఏరియా ఇన్‌చార్జి నాగేల్లి వెంకట్ ఆదివారం పత్రిక ప్రకటనలో తెలిపారు. మండుతున్న ఎండల దృష్ట్యా కార్మిక నివాసాలకు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని కోరారు. భానుడి భగభగలతో నిప్పుల కొలిమిలాగా మారిన మణుగూరు ఏరియాలో కార్మిక వర్గం నివాసం ఉండే క్వార్టర్‌లకు విద్యుత్ అంతరాయం తలెత్తకుండా ప్రణాళిక బద్ధంగా పనులు నిర్వహించడమే కాకుండా ముందస్తు చర్యలు చేపడుతూ నిరాటకంగా విద్యుత్ సరఫరా అందిస్తున్న ఏరియా ఏజీఎం నర్సిరెడ్డి అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. లో వోల్టేజ్ సమస్య తో బొంబాయి కాలనీ వాసులు పడుతున్న ఇబ్బందులను నర్సిరెడ్డిని స్వయంగా కలిసి నాగెల్లి వివరించినట్టు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తిరిగి రాత్రి 7 గంటల నుంచి 10 గంటల వరకు ఈ లో వోల్టేజ్ సమస్య ఉత్పన్నం అవుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్ కుమార్, మునిగెల నాగేశ్వర రావు, శ్రీహరి, రమేష్ , శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను మోసం చేసిన గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు

నవతెలంగాణ-మణుగూరు



కార్మికులను గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు మోసం చేస్తున్నాయని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి వల్లూరు వెంకటరత్నం అన్నారు. ఆదివారం బ్రాంచ్ అధ్యక్షులు టీవీ ఎంవి ప్రసాద్ అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎండలు ఎక్కువగా ఉన్నాయని కార్మికులు ఇబ్బంది పడుతున్నారని డ్యూటీ సమయాలను మార్చాలని ఎప్పటినుండో సీఐటీయూ, కార్మిక వర్గం డిమాండ్ చేస్తుందన్నారు. అలాగే మిషనరీని కూడా కాపాడవలసిన యాజమాన్యం ఏదో కార్మిక వర్గానికి మేలు చేసిన విధంగా ప్రవర్తిస్తుందని, ఇది కార్మికులను మోసం చేయడమే తప్ప కార్మికులకు గాని అలాగే మిషనరీ గాని లాభం చేసినట్లు కాదని విమర్శించారు. కార్మిక వర్గం కోరుకున్నట్లు మొదటి బదిలీ ఉదయం 7 గంటల నుండి ఒంటి గంట వరకు, అలాగే రెండో బదిలీ నాలుగు గంటల నుండి 11 గంటల వరకు ఉండాలని సీఐటీయూగా డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో మాచారపు లక్ష్మణరావు, రామ్మూర్తి, ఈశ్వరరావు, ప్రభాకర్ రావు, విల్సన్ రాజు, శ్రీకాంత్, బుచ్చిరెడ్డి, బిక్షపతి, శ్రీనివాస్, బొల్లం రాజు, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

ఎండలతో భగ్గుమంటున్న భద్రాద్రి

- అల్లాడి పోతున్న ప్రజలు...
- రక్షణ చర్యలు పాటించాలి : వైద్యుల సూచన

నవతెలంగాణ-కొత్తగూడెం

వేసవి భానుడి భగభగలతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులు మండిపోతున్నారు. గత 10 రోజులుగా వేసవి తీవ్రత పెరిగింది. వాతావరణంలో ఉష్ణోగ్రత పెరిగింది. గతం కంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఇప్పటికే 47 డిగ్రీలు దాటి నమోదు అవుతున్న తరుణంలో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇంటి నుంచి బయటకు రావాలంటేనే భయ భ్రాంతులకు గురవుతున్నారు. ఉదయం 9 గంటల నుండి ఎండ వాతావరణం పెరిగిపోయి, భానుడి వేడి తీవ్రత పెరుగుతుంది. ఈ క్రమంలో ఉదయం 9 గంటలలోపే కార్యక్రమాలు ముగించేసుకుంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటికి రావాలంటే ప్రజలు అల్లాడిపోతున్నారు. ఒక క్షణం కరెంటు పోయిందంటే ఉక్కపోతతో విలవిల లాడుతున్న తీరు కనిపిస్తుంది. చంటి బిడ్డలు ఉన్న ఇంట్లో కష్టాలు వర్ణణాతీతం. గత వేసవి కాలం కంటే ఈసారి అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నయని తెలుస్తుంది. ఈ క్రమంలో సామాన్య ప్రజలతో పాటు, వయోవృద్ధులు తీవ్ర అనారోగ్యం పాలవుతున్న తరుణంలో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారుల సమాచారం మేరకు 47 డిగ్రీలు నమోదు అవుతున్నప్పటికీ, అనాధికారికంగా 50 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు ఉన్నాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. మధ్యాహ్నం పూట రోడ్లన్నీ నిర్మానుషంగా కనిపిస్తున్నాయి. ఇతర



ప్రాంతాల నుంచి కొత్తగూడెం పట్టణానికి వచ్చి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వేడి వాతావరణం తట్టుకోలేక నీడ కనిపించిన చోట, చెట్ల కింద సేద తీరుతున్నారు. శని, ఆదివారాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం, అశ్వాపురం మండలంలో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలతో రెడ్‌ఎలర్ట్ నమోదయ్యాయి. వేసవిలో జిల్లాలో ఇవి అత్యధికం కావడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తుంది. ఎండాకాలం అధిక వేడి తీవ్రత దృష్ట్యా జిల్లాలో ఇప్పటికే వాతావరణ శాఖ రెడ్ అలర్టు ప్రకటించిన విషయం విధితమే. గత రెండురోజుల క్రితం జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో గాలి దుమారంతో వర్షం కురిసినప్పటికీ వాతావరణంలో ఎలాంటి చల్ల దనం కనిపించక పోగా మరింత ఉక్కపోత పెరిగితంది. ఈదురుగాలులకు చెట్లు, కరెంటు స్తంబాలు విరిగి పోవడంతో శనివారం విద్యుత్ లేకుండా పోయింది. ముఖ్యంగా సింగరేణి ప్రాంతంలో బొగ్గు కార్మికులు గని కార్మికులు తీవ్ర ఇబ్బందులు అధిక అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్నారు. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో వేసవి తీవ్రతను తట్టుకుని ఇంటి నుంచి బయటకు రాకుండా సరైన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యు లు సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా వాతావరణ శాఖ తాజా గా వాతావరణంలో మార్పు వస్తుందని, రాగల నాలుగు రోజులు వార్షలాలు కురుస్తాయని ప్రకటించిన తరుణంలో ప్రజలు కాస్త ఊపిరి పీల్చుకున్నట్లు అయినప్పటికీ, మే మాసం అంతా ఎండ తీవ్రత ఉంటుందని చెప్పకతప్పదు.

గతంతో ఎప్పుడూ లేని ఎండలు : వృద్ధురాలు పార్వతమ్మ



ఇప్పటి వరకు ఇలాంటి ఎండలు మేము చూడలేదు. ఎన్నో ఎండా కాలాలు చూశాం కానీ 70 ఏండ్ల కాలంలో ఇంత వేడి వాతా వరణం ఉన్న ఎండలు చూడలేదు. తప్పని పరిస్థితిలో ప్రయాణం చేయాల్సి వచ్చింది. లేకుంటే ఇంటి వద్దనే ఉండేదాన్ని. ఇంటి పట్టునుంటే మంచిది.

తీవ్రమైన ఎండ..వడదెబ్బ సూచనలు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎండ తీవ్రత అధికంగా ఉన్నది. మన జిల్లాల్లో ఎండ తీవ్రత 46 డిగ్రీ సెల్సియస్ కంటే ఎక్కువగా పెరగవచ్చు. వడదెబ్బకు అనారోగ్యానికి గురి అయ్యే అవకాశం ఉంటుంది. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే రావాలి. లేకుంటే బయటకు రావద్దు. వీలైనతవరకూ ఇంట్లోనే ఉండండి. బాగా గాలి, వెలుతురు, చల్లని ప్రదేశాలలో ఉండాలి. ప్రత్యక్ష సూర్యకాంతి, వేడి గాలుల బారిన పడకుండా నిరోధించాలి. పగటిపూట కిటికీలకు కర్టన్లు మూసి ఉంచాలి. చల్లటి గాలి లోపలికి రావడానికి రాత్రి వాటిని తెరవాలి. శిశువులు, చిన్న పిల్లలు, గర్భిణీ స్త్రీలు ఆరుబయట పని చేసే వారు, మానసిక వ్యాధి ఉన్న వారు శారీరకంగా అనారోగ్యంతో ఉన్నవారు, గుండె జబ్బులు, అధిక రక్త పోటు ఉన్నవారు, చల్లటి వాతావ రణం నుండి వేడి వాతావరణానికి వచ్చే వారు, వడగా లులు సమయంలో బయట సందర్శించినట్లయితే వారి శరీరాలు వేడికి అలవటు పడటానికి ఒక వారం సమ యం పడుతుంది. దీని కోసం పుష్కలంగా నీరు తాగాలి.

- :డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శిరీష



శ్రమ దోపిడీ వ్యవస్థను రూపుమాపింది కారల్ మార్క్స్

- మచ్చా రామారావు

నవతెలంగాణ-చర్ల

శ్రమ దోపిడీ వ్యవస్థను పూర్తిగా రూపుమాపడానికి కారల్ మార్క్స్ విశేష కృషి చేశారని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మచ్చ రామారావు అన్నారు. ఆదివారం స్థానిక బిఎస్ రామయ్య భవనంలో పార్టీ మండల కమిటీ సమావేశం పొడుపు గంటి సమ్మక్క అధ్యక్షతన జరిగింది. కారల్ మార్క్స్ 204వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ప్రపంచ గతిని మార్చిన సిద్ధాంతకర్త కారల్ మార్క్స్ పెట్టుబడిదారీ వ్యవస్థను, శ్రమ దోపిడీ వ్యవస్థను, రద్దు చేయడం ద్వారానే శ్రామిక వర్గానికి విముక్తి జరుగుతుందన్నారు. ఆయన 1818 జర్మనీలో మార్క్స్ జన్మించాడని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు బందెల చంటి, తాటి నాగమణి, పామర్ బాలాజీ, కారం నరేష్, దొడ్డి హరినాగ వర్మ పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని ఓడించడమే సీపీఐ(ఎం) లక్ష్యం

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



మే 13వ తేదీన జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో వామపక్షాలు బలపరిచిన ఇండియా కూటమి కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ని సీపీఐ(ఎం) బలపరుస్తుందని, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, భద్రాచలం నియోజకవర్గ ఇన్చార్జి మచ్చా వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి అధ్యక్షతన జరిగిన పట్టణ కార్యదర్శి వర్గ సమావేశంలో మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... బిజెపి భారతదేశాన్ని కులాలు, మతాల పేరుతో విభజించెల చూస్తుందని, రామరాజ్యం పేరుతో రామున్ని సైతం రాజకీయాల్లోకి లాగి రాజకీయ లబ్ది పొందాలని చూస్తుందని విమర్శించారు. పార్లమెంటులో 400 సీట్లలో గెలిపిస్తే భారత రాజ్యాంగాన్ని మారుస్తామని పదేపదే కేంద్ర మంత్రులు చెప్పడాన్ని ప్రధానమంత్రి ఏ రకంగా సమర్థించుకుంటారని అన్నారు. రాజ్యాంగం మారిస్తే రిజర్వేషన్లకు ముప్పు వస్తుందని, పౌర హక్కులు, ప్రజాస్వామ్యం, లౌకిక తత్వం దెబ్బతింటుందని అన్నారు. ప్రజాస్వామికవాదులు రాజకీయాలకతీతంగా ఇటువంటి తిరోగమన విధానాలను వ్యతిరేకించాలని కోరారు. బిజెపి రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత 150 ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టిందని విమర్శించారు. నిత్యవసర సరుకులు ధరలు విపరీతంగా పెంచిందని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేదని, కొత్త ఫ్యాక్టరీలని తెరవలేదని, ఉన్న ఫ్యాక్టరీలని పట్టించుకోవడంలేదని విమర్శించారు. నిరుద్యోగం, పేదరికం పెంచడంలో బిజెపి ముందంజలో ఉందని అన్నారు. బిజేపికి అభివృద్ధి కంటే రాజకీయాలే ముఖ్యమని బిజెపి భావిస్తుందని అన్నారు. బిజెపి మత రాజకీయాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. భారత రాజ్యాంగ ఉనికికే ప్రమాదం వచ్చే అవకాశాలను ప్రజలు అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బిజెపిని ఓడించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. ఇండియా బ్లాక్ అభ్యర్థులను గెలిపించడం ద్వారా బిజెపి మతోన్మాద రాజకీయాలను వెనక్కు కొట్టాలని పిలుపునిచ్చారు. ఇండియా బ్లాకు పిలుపులో భాగంగానే మహబూబాబాద్ పార్లమెంటు అభ్యర్థిగా ఉన్న బలరాం నాయక్‌నీ సీపీఐ(ఎం) బలపరుస్తుందని అన్నారు. అన్ని విధాలుగా పార్టీ అభిమానులు, ప్రజలు, కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించడం కోసం కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబు, వై.వెంకట రామారావు, పి.సంతోష్, ఎస్.లీలావతి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో ఆదర్శం

ఆంగ్ల మాధ్యమంలో 100 శాతం ఫలితాలు సాధించిన భీముని గూడెం

- 10/10 మార్కులు పొందిన పాఠశాల విద్యార్థిని జ్యోతి చందు

నవతెలంగాణ-అశ్వారావుపేట



మండలంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో వందకు వంద శాతం ఫలితాలు సాధించి, ఈ పాఠశాల విద్యార్థిని జ్యోతి చందు 10/10 మార్కులు తెచ్చుకున్న ఘనత దక్కడంతో ఉత్తమ పాఠశాలగా గుర్తింపు తెచ్చుకుంది. మండలంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐటీడీఏ నిధులతో నిర్వహిస్తున్న గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలు మొత్తం ఆరు ఉన్నాయి. సున్నం బట్టి, పెద్దవాగు ప్రాజెక్ట్ పాఠశాలకు బాలురువి కాగా అనంతారం, కావడి గుండ్లు, భీముని గూడెం, అశ్వారావుపేట పాఠశాలలు బాలికలవి. భీముని గూడెం పాఠశాలలో ఈ ఏడాది పదోతరగతి 48 మంది అందరూ ఉత్తీర్ణత సాధించగా, జ్యోతి చందు అనే విద్యార్ధిని 10/10 జీపీఏ సాధించింది. ఈ ఆరు పాఠశాలలో ఈ పాఠశాల ఫలితాలు పరంగా మొదటి స్థానంలో నిలిచింది. సున్నం బట్టి పాఠశాల 24 మందికి 23 ఉత్తీర్ణత పొంది 95.83 శాతంతో రెండో స్థానంలో ఉంది. అనంతారం బాలికల పాఠశాల 39 మందికి 38 మంది ఉత్తీర్ణత సాధించి 92.31 శాతంతో మూడో స్థానంలో ఉంది. మారుమూల ప్రాంతం అయిన అటవీ ప్రాంతంలో ఉండే కావడి గుండ్ల బాలికల పాఠశాల 12 మందికి 11 ఉత్తమ ఫలితాలు సాధించి 81.87 శాతంతో నాలుగో స్థానంలో నిలిచింది. ప్రస్తుతం సున్నం బట్టిలో నిర్వహిస్తున్న పెద్దవాగు ప్రాజెక్టు బాలురు పాఠశాల 22 మందికి 20 మంది ఉత్తీర్ణత పొంది 90.81 శాతంతో ఐదో స్థానంలో ఉంది. అశ్వారావుపేట బాలికల పాఠశాలలో 12 మందికి 9 మంది ఉత్తీర్ణత పొంది 75 శాతంతో చివరిన నిలిచింది.

ఈ ఫలితాలు ప్రకారం 95.83 శాతం ఉత్తీర్ణత పొందిన సున్నం బట్టి పాఠశాల మండలంలోనే మొదటిది సారిగా ప్రారంభించిన పాఠశాల. ఈ పాఠశాలలోనే చదివిన, అశ్వారావుపేట మొదటి ఎమ్మెల్యే వగ్గెల మిత్ర సేన, ఇదే పాఠశాలలో పని చేస్తూ రాజకీయాల్లోకి వచ్చిన ప్రస్తుతం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కావడం గర్వించదగ్గ విషయం. 75 శాతం ఫలితాలతో చివరిలో నిలిచిన అశ్వారావుపేట బాలికల పాఠశాల నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేటలో ఉండటం మండలంలోనే చివరిగా ఏర్పడిన పాఠశాల కావడం గమనార్హం.



టెన్నిస్ క్రీడాకారుడికి ఘన సన్మానం

నవతెలంగాణ-పాల్వంచ

పాల్వంచ, పాల్వంచ పట్టణంలో టెన్నిస్ క్రీడను అందుబాటులోకి తీసుకువచ్చి క్రీడాకారులను తీర్చిదిద్దిన ఘనత ఒక్క వై.వెంకటేశ్వర్లుకు మాత్రమే దక్కుతుందని టెన్నిస్ క్రీడా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు డాక్టర్ యుగంధర్ రెడ్డి అన్నారు. వై.వెంకటేశ్వర్లు ఇటీవల కేటిపిఎస్‌లో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా టెన్నిస్ క్రీడా మైదానంలో ఆయనకు టెన్నిస్ అసోసియేషన్ వారు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం, భద్రాచలం నుండి వచ్చిన క్రీడాకారులు పలువురు మాట్లాడుతూ ఒకప్పుడు టెన్నిస్ క్రీడా మైదానం ఒక్క నవభారత్‌లో మాత్రమే అందుబాటులో ఉండేది అని అక్కడికి బయటి వ్యక్తులను రానిచ్చే వారు కాదని కేవలం ఉన్నత స్థాయి వ్యక్తులకే పరిమితం అయ్యిందన్నారు. కానీ వై.వెంకటేశ్వర్లు కేటీపీఎస్‌లో టెన్నిస్ క్రీడా మైదానం అందుబాటులోకి తీసుకు వచ్చి బయటి వ్యక్తులను కూడా ప్రోత్సహించి ఈ రోజు వందలమంది టెన్నిస్ క్రీడాకారులను నేషనల్ స్థాయిలో ఆడే విధంగా తీర్చిదిద్దారన్నారు. ఆయన ప్రోత్సాహంతో అన్నం వెంకటేశ్వర్లు పాల్వంచ నుండి నేషనల్ స్థాయిలో ఆడి సిల్వర్ మెడల్ సాధించడం ఎంతో గర్వించదగ్గ విషయం అని అన్నారు.

అదే తరహా ప్రోత్సాహంతో డాక్టర్ యుగంధర్ రెడ్డి ఎంతో శ్రమకోర్చి అధికారుల వెంటబడి అప్పటి కలెక్టర్ అణుదీప్ సహకారంతో జిల్లాలో రెండు టెన్నిస్ మైదానాలను అందుబాటులోకి తీసుకు వచ్చారని అన్నారు. పదవీవిరమణ పొందారు కావున పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటారని వారి సలహాలు, సూచనలతో ముందుకు వెళతామని అన్నారు. ఈ కార్యక్రమంలో టెన్నిస్ క్రీడా జిల్లా సెక్రటరీ జకిరయ్య, కోచ్ దేవేందర్, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మానుకోటపై గులాబీ జెండా ఎగరడం ఖాయం

నవతెలంగాణ-మణుగూరు

మానుకోటపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని జడ్పీటీసీ పోశం నరసింహారావు అన్నారు. ఆదివారం మండలంలోని కూనవరం గ్రామపంచాయతీ పరిధిలోని చిట్టయ్య గుంపులో జరిగిన పార్లమెంట్ ఎన్నికల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా పని చేసిందన్నారు. కాంగ్రెస్ 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని అన్నారు. తెలంగాణ గొంతుకైనా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తేనే పార్లమెంట్లో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, కెసిఆర్ నాయకత్వాన్ని బలపరుస్తూ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాలోత్ కవిత కారు గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.

ఈ సమావేశంలో కూనవరం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ ఏనిక ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు తాటి సరిత, మాజీ ఎంపీటీసీ వల్లభనేని రమణ, మాజీ ఎంపీటీసీ సభ్యులు కాటిబోయిన సుజాత, మణుగూరు మండల కో ఆప్షన్ సభ్యులు జావిద్ పాషా, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు రామసహాయం వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ ఆకస్మిక దాడి

- రూ.29 వేల విలువచేసే మద్యం పట్టివేత

నవతెలంగాణ-దుమ్ముగూడెం



మండలంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఆదివారం ఆకస్మికంగా దాడి నిర్వహించారు. ఎన్నికల విధులలో భాగంగా భద్రాచలం చర్ల ప్రధాన రహదారిలో గల ఆంధ్ర కేసరి నగర్ గ్రామ సమీపంలో ఉన్న ఓ బెల్టు షాపును తనిఖీ చేశారు. బెల్ట్ షాపు నిర్వహకుడు ఎన్నికల నియమావళికి విరుద్ధంగా నిల్వ ఉంచిన వివిధ బ్రాండ్లకు చెందిన 160 కోటర్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.29 వేలు ఉంటుందని తెలిపారు. దాడుల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్ మధు, సిబ్బంది సురేష్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఫాసిస్టు బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించండి

నవతెలంగాణ-టేకులపల్లి



ఫాసిస్టు బీజేపీ దాని మిత్రపక్షాలను ఓడించాలని న్యూడెమోక్రసీ ఇరు పార్టీల నాయకులు బానోత్ ఉక్లా, కల్తి వెంకటేశ్వర్లు ఓటర్లకు ఆదివారం పిలుపునిచ్చారు. న్యూడెమోక్రసీ తరఫున మహబూబాబాద్ పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్న మోకాళ్ళ మురళీకృష్ణ కుండ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. భూక్యా హర్జ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు పూర్తవుతుందని దేశ ప్రజల మౌలిక సమస్య లేవి పరిష్కరించకుండా విఫలం చెందారని అన్నారు. ఈ సమావేశంలో ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ నోముల భానుచందర్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్ నాయకులు నర్సింగ్, దారావత్ వెంకన్న, ఎట్టి నరసింహారావు, రామచందర్, రామస్వామి, తోటకూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురంలో దమ్మపేట జనసైనికుల ప్రచారం

నవతెలంగాణ-దమ్మపేట



జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ గెలుపు కోరుతూ దమ్మపేట జనసైనికులు ఆంధ్రాలో ప్రచారం చేస్తున్నారు. జనసేన పార్టీ అశ్వారావుపేట నియోజకవర్గ నాయకుడు షేక్ అబ్దుల్ రెహమాన్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో పోటీచేస్తున్న జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ గెలుపుకై జనసైనికులు ఆదివారం ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నట్టు వారు తెలిపారు. జనసేన పార్టీ అభ్యర్థులను గెలిపించాలని, గ్లాసు గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ ఇంటింటా ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో దమ్మపేట మండలానికి చెందిన జనసైనికులు జంగా చంద్రశేఖర్, శీలం వెంకట్, గొపిశెట్టి శ్యామ్ తదితరులు ఉన్నారు.

కారల్ మార్క్స్ స్ఫూర్తితో ఉద్యమాలను ఉధృతం చేస్తాం

- సీపీఐ(ఎం) నియోజవర్గ కన్వీనర్ మచ్చ వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

కారల్ మార్క్స్ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని సీపీఐ(ఎం) నియోజవర్గ కన్వీనర్, రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం భద్రాచలం పట్టణంలోని చందర్‌రావు భవన్‌లో కారల్ మార్క్స్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచం ఉన్నంతకాలం మార్క్స్ సిద్ధాంతం కొనసాగుతుందని సమాజం అభివృద్ధి కావాలన్నా సమ సమాజం నిర్మించాలన్న మార్క్స్ చెప్పిన దోపిడీ వర్గం నశించే వరకు ఇది సాధ్యం కాదని, ఈ ప్రపంచంలో ఉన్న ప్రజలందరూ సమానంగా జీవితాన్ని కొనసాగించినప్పుడే సమాజం పూర్తిస్థాయిలో అభివృద్ధి అవుతుందని, చాలామంది భ్రమిస్తున్నట్టు కమ్యూనిజానికి గడ్డు రోజులు వచ్చాయని కమ్యూనిస్టుల పని అయిపోయిందని చెబుతున్న వారందరూ ఏదో ఒక రోజు అదే కమ్యూనిజం ప్రపంచానికి దిక్సూచిగా నిలుస్తుందని తెలుసుకుంటారన్నారు. చరిత్రలో మార్పు అనివార్యమని ఆ మార్పును కోరుకునేదే కారల్ మార్క్స్ సిద్ధాంతం అని కావున ప్రజలు సమాజం అందరూ అర్థం చేసుకుని మార్క్స్ బోధించినటువంటి విధానాలను కొనసాగించే దానికి అందరం కంకణ బద్ధులై ఉండాలన్నారు. పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షత నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి. నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబు, వై వెంకట రామారావు, పి. సంతోష్ కూమార్, లీలావతి, పట్టణ నాయకులు భూపేందర్, ఎంవిఎస్ నారాయణ, మురళీ ప్రసాద్, కొరసా రవి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

నవతెలంగాణ-జూలూరుపాడు

మండల కేంద్రమైన జూలూరుపాడులో బిఆర్ఎస్ పార్టీ నుండి వివిధ కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలోకి చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆదేశానుసారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, జూలూరుపాడు మండల సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి నాయకత్వంలో, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్ అధ్యక్షతన బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వెంగన్నపాలెం ఎంపిటిసి దుద్దుకురి మధుసూదన్‌రావు, ఉద్యమకారుడు వేల్పుల నరసింహారావు, నున్న రంగారావు, పోతురాజు నాగరాజు,పర్వానేని పుల్లారావు, ఎల్లంకిచ్చిన నాగేశ్వరావు, ఇల్లంగి సుందర్రావు, మాచినేని సత్యం,జూలూరుపాడు మండలం ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెదుగు రామకృష్ణ ఆధ్వర్యంలో 60 కుటుంబాలు..

మెదుగు రామకృష్ణ ఆధ్వర్యంలో 60 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. పార్టీలో చేరిన వారిలో మంద నర్సింహారావు (మాస్), సంతాపురపు పిరయ్య, ఎలికపల్లి నాని, మోదుగు మణికుమార్, నారా పోగు చిన్న నర్సింహారావు, మందా క్రిష్ణయ్య-నారపోగు కృష్ణయ్య, మందా రమేష్, పోతురాజు ఆనందరావు, నార పోరు పెద్ద నరసింహారావు, మందా మహేష్, మంద నరేష్, -సంతాపురపు ప్రవీణ్, పోతురాజు నర్సింహారావు, సంతాపురపు అభిలాష్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

రాష్ట్రంలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటేనే పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయని భద్రాచలం డివిజన్ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షులు పిలక వెంకటరమణరెడ్డి అన్నారు. గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ గెలుపును కాంక్షిస్తూ లక్ష్మీనగరం, ములకపాడు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా విడతలవారీగా సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయడంతో పాటు కేంద్రంలో అధికారంలోకి వస్తే మరో ఐదు పథకాలను చేరువ చేసే విధంగా ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం

నవతెలంగాణ-బూర్గంపాడు

బూర్గంపాడు మండలం సారపాక మేజర్ గ్రామపం చాయతీలో ఆదివారం సంతలో సిపిఐ, సిపిఐ(ఎం), టిడిపి, టీజేఎస్ బలపర్చిన కాంగ్రెస్ పార్ల మెంట్ అభ్యర్థి బలరాం నాయక్ ఎన్నికల గుర్తు హస్తం హస్తం గుర్తుకే ఓటేయాలని మిత్రపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సారపాకలోని వివిధ కాలనీ నుండి వచ్చిన ఓటర్స్ ని మీ పవిత్రమైన అమూల్యమైన ఓటు ముద్ర హస్తం గుర్తుకే వేయాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సిపిఐ,సిపిఐ(ఎం), టిడిపి, టీజేఎస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు.

భవన నిర్మాణ కార్మికుడు మృతి

నవతెలంగాణ-కల్లూరు

కల్లూరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో శాంతినగర్ చెందిన భవన నిర్మాణ కార్మికుడు గుండ్ర గోపాలకృష్ణ అనారోగ్యానికి గురై ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న హమాలీ సంఘం (ఇఫ్ట్) మండల కార్యదర్శి నల్లగట్ల సీతారాములు స్పందించి 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం వారి కుటుంబానికి అందజేశారు. ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు అవుకు వెంకన్న, ,హమాలీ సంఘం జిల్లా అధ్యక్షులు ఖమ్మంపాటి పుల్లారావు, మండల కార్యదర్శి నలగట్ల సీతారాములు జోహార్లు అర్పిస్తూ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

నామ గెలుపును కాంక్షిస్తూ విస్తృత ప్రచారం

నవతెలంగాణ-కల్లూరు

బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు గెలుపు కొరకు కల్లూరు పట్టణంలో గల ఖాన్ ఖాన్ పేట, శాంతినగర్, కప్పల బంధం రోడ్డు, యూ పి ఎస్ రోడ్డు, మెయిన్ రోడ్, రామనగరం, వెల్లంకి వెస్టేట్, పోలింగ్ బూతు బాధ్యులు ఆదివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి స్థానికుడైన నామా నాగేశ్వరరావు ని అత్యధిక మెజారిటీ తో గెలిపించి కెసిఆర్‌కి కానుకగా ఇవ్వాలని కోరారు. ఈ ప్రచారంలో కల్లూరు పట్టణ నాయకులు పెడకంటి రామకృష్ణ, లక్కినేని రఘు, మేకల కృష్ణ, సిహెచ్ కిరణ్ కుమార్, షేక్ కమ్లి, కొరకొ ప్పు ప్రసాద్, సయ్యద్ రావుఫ్, కొత్తపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదకు వైద్యం కోసం రూ.40వేలు వితరణ

నవతెలంగాణ-కల్లూరు : స్థానిక అంబేద్కర్ చెందిన నిరుపేద కూలి మాచర్ల రత్నాకుమార్ 17 సంవత్సరాల బాలుడు షుగర్ వ్యాధితో బాధపడుతూ వైద్య ఖర్చులకోసం డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానికంగా అంబేద్కర్ ఫౌండేషన్ విరాళాల సేకరించి నలభై వేల రూపాయలను ఆదివారం అందజేశారు. తండ్రి లేడు తల్లి మహాలక్ష్మి ఇళ్లల్లో పని చేసుకుని కుమారుడిని పోషిస్తుంది. షుగర్ వ్యాధి తీవ్రతం కావడం వైద్య ఖర్చులకోసం వితరణగా అందజేసిన అంబేద్కర్ ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు తిరుమల ముత్తయ్య, రవల్లి శ్రీను. వైర్ల కాంతారావు, డి. ప్రసాద్ రావు, బి. రాంబాబు, కృష్ణయ్య, ఉబ్బన బాబురావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సత్తుపల్లి మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందిన సున్నం రామకృష్ణ(27) గురువారం ద్విచక్ర వాహనంపై తొట్టి పంపు గ్రామంలో ఉన్న తన మేనమామ చూడటానికి వస్తున్న సమయంలో భాస్కరపురం గ్రామంలో కల్వర్టు వద్ద అక్స్మాత్తుగా గేదే అడ్డు రావడంతో ద్విచక్ర వాహనం పై నుండి క్రింద పడటంతో తలకు తీవ్ర గాయిలు కావడంతో హైద్రాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్న నేపథ్యంలో ఆదివారం రామకృష్ణ మృతి చెందాడు అని మృతుడు కుటుంబ సభ్యులు పిర్యాదు మేరకు ఏఎస్ఐ అంజయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

రెండో రోజుకి చేరిన హెూమ్ ఓటింగ్

- మొత్తం పోలైన ఓట్లు 162
- పోస్టల్ బ్యాలెట్‌లో పోలైన ఓట్లు 78

నవతెలంగాణ-అశ్వారావుపేట

నియోజక వర్గం వ్యాప్తంగా రెండో రోజు కొనసాగిన హెూమ్ ఓటింగ్ లో మొత్తం 172 ఓట్లుకు ఆదివారం నాటికి 162 ఓట్లు, మొత్తం 372 పోస్టల్ బ్యాలెట్ ఓట్లుకుగాను 78 ఓట్లు పోల్ అయినట్లు మండల ఎన్నికల అధికారి, తహశీల్దార్ క్రిష్ణ ప్రసాద్ తెలిపారు. వయో అధిక, వికలాంగులు ఓటర్లు మొత్తం 172 మందికిగాను శనివారం 108, ఆదివారం 54 ఓట్లు పోల్ అవగా, ఖమ్మం, ఇతర జిల్లాల పోస్టల్ బ్యాలెట్ మొత్తం 372 ఓట్లకు గాను ఇతర జిల్లాల 60 మొత్తం పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు 16,ఖమ్మం జిల్లా మొత్తం పోస్టల్ బ్యాలెట్ ఓటర్లకు గానూ 52 మంది మొత్తం 78 మంది సిబ్బంది తమ పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వినియోగించుకున్నారు. ఈ హెూమ్ ఓటింగ్‌లో నవీన్, సందీప్, లక్ష్మి, హరిత, పద్మావతి, వీరయ్య, శ్రీశైలం, రాము, కిరణ్ కుమార్, రాంసుందర్, గోపాల స్వామి, శ్రీహరి, సంతోష్ రామారావులు పోలింగ్ సిబ్బందిగా వ్యవహరించారు.

అభివృద్ధి కొనసాగాలంటే కాంగ్రెస్‌ను గెలిపించండి

- మంత్రి తుమ్మల



నవతెలంగాణ-కల్లూరు

గతంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు కల్లూరు మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని ఆ అభివృద్ధిని పూర్తిస్థాయిలో కొనసాగించడం కోసం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి రామసయం రఘురామరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రజలను కోరారు. ఆదివారం రాత్రి కల్లూరులో జరిగిన కార్నర్ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తాను తొలిసారిగా ఎమ్మెల్యేకి గెలిచినప్పుడు ఈ మండలం నుండి అత్యధిక మెజార్టీ తనకు వచ్చిందని ఆస్ఫూర్తితోనే కల్లూరుకు తప్ప మరే గ్రామానికి రహదారులు లేవని తాను మంత్రి పదవి చేపట్టిన దగ్గర నుండి కల్లూరికి అన్ని గ్రామాల నుండి బీటీ రహదారులు నిర్మించామన్నారు. మండలంలో ఈరోజు ఏ గ్రామానికి వెళ్లిన బెంజి కార్ తో తిరుగుతున్నామని అన్నారు. అలాంటి అభివృద్ధి కొనసాగాలంటే ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే మట్టా రాగమయి సహకారంతో జిల్లా మంత్రులు తనతో పాటు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బట్టి విక్రమార్క ఉన్నామని ఏ అభివృద్ధి కార్యక్రమైనా కాంగ్రెస్ ప్రభుత్వ ఆయాంలో చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. రాగమయికి వచ్చిన మెజార్టీ కంటే ఈ ఎన్నికల్లో అత్యధికంగా రావాలని ప్రజలు కోరారు. ప్రజాసేవ చేయటం కోసమే రాజకీయాల్లోకి వచ్చానని ఒక్కసారి అవకాశం ఇస్తే ముగ్గురు మంత్రులతో సహా సహకారంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తానని పార్లమెంట్ అభ్యర్థి రామసయం రఘురామిరెడ్డి అన్నారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ మండలం నివాసి కావడంతో మీ సమస్యలన్నీ పరిష్కరించడానికి ఆయన ముందు ఉంటారని ఆయనకు తోడుగా నేను ఉండి సమస్య పరిష్కరిస్తామని అన్నారు. 13 న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మట్ట రాగమయి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి, మట్టా దయానంద్ విజయకుమార్, నున్న రామకృష్ణ, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు, సిపిఐ మండల కార్యదర్శి దామాల దయాకర్, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, పసుమర్తి చందర్రావు, భాగం ప్రభాకర్ చౌదరి, నగేష్, తదితర నాయకులుపాల్గొన్నారు.

మామిడిగుండాలలో గాలివాన బీభత్సం



- కూలిన ఇండ్లు, రాలిన మామిడికాయలు
- ప్రభుత్వం ఆదుకోవాలి : మాజీ సర్పంచ్ కృష్ణ

నవతెలంగాణ-ఇల్లందు

ఇల్లందు మండలంలోని మామిడి గుండాలలో ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. భారీగాళ్లలకు ఇండ్ల రేకుల కప్పులు ఎగిరిపోయాయి. గోడలు కూలిపోయాయి. చెట్లు విరిగి కరెంటు తీగలపై పడటంతో విద్యుత్ స్తంభాలు వంగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. భారీగా వేసినటువంటి గాలివాన బీభత్సానికి గట్ల లక్ష్మి (వితంతువు) అనే మహిళ ఇల్లు రెండు గోడలు పైన ఉన్నటువంటి రేకులు మొత్తం లేచిపోవడం జరిగింది. బొమ్మెర గురవయ్య అనే కడుపేద రైతు రేకుల కప్పు ఎగిరిపోయి గోడలు కూలిపోయాయి. తీవ్ర ఆస్తి నష్టం జరిగింది. గాలివాన బీభత్సానికి మామిడికాయలు రాలిపోయాయి. ప్రధానంగా 15 ఎకరాల్లో మామిడి తోటలకు సుమారు రూ.3 లక్షల నష్టం జరిగింది.



వ్యవసాయ, రెవెన్యూ అధికారులు నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదించాలని మామిడి గుండాల మాజీ సర్పంచ్ కుంజ కృష్ణ డిమాండ్ చేశారు. మామిడి రైతులను ఆదుకోవాలని, కూలిపోయిన ఇళ్లకు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

శ్రమ దోపిడీ నుంచి విముక్తి మార్గం చూపిన కార్ల్ మార్క్స్

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

నవతెలంగాణ-కొత్తగూడెం

ఆర్థిక అసమానతలు తొలగినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని కార్ల్ మార్క్స్ తెలిపారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్ పాషా అధ్యక్షత జరిగిన కారల్ మార్క్స్ 206వ జయంతి కార్యక్రమంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ వేతన బానిసత్వం గుట్టు విప్పి, కొందరు వ్యక్తుల చేతిలో పెత్తనం కాకూడదని అందరికీ సమాన అవకాశాలు దక్కాలని, కులమత విద్వేషాలకు కాలం చెల్లిందని చాటిన మహనీయుడు కారల్ మార్క్స్ సిద్ధాంతం మార్గదర్శమని, సోషలిస్టు సమాజమే శ్రేయస్కరమని ఆర్థిక అసమానతలు తొలగినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాయకులు దమ్మాలపాటి శేషయ్య వంగా వెంకట్, వీరస్వామి, మల్లికార్జున్, రమణమూర్తి, గట్టయ్య, ఉమయాన్, వార్డు కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, మునిగడప పద్మ, వెంకటేశ్వర్లు, భూక్య శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్, మహిళా నాయకురాలు రత్నకుమారి, గుత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సీతారాంపురం ఆదివాసీలను వెంటనే ఆదుకోవాలి : సీపీఐ(ఎం)

- సర్వం కోల్పోయిన ఆదివాసీలకు మనోధైర్యం కల్పించాలి

నవతెలంగాణ-పాల్వంచరూరల్

దంతలబోర ఎస్సీ కాలనీ పంచాయతీ సీతారాంపురం ఆదివాసీలను వెంటనే ఆదుకోవాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, మండల కార్యదర్శి కొండబోయిన వెంకటేశ్వరరావులు ఆదివారం సీతారాంపురంను సందర్శించారు. ఈనెల 3 సాయంత్రం సమయంలో వచ్చిన గాలి, వాన బీభత్సానికి 20 ఇళ్ల నేలమట్టమయ్యాయి. గూడు కోల్పోయిన ఆదివాసీలకు ఆశ్రయం కరువైంది. ఆదే సమయంలో గ్రామంలో చెట్టుపై పిడుగు పడడంతో సీతారాంపురం ప్రజలు భయాందోళనతో బీతిల్లారు.



ఆరుగాలం కష్టపడి పండించిన పంట మొత్తం వర్షార్పణమైంది. బాధిత ఆదివాసి గిరిజనులను వెంటనే అన్ని విధాల ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ(ఎం) నేతలు పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు భరోసా కల్పించారు. గిరిజనులకు పక్కా గృహాలు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. 30 సంవత్సరాల నుండి గ్రామంలో నివసిస్తున్న వారికి ఓటు గుర్తింపు కార్డు, రేషన్ కార్డు, ఇంటి పన్ను రసీదులు అన్నీ ఉన్నప్పటికీ గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించని ప్రభుత్వం యంత్రాంగం చిన్నచూపు చూస్తూ మనుగడ సాగించడం అత్యంత దుర్మార్గమన్నారు. సంఘటనను దృష్టిలో పెట్టుకొని తక్షణమే వారికి కులధృవీకరణ పత్రాలు, కరెంటు, రహదారి సౌకర్యం కల్పించాలని అన్నవరపు సత్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో కొండబోయిన వెంకటేశ్వర్లు, మడివి దేవా, సుక్క, ముసకి గంగ, అంజలి, మడవి జోగా తదితరులు పాల్గొన్నారు.

మానుకోట, ఖమ్మంలో గులాబీ జెండా ఎగరడం ఖాయం

- మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లోలో బీఆర్ఎస్ పార్టీ గులాబీ జెండా ఎగరడం ఖాయమని బీఆర్ఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మైలారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపింది మాజీ సీఎం కేసీఆర్ అని అన్నారు. ప్రజలకు అబద్దపు ఆరు గ్యారెంటీల హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, 100 రోజుల్లో వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఘాటుగా విమర్శించారు. ఎన్నికల్లో దొంగ వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. రానున్న పార్లమెంటు ఎన్నికలలో మానుకో, ఖమ్మం నియోజకవర్గాల బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థులను ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఇటర్లను కోరారు. కాంగ్రెస్ పార్టీ మాయ మాటలను ప్రజలు ఇప్పుడు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. మానుకోట పార్లమెంటు అభ్యర్థి మాలోత్ కవిత గెలుపు కోసం బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో నియోజకవర్గం నాయకులు వట్టం రాంబాబు, కొల్లేటి భవాని శంకర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాయం నర్సింహారావు, షేక్ బాబా, జెడ్పీటీసీ కొమరం హనుమంతరావు, ఎంపీపీ కోండ్రు మంజు భార్గవి, మహమ్మద్ ఖయ్యాం, గొగ్గెల లక్ష్మయ్య, ప్రవీణ్, కండె వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి నోరు అదుపులోపెట్టుకోవాలి

- కేసీఆర్‌ను తిట్టడితే ఊరుకునేది లేదు
- విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నేతలు రేగా కాంతారావు, ఉప్పల వెంకట రమణ

నవతెలంగాణ-కొత్తగూడెం

రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి నోరు అదుపులోపెట్టుకుని మాట్లాడాలని, కేవలం కేసీఆర్‌ను తిట్టడితేనే ఇమేజ్ పెరుగుతుందని ఆలోచించడం సరికాదని, నోరు అదుపులో పెట్టుకోక పోతే ఊరుకునేది లేదని, ప్రజాపాలన పేరు ప్రజలకు ఇచ్చిన హామలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలం చెందారని, పాలన గాలికి వదిలేశారని, కాంగ్రెస్ గ్యారంటీలపై జనం అసహనంతో ఉన్నారని, ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామానాగేశ్వరరావు గెలుపు ఖాయమని మాజీ ఎమ్మెల్యే జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు, పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జీ ఉప్పల వెంకట రమణలు ఘాటుగా ఆరోపించారు. ఆదివారం జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారి పరిపాలనపై ప్రజలు అసహ్యించుకునే స్థితికి వచ్చారన్నారు. ఆరు గ్యారంటీలు ఏమాత్రం అమలు చేయలేదన్నారు. మహాలక్ష్మీ పేరుతో ఆర్టీసీకి ఎన్ని నిధులు ఇచ్చారన్నారు. నేడు ఆర్టీసీ దివాళా తీసే పరిస్థికి చేరిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దళిత బంధు ఇచ్చిందని, దాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడం ఎంత వరకు సమంజసమో దళిత సోదరులు ఆలోచించాలన్నారు. ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, మహబూబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాలోత్ కవితల గెలుపుకై బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు శ్రమించాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ జిల్లా అధ్యక్షుడు దిండిగాల రాజేందర్, రాష్ట్ర కమిటీ నాయకుడు మోరే భాస్కర్, అధికార ప్రతినిధి కొలేటి భవానీ శంకర్, సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు కర్నే మురళి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సంకుబాపన అనుదీప్, కొత్తగూడెం టౌన్ యూత్ అధ్యక్షుడు పోతురాజు రవి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల కో-ఆర్డినేటర్‌గా నాగా సీతారాములు నియామకం

నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్

కాంగ్రెస్ పార్టీ ఖమ్మం నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల కమిటీ కో-ఆర్డినేటర్‌గా టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములును నియమిస్తూ మాజీ ఎమ్మెల్సీ, ఎలక్షన్ మేనేజ్మెంట్ కమిటీ కన్వీనర్ కపిలవాయి దిలీప్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి గెలుపు కోసం కొత్తగూడెం నియోజకవర్గంలో తీవ్రంగా శ్రమిస్తున్న సీతారాములుపై నమ్మకంతో ఖమ్మం నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల కమిటీ కోఆర్డినేటర్ భాధ్యత అప్పగిస్తు ఉత్తర్వులు జారీ చేసింది.



రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

నవతెలంగాణ-లక్ష్మీదేవిపల్లి

మండలంలోని అనిశెట్టిపల్లి గ్రామం వద్ద రోడ్డు దాటే క్రమంలో ఓ లారీ ఢీ కొట్టిన సంఘటనలో భార్యాభర్తలు ఇద్దరూ మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పాల్వంచ మండలం మంచి కంటినగర్‌కి చెందిన కుంపటి సామేలు(57), కుంపటి పద్మ(45) భార్యాభర్తలు ఇద్దరూ టీవీఎస్ బండిపై అనిశెట్టిపల్లి క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు దాటేందుకు ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఓ టిప్పర్ వేగంగా వచ్చి ఢీకొట్టడంతో భార్య అక్కడికక్కడే మృతి చెందింది. భర్త సామేలుకు తీవ్ర గాయాలు అయ్యాయి. కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సామేలు మృతి చెందాడు. ఒక ఇంట్లో భార్యాభర్తలు ఇద్దరూ మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యుల్లో విషాదఛాయలు అమలుకున్నాయి. పాల్వంచలోని దమ్మపేట సెంటర్లో సామేలు చెప్పులు కుట్టుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నారు. ఈ రోడ్డు ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముమ్మరంగా హోం ఓటింగ్

నవతెలంగాణ-కూసుమంచి



లోక్‌సభ సాధారణ ఎన్నికల్లో భాగంగా ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గంలో మండలంలో ఇంటి నుండి బయటకు రాలేని వృద్ధులు, దివ్యాంగుల కోసం ఎన్నిక సంఘం ఇంటి నుండే ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించింది. దీంతో శుక్రవారం, శనివారం, ఆదివారం మూడు రోజుల్లో మండలంలో ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఒక బృందంగా ఏర్పడి మండలంలో హెూమ్ ఓటింగ్ విజయవంతం అయ్యేందుకు కృషి చేశారు. మండలంలో పలు గ్రామాలలో మొత్తం 68 మంది ఓటర్లుగాను 65 మంది తమ ఓటు హక్కును ఇంటి వద్ద నుండి వినియోగించుకున్నారు. 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు 24 మంది ఉండగా, 40 శాతానికి మించిన అంగవైకల్యం ఉన్న దివ్యాంగులు 41 మంది ఉన్నారు. హెూమ్ ఓటింగ్ కోసం మండలంలో 68 మంది మండలంలో గుర్తించగా, 65 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇద్దరు వృద్ధులు చనిపోగా, దివ్యంగురాలు ఒక్కరు హెూమ్ ఓటు హక్కును వినియోగించుకోలేదు. ఏదైనా కారణంతో ఓటు హక్కు వినియోగించుకోకుంటే..ఈనెల 8వ తేదీ వరకు మరో అవకాశం కల్పిస్తారని.. ఇంటి నుండి ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నవారు పోలింగ్ రోజు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం లేదని ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.

ఆర్టీసీ పురోగతికి డ్రైవర్, కండక్టర్‌లే కీలకం

నవతెలంగాణ-మధిర

సమిష్టి కృషితోనే సంస్థ అభివృద్ధి సాధ్యమవుతుందని, సంస్థ అభివృద్ధికి డ్రైవర్లు, కండక్టర్లు కీలకమని ఉమ్మడి ఖమ్మం రీజనల్ మేనేజర్ సిహెచ్ వెంకన్న తెలిపారు. ఆదివారం మధిర డిపో ఆవరణలో ఏర్పాటుచేయబడిన 3వ మరియు 4వ త్రైమాసిక ప్రగతి చక్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో రీజియన్ స్థాయిలో విధినిర్వహణలో మిగతా ఉద్యోగులకు ప్రేరణగా నిలిచి అత్యధిక ఆదాయం సంపాదించిన, ఇతర విభాగాలలో విధి నిర్వహణలో అత్యుత్తమ ఫలితాలను రాబట్టిన ఉద్యోగులను నగదు పురస్కారాలను అందించడంతో పాటు, శాలువాలతో సత్కరించి, ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ మాట్లాడారు.

బీఆర్ఎస్ అభ్యర్థి నామ గెలుపు ఖాయం

నవతెలంగాణ-జూలూరుపాడు

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు గెలుపు ఖాయమని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి లకావత్ గిరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేస్తామన్న హామీలు అటకెక్కటం ఖాయం అని, వంద రోజుల్లో అమలు చేస్తామన్న గ్యారెంటీలు ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఒక్కటి కూడా సాధ్యం కాలేకపోయిందని కాంగ్రెస్ పార్టీనీ బొంద పెట్టాడానికి ప్రజలు సిద్ధమవుతున్నారని తెలిపారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వంద రోజులలో ఆరు గ్యారెంటీ పథకాలు అమలు పరుస్తామని, చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి అన్న హామీలు అమలు పరచకపోవడంతో రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంపై విపరీతమైన వ్యతిరేకత పెరిగిందని విమర్శించారు. నామ నాగేశ్వరరావు భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ఇందుకు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు క్షేతస్థాయిలో సైనికులవలె పని చేయాలని పేర్కొన్నారు.

అసాధారణ పరిస్థితుల్లో దేశం

నవతెలంగాణ-ఇల్లందు

దేశంలో అసాధారణ పరిస్థితుల్లో లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయని, తిరిగి బిజెపి అధికారంలోకి వస్తే దేశంలో ఫాసిజం వస్తుందని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కేంద్ర నాయకులు కేజీ. రామచంద్రన్, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కొత్తగూడెం జిల్లా కార్యదర్శి రంగారెడ్డి అన్నారు. ఆదివారం ఆ పార్టీ ఇల్లందు డివిజన్ ముఖ్య కార్యకర్తల జనరల్ బాడీ సమావేశం మండలంలోని పోలవరం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రమాదకర పరిస్థితిలో కనీస బూర్జువ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకొనుటకు బిజెపిని దాన్ని అనుసరించే శక్తులను ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నేడు దేశంలో బిజెపిని ఓడించగలిగే శక్తి ఇండియా కూటమికే ఉన్నందున ప్రజలు ఇండియా కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఆ పార్టీ ఇల్లందు డివిజన్ కార్యదర్శి ఈసం శంకర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చంద్ర అరుణ ,గుమ్మడి నరసయ్య, నాయిని రాజు, రేసు సుభాష్ చంద్రబోస్, ఎస్ కే యాకూబ్ షా వలి ,వాంకుడోత్ అజయ్, ఎదలపల్లి సావిత్రి, ఆవుల కిరణ్, బుర్ర వెంకన్న, బుర్ర రాఘవులు,బొర్ర వెంకన్న, శ్రీరామ్ కోటయ్య, కొమరం శాంతయ్య ,పూణేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జూన్ 6 తర్వాత సర్దుకోవాల్సిందే



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'రేవంత్‌రెడ్డి ఇప్పుడిప్పుడే ముఖ్యమంత్రి అయ్యాడు. ఈ మధ్య నాపై కేసు ఫైల్ చేయించాడు. నేను ఆయనలా ఏడవను. కేసును హైకోర్టుకెళ్లి ఎదుర్కొంటా. రేవంత్‌రెడ్డి చెవులు నిక్కరించి విను. తెలంగాణలో అవినీతి చేస్తున్న వారంతా జూన్ ఆరో తేదీ తర్వాత సర్దుకోవాల్సిందే' అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. తెలంగాణలో రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ పేరిట ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారనీ, తెలంగాణ కాంగ్రెస్‌కు ఎన్నికల కోసం డబ్బులు సమకూర్చే ఏటీఎంగా మారిందని ఆరోపించారు. మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి టీ.ఎన్.వంశీతిలక్‌ను గెలిపించాలని కోరుతూ ఆదివారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఎన్నికల సభను నిర్వహించారు. ఈ సందర్భంగా అమిత్‌షా మాట్లాడుతూ..ఎన్డీఏ కూటమికి ప్రధాని అభ్యర్థిగా మోడీ ఉన్నారనీ, ఇండియా కూటమికి ప్రధాని అభ్యర్థి ఎవరు? అని ప్రశ్నించారు. శరద్‌పవార్, మమతాబెనర్జీ, స్టాలిన్, ఉద్ధవ్‌ఠాక్రే, రాహుల్‌గాంధీలలో ఎవరు ప్రధాని అవుతారు? అని ప్రశ్నలు సంధించారు. ఇండియా కూటమి వస్తే ఒక్కొక్కరు ఒక్కో ఏడాది ప్రధానిగా ఉంటారన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు అవినీతి పాలనను అందిస్తే మోడీ మచ్చలేని పాలన అందించారని చెప్పారు. పదేండ్ల కాలంలో మోడీ ప్రభుత్వం పేదలకు ఇండ్లు, రేషన్, తదితరాలను ఇచ్చిందని గుర్తుచేశారు. బీఆర్ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్ ఒక్కటేననీ, ముస్లిం ఓట్ల కోసం శ్రీరామనవమి ర్యాలీని కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకున్నదని ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధికి మోడీ ప్రభుత్వం ఎంతో చేసిందనీ, జాతీయరహదారులు, రీజినల్ రింగురోడ్డు, కొత్త రైల్వేలైన్లను ఇచ్చిందని గుర్తుచేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలకు రిజర్వేషన్లు తెచ్చిందనీ, ఇది రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే వాటిని రద్దు చేస్తామన్నారు. మల్కాజిగిరి నుంచి తమ పార్టీ తరపున పోటీచేస్తున్న ఈటల రాజేందర్ బలమైన బీసీ నేత అనీ, ఆయన్ను గెలిపించాలని ప్రజల్ని కోరారు. దేశంలో ఏమూలకెళ్లినా మోడీ తిరిగి ప్రధాని కావాలని కోరుకుంటున్నారన్నారు. ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ..ఇవి దేశ భవిష్యత్తును నిర్దేశించే ఎన్నికలన్నారు. వయనాడ్‌లో ఓటమి తేలిపోయింది కాబట్టే రాహుల్‌గాంధీ రాయబరేలీలో నామినేషన్ వేశారని విమర్శించారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యేది లేదు..రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేసేది లేదు అని దెప్పిపొడిచారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను తొలగిస్తుందనే కాంగ్రెస్ ప్రచారాన్ని తిప్పికొట్టారు. బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో సాధ్యంకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందనీ, మరోమారు ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి రావాలని చూస్తున్నదని విమర్శించారు. రిజర్వేషన్లు పోతాయంటూ కాంగ్రెస్ నీచమైన ప్రచారానికి పూనుకున్నదనీ, కేంద్రంలో, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఏనాడైనా రిజర్వేషన్లను తగ్గించామా? అని ప్రశ్నించారు. సభలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు బేతి సుభాష్‌రెడ్డి, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్లు, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

మధుయాష్కిగౌడ్‌కు తప్పిన ప్రమాదం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మెన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కిగౌడ్‌కు ప్రమాదం తృటిలో తప్పింది. అనుకోకుండా అడ్డువచ్చిన బైకును తప్పించే క్రమంలో ఆయన ప్రయాణిస్తున్న కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ క్రమంలో కారు టైర్లు పేలిపోయి భారీ కుదుపునకు గురైనప్పటికీ...డ్రైవర్ ముఖేష్ అప్రమత్తతో పెను ప్రమాదం తప్పింది. మాజీ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్ తల్లి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ఆదివారం ఉదయమే ఆయన వరంగల్ బయలుదేరారు. ఈ క్రమంలో ఆలేరు వద్దకు వెళ్లగానే బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తులు రోడ్డు క్రాస్ చేసే క్రమంలో అనుకోకుండా అడ్డుగా వచ్చారు. బైక్‌పై ఉన్న ఆ వ్యక్తులను కాపాడే క్రమంలో కారును డ్రైవర్ పక్కకు తిప్పగా డివైడర్‌ను ఢీ కొట్టి కారు టైర్లు పేలిపోయాయి. ఈ ఘటనలో ఆయనకు, కారులోని ఇతరులకు స్వల్ప గాయాలు మినహా ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్వల్ప గాయాలు మినహా ఎవరికి ఏమీ కాలేదని మధుయాష్కి పేర్కొన్నారు.

ఐటీ ప్రొఫెసనల్స్‌ను ఇబ్బందికి గురి చేయడం సరైందికాదు

టీపీసీసీ ఫిషర్మెన్ విభాగం చైర్మెన్ మెట్టు సాయికుమార్

ఢిల్లీ పోలీసుల ముసుగులో హైదరాబాద్‌కు వచ్చి ఐటీ ప్రొఫెసనల్‌ను ఇబ్బందులకు గురి చేయడం సరైందికాదని టీపీసీసీ ఫిషర్మెన్ విభాగం చైర్మెన్ మెట్టుసాయి కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారి సెల్ ఫోన్లు, కంప్యూటర్స్, ల్యాప్‌టాప్‌లను లాక్కొని ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. వారిపై తగు చర్యలు తీసుకోవాలనీ, ఐటీ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

అబద్ధాలతో అరవింద్ బతుకున్నారు

టీపీసీసీ మీడియా కమిటీ చైర్మెన్ సామ

నిజామాబాద్ బీజేపీ ఎంపీ అర్వింద్ అబద్ధాలతో బతుకున్నారని టీపీసీసీ మీడియా కమిటీ చైర్మెన్ సామ రామ్మోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఓటమి భయంతో బీజేపీ దేశ వ్యాప్తంగా అబద్ధపు ప్రచారాలు చేస్తున్నదని విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు.మొన్న సీఎం రేవంత్ కాన్వాయ్ కింద పడి ఓ యువకుడు చనిపోయారని ప్రచారం చేశారనీ, నిజామాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిపై ఫేక్ వీడియోలతో దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.లేని ప్రచారాలు చేస్తే ఆయన్ను చెప్పులతో కొట్టించుకునే పరిస్థితి వస్తోందని హెచ్చరించారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు జీవి వినోద్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా వారియర్స్‌ను బెదిరించడం సరైందికాదన్నారు. చట్టబద్ధంగా విచారణ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తలుచుకుంటే ఢిల్లీ పోలీసులు హైదరాబాద్ రాకుండా ఆపగలదని హెచ్చరించారు. కాంగ్రెస్ లీగల్ సెల్ ఇన్‌చార్జి రామచంద్రరెడ్డి మాట్లాడుతూ బీజేపీ అనాలోచితంగా ముందుకు పోతుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ పోలీసుల ద్వారా అనైతిక చర్యలకు పాల్పడుతోందన్నారు. లేడీ పోలీసు లేకుండా సోషల్ మీడియాకు చెందిన మహిళ వద్ద నుంచి ఫోన్ స్వాధీనం చేసుకోవడం అనైతిక చర్య అన్నారు.

రేపే పోలింగ్

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. అలాగే ఈ దశలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీ, సమాజవాదీ పార్టీ, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీల నుంచి అభ్యర్థుల మధ్య ప్రధానంగా పోరు జరగనుంది. మరోవైపు ఇప్పటికే ఏప్రిల్ 19న తొలి దశ పోలింగ్, ఇక ఏప్రిల్ 29న రెండో దశ పోలింగ్ పూర్తి అయింది. ఓట్ల లెక్కింపు జూన్ 4న ఉంటుంది.

బాల బంధువు తెలంగాణ బాలోత్సవం

- కేంద్ర బాల సాహితీ వేత్త చొక్కాపు వెంకటరమణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బాలబంధువు తెలంగాణ బాలోత్సవం అని కేంద్ర బాలసాహితీ వేత్త చొక్కాపు వెంకటరమణ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో బాలోత్సవం సమ్మర్ క్యాంపు ప్రారంభమైంది. 200మంది విద్యార్థులతో విజ్ఞాన శిబిరం ప్రారంభమైంది ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ హైదరాబాద్‌లో సమ్మర్ క్యాంపు అంటే రూ.10వేల నుంచి రూ.20వేల వరకు చెల్లించాల్సిందేన్నారు. కానీ.." తెలంగాణ బాలోత్సవం" ఉచిత సమ్మర్ క్యాంపు నేటి నుంచి ఈ నెల 22 వరకు నిర్వహించటం హర్షణీయమన్నారు.

మతోన్మాదులను ఓడించండి

- సీపీఐ(ఎం)ది త్యాగాల చరిత్ర :సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు



నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం

బీజేపీ మతోన్మాదులను పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు పిలుపునిచ్చారు. ఆదివారం యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలోని అమరవీరుల స్మారక భవనంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు తుమ్మల నర్సిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీని ఓడించడం వల్లనే దేశ ప్రజలు ఐక్యంగా ఉంటారన్నారు. మోడీ మళ్ళీ గెలిస్తే ప్రజాస్వామిక హక్కులు లేకుండా పోతాయని తెలిపారు. రాజ్యాంగం మార్చుతామని చెబుతున్న బీజేపీని ఓడించడం ప్రజల, లౌకికవాదుల బాధ్యత అని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం మే13న జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. డబ్బులు పంచి గెలిచే నాయకులు ప్రజల పక్షాన నిలబడరని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రజల తరపున పోరాడిన చరిత్ర ఉందా అని ప్రశ్నించారు. భువనగిరి నియోజకవర్గంలో ఉన్న అనేక సమస్యలపై పోరాడిన చరిత్ర సీపీఐ(ఎం) అభ్యర్థికి ఉందన్నారు.

ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయలేని పార్టీల అభ్యర్థులను ఓడించాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు. మతం, కులం పేరుతో ఓట్లు దండుకోవడానికి వస్తున్న వారికి తగిన బుద్ధి చెప్పాలని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు తమ ఆస్తులను కాపాడుకునేందుకు పోటీ చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు టి.స్కైలాబ్‌బాబు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దోనూరు నర్సిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు గుంటోజు శ్రీనివాసాచారి, మండల కార్యదర్శి దోడయాదిరెడ్డి, సీనియర్ నాయకులు సురుకంటి శ్రీనివాస్‌రెడ్డి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీతాలు ఎందుకివ్వలేదు?

- ఆర్టీసీ కార్మికులకు సమాధానం చెప్పండి :టీఎస్‌ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ కార్మికులకు ఏప్రిల్ నెల జీతాలు మే 5వ తేదీ దాటినా ఇంకా ఎందుకు చెల్లించలేదని టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర కమిటీ యాజమాన్యాన్ని ప్రశ్నించింది. జాప్యానికి గల కారణాలను కార్మికులకు తెలపాలని డిమాండ్ చేసింది. ప్రతినెలా 1వ తేదీనే జీతాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరింది. ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం అధ్యక్షులు వీరాంజనేయులు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే వెంకటేష్ జాతీయ రాజకీయాలపై మాట్లాడారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవేశపెట్టిన నివేదిక, ఆర్టీసీ కార్మికులకు ప్రతినెలా 1వతేదీనే జీతాలు చెల్లించాలనే తీర్మానాన్ని రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించింది. ప్రస్తుత వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున డ్రైవర్, కండక్టర్లకు హీట్ ప్రొటెక్షన్ కోసం ప్రతి డ్యూటీ రోజు రూ.100 ఇవ్వాలని సమావేశం తీర్మానించింది. ప్రస్తుతం యూనియన్ బ్యాంకులో అకౌంట్ ఉన్న వారికి కోటి రూపాయలు, రూపే కార్డు ఉన్న వారికి మరో 15 లక్షలు, మొత్తం కోటి 15 లక్షలు ప్రమాదంలో మరణించిన వారికి ఇస్తున్నారని తెలిపారు. అలాగే సహజ మరణానికి కూడా రూ.15 లక్షలు తగ్గకుండా ఇన్సూరెన్స్ స్కీంను ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి లేఖ రాయాలని సమావేశంలో తీర్మానం చేశారు. హయ్యర్ పెన్షన్ కోసం గతంలో రికవరీ చేసి, 2014 నాడు రిజెక్ట్ చేయబడిన 7,373 మందికి న్యాయం జరిగేలా చూడాలనీ, వారి వద్ద నుంచి ఈపీఎఫ్‌ఓ రికవరీ చేసిన డబ్బులను వడ్డీతో సహా చెల్లించాలని సమావేశం తీర్మానించింది.

సమావేశంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పీ రవీందర్‌రెడ్డితో పాటు రాష్ట్ర ఆఫీస్ బేరర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీకి వ్యతిరేక గాలి

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. 2018లో రాష్ట్రానికి ప్రత్యేక హెూదా కోసమే తాను బయటకొస్తున్నానని చెప్పి , ఏపీకి హెూదా ఇవ్వని బీజేపీతో 2024 ఎన్నికల్లో కూటమి ఎలా కడతారని చంద్రబాబును ప్రశ్నించారు. దేశంలోని ఇండియా వేదికలో అనేక ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు, గిరిజన సంఘాలు, లెఫ్ట్ పార్టీలు సహా ప్రత్యామ్నాయంగా ఏర్పడి 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌కు రాష్ట్ర హెూదా, పోలవరం, రైల్వే జోన్ కోసం ఎన్నికల బరిలో దిగామన్నారు. 2018లో దేశ ప్రధాని మోడీ విశాఖపట్నం వచ్చి ఎన్నో హామీలు కురిపించి వెళ్లారని అందులో రైల్వేజోన్‌కు నేటికీ అతీగతి లేదన్నారు. ప్రత్యేక హెూదా ఎలాగూ కాగితాలకే పరిమితం అయిపోయిందన్నారు. పోలవరం ప్రాజెక్టును కేంద్రమే పూర్తి చేయాల్సి ఉన్నా మోడీ ప్రభుత్వం ఇన్నాళ్లూ ఏం చేసిందని ప్రశ్నించారు. పోలవరం ముంపు ప్రాంతాల్లో తాను పర్యటిస్తానని, గిరిజనులు, నిర్వాసితుల కోసం ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించాలని ఆమె డిమాండ్ చేశారు.

బాక్సైట్ దోపిడీకే బీజేపీ అభ్యర్థి పోటీ

రాజ్యాంగం ద్వారా గిరిజనులకు దక్కిన హక్కులకు విశాఖపట్నం ఏజెన్సీలో రక్షణ లేదన్నారు. అనకాపల్లి ఎన్డీఏ కూటమి (బీజేపీ) అభ్యర్థి సిఎం రమేష్‌పై ఇల్లీగల్ మైనింగ్ కేసులున్నాయని ఇలాంటి వారిని గెలిపించాలని ప్రధాని నరేంద్రమోడీ విశాఖ కశింకోటలో ప్రచారానికి రావడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. బాక్సైట్ భూముల్లో మైనింగ్ చేసేందుకే సిఎం రమేష్ అనకాపల్లి ఎంపిగా బరిలోకి దిగారని వ్యాఖ్యానించారు.

స్టీల్‌ప్లాంట్‌పై మోడీ కుట్రలు

పోర్టులు కేంద్ర ప్రభుత్వ అధీనంలోకి వచ్చే దేశ సంపద కాగా విశాఖలోని గంగవరం పోర్టును అదానీకి కట్టబెట్టారని ప్రధానితో అదానీ స్నేహంతో దీన్ని కబ్జా చేశారని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కుట్రను గంగవరం పోర్టు అమలు చేస్తుందన్నారు. తక్షణమే కోర్టు చెప్పిన ప్రకారం కార్మికులతో యాజమాన్యం చర్చలు జరిపి సమస్యను పరిష్కరించి స్టీల్‌ప్లాంట్‌కు కోకింగ్ కోల్‌ను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు సిహెచ్ నరసింగరావు పాల్గొన్నారు.

కవిత బెయిల్ పై నేడు తీర్పు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ పై సోమవారం రౌస్ ఎవెన్యూ కోర్టు తీర్పును వెలువరించనుంది. లిక్కర్ కేసులో సీబీఐ, ఈడీ దర్యాప్తు సంస్థలు తనను అక్రమంగా అరెస్టు చేశాయని, తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కవిత వేర్వేరుగా బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ఇటీవల వాదనలు ముగించిన ట్రయల్ కోర్టు తీర్పును నేటికి వాయిదా వేసింది. నేడు ఉదయం 10 గంటలకు స్పెషల్ జడ్జి కావేరి బవేజా ఈడీ, సీబీఐ కేసుల్లో కవిత బెయిల్ పిటిషన్లపై తీర్పును చదివి వినిపించనున్నారు.

ప్రస్తుతం జైల్లో ఉన్న తనకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయాలని కవిత రౌస్ ఎవెన్యూ కోర్టును ఆశ్రయించారు. ఏడేండ్లలోపు శిక్ష పడే కేసులకు అరెస్టు అవసరం లేదని కవిత తరపున న్యాయవాది విక్రమ్ చౌదరి వాదనలు వినిపించారు. అలాగే పిఎంఎల్ఏ సెక్షన్ 45 ప్రకారం కవిత మహిళ కాబట్టి బెయిల్ కు అర్హురాలని కోర్టుకు నివేదించారు.

రేపు కోర్టు ముందుకు కవిత...!

మరోవైపు కవితకు కోర్టు విధించిన జ్యుడీషియల్ కస్టడీ 7తో ముగియనుంది. దీంతో గత ఆదేశాల మేరకు ఆమెను మంగళవారం ఉదయం కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. అయితే నేడు వెలువరించే తీర్పులో కవితకు బెయిల్ దక్కితే, జ్యుడీషియల్ కస్టడీ పొడగింపు ఉండదు. అలా కాదని కోర్టు ఆమెకు బెయిల్ నిరాకరిస్తే... మంగళవారం ఆమెను కోర్టు ముందు హాజరుపరచక తప్పదు. అయితే... ఈ సారి తనను నేరుగా కోర్టు ముందు హాజరుపరచాలని గతవారం కవిత ట్రయల్ కోర్టులో అప్లికేషన్ దాఖలు చేశారు. గతంలో మాదిరిగా వర్చువల్ మోడ్ లో కాకుండా, నేరుగా హాజరయ్యేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ అప్లికేషన్ ను బెయిల్ తీర్పు సందర్భంగా ఆమె న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిసింది. అలాగే, ఒకవేళ ట్రయల్ కోర్టు బెయిల్ నిరాకరిస్తే... ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాలని ఆమె తరపు న్యాయవాదులు యోచిస్తున్నారు.



ప్రజాశ్రేయస్సు కోసం పరితపించే..

జహంగీర్‌ను గెలిపించండి

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మల్లు లక్ష్మి

నవతెలంగాణ-తుంగతుర్తి

ఉద్యమాలే ఊపిరిగా, ప్రజాశ్రేయస్సే తన ధ్యేయంగా, నిరంతరం ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్న సీపీఐ(ఎం) భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి ఎండీ జహంగీర్ గెలుపు కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం అన్నారం గ్రామంలో ఆ పార్టీ అభ్యర్థి ఎండీ జహంగీర్ గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. తుంగతుర్తి గడ్డ కమ్యూనిస్టుల అడ్డా అని, ఈ ప్రాంతంలో భీమ్‌రెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే కమ్యూనిస్టులకే ఓటు అడిగే నైతికహక్కు ఉందన్నారు. వీర తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల ఆశయ సాధన కోసం సీపీఐ(ఎం) పనిచేస్తుందన్నారు. బూర్జువా పార్టీలు మతం, కులం, ప్రాంతం అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. ఉపాధి పరిశ్రమలు, మౌలిక రంగాల్లో అత్యంత వెనుకబడ్డ పార్లమెంట్ నియోజకవర్గం భువనగిరి అని అన్నారు. బీబీనగర్ మండలంలోని ఎయిమ్స్ వైద్యశాలలో 48 విభాగాలు ఉండగా 24 విభాగాలు మాత్రమే పనిచేస్తున్నాయని, ఇది బీజేపీ చేతగానితనం కాదా అని ప్రశ్నించారు. గిరిజనసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మానాయక్ మాట్లాడుతూ.. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్ సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) జిల్లాకార్యదర్శి వర్గసభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు మాట్లాడుతూ.. సీపీఐ(ఎం)ను గెలిపిస్తే ప్రజల హక్కులతో పాటు వారి సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాస్, సీనియర్ నాయకులు తాటి విజయమ్మ రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి పల్లా సుదర్శన్, నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రూ.58లక్షల నగదు పట్టివేత

- ఆదిభట్లలో పోలీసుల తనిఖీలు



నవతెలంగాణ-ఆదిభట్ల

రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపల్ పరిధిలో పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా అనుమతి లేకుండా తరలిస్తున్న రూ.58లక్షల నగదు పట్టుకున్నారు. ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదిభట్ల మున్సిపల్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డు శ్రీశ్రీ ఏరో సీటి సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ములుగు జిల్లా కన్నాయి గూడెం మండలం సింగారం గ్రామానికి చెందిన పల్లా శ్రీకాంత్ వాహనంలో డబ్బులు తరలిస్తున్నాడు. ఆ వాహనాన్ని తనిఖీ చేయగా రూ.58లక్షల 46వేలు పట్టుబడ్డాయి. వాటికి సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో డబ్బును సీజ్ చేశారు. డబ్బులు వండర్‌లా నుంచి బొంగులూరు మీదుగా తరలిస్తున్నట్టు గుర్తించారు. డీటీఓ వద్ద డబ్బు డిపాజిట్ చేశారు. పూర్తి విచారణ కోసం జిల్లా గ్రీవెన్స్ సెల్, ఐటీ విభాగానికి సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఆదిభట్ల ఎస్ఐ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

చర్చలకు నెతన్యాహునే అడ్డంకి

- హమాస్ విమర్శ
- అల్‌జజీరా కార్యాలయాల మూసివేత

జెరూసలెం/గాజా : కాల్పుల విరమణపై ఒప్పందం కోసం జరుగుతున్న యత్నాలను నెతన్యాహు ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుంటున్నారని హమాస్ విమర్శించింది. గాజాలో ఇజ్రాయిల్ ఆక్రమణకు స్వస్తి పలికేలా సమగ్ర కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవాలని హమాస్ నిజాయితీగా కృషి చేస్తోందని, హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనీయే చెప్పారు. కైరోలో ఇరు పక్షాల మధ్య చర్చలు పునరుద్ధరించాల్సి వుంది, అందుకోసం ప్రతినిధి బృందాన్ని పంపించాల్సి వుంది. రఫా నగరంపై మిలటరీ దాడిని ఇజ్రాయిల్ ప్రారంభించదని అమెరికా గ్యారంటీ ఇవ్వాలని హమాస్ కోరుతోంది. ఒప్పందం కుదురుతుందా లేదా అన్నదానితో సంబంధం లేకుండా దాడి జరిగి తీరుతుందని నెతన్యాహు చెబుతున్నారు. కాల్పుల విరమణకు నెతన్యాహు అంగీకరించాలని, ఒప్పందంలో భాగంగా గాజాలోని బందీలను విడిపించాలని ఇజ్రాయిల్‌లో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనకారులు కోరుతున్నారు. బందీలను విడుదల చేయాలంటే గాజాలో యుద్ధానికి ఇక స్వస్తి పలకాలని హమాస్ చేస్తున్న డిమాండ్‌ను నెతన్యాహు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

అల్‌జజీరా కార్యాలయాల మూసివేతకు ఆదేశం

ఇదిలావుండగా, ఇజ్రాయిల్‌లో అల్ జజీరా కార్యాలయాలన్నింటినీ మూసివేయాలని నెతన్యాహు ప్రభుత్వం ఆదేశించింది.

జార్ఖండ్ రాజకీయాలపై కల్పన సోరెన్ ముద్ర

- తన భర్త, మాజీ సీఎం హేమంత్ అరెస్ట్‌తో అనూహ్యంగా పొలిటికల్ ఎంట్రీ
- గాండే అసెంబ్లీ ఉప ఎన్నికల్లో పోటీ
- అక్రమ కేసులపై బీజేపీ, మోడీకి పదునైన విమర్శనాస్త్రాలు

జె.జగదీష్



జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ భార్య కల్పన సోరెన్ (48) లోక్‌సభ ఎన్నికల వేళ అనూహ్యంగా రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఉన్నత విద్యావంతురాలైన కల్పన, బీజేపీకి, ప్రధాని మోడీకి సంధిస్తున్న ప్రశ్నలు, హెచ్చరికలు జార్ఖండ్‌నే కాదు యావత్ జాతినే ఆలోచింపజేస్తున్నాయి. కచ్చితంగా జార్ఖండ్ రాజకీయాల్లో కల్పన మార్క్ కనిపిస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తన భర్త హేమంత్ సోరెన్‌ను అక్రమంగా జైలుకు పంపిన తరువాత కల్పన ప్రత్యక్ష రాజకీయాల్లోకొచ్చారు. తన భర్త ఆశయాలను, లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లేందుకే రాజకీయాల్లోకొచ్చానంటున్నారు. గాండే అసెంబ్లీ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు జేఎంఎం అభ్యర్థిగా కల్పన సోరెన్ నామినేషన్ దాఖలు చేశారు. రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికలతో పాటు ఈ స్థానానికి కూడా మే 20న పోలింగ్ జరగనుంది. జెఎంఎం ఎమ్మెల్యే సర్ఫరాజ్ అహ్మద్ రాజీనామా చేయడంతో గిరిది జిల్లాలోని గాండే స్థానం ఖాళీ అయింది. ఎంటెక్, ఎంబీఏ వంటి ఉన్నత విద్యను పూర్తి చేసిన కల్పన మొన్నటి వరకు గృహిణిగా ఉన్నారు. ఒడిషాలోని మయూర్‌భంజ్ జిల్లాలో బరిపడలో పాఠశాల విద్యను పూర్తి చేసి, భువనేశ్వర్‌లో ఇంజనీరింగ్, ఎంబిఎ డిగ్రీలను పొందారు.

హేమంత్ లేని లోటు పూడ్చేందుకే..

'నా భర్త అరెస్ట్ ఊహించని విధంగా జరిగింది. ఈ ఘటనతో జేఎంఎం పార్టీ, కుటుంబ సభ్యులు షాక్ కు గురయ్యారు. హేమంత్ అరెస్టు తరువాత పార్టీ కార్యకర్తలు ముందుకు రావాలని కోరారు. వాళ్ల నాయకుడిపై ఉన్న ప్రేమ చూసి, హేమంత్ జీ తిరిగి వచ్చే వరకు ఈ లోటును పూడ్చడం నా నైతిక బాధ్యత అని అనుకున్నాను. అందుకే నేను రాజకీయాల్లోకి ప్రవేశించాను. వంగి నమస్కరించడం గిరిజనుల డీఎన్ఏలో లేదు. హేమంత్ సోరెన్ మరింత బలపడతారు. హేమంత్ సోరెన్ అమాయకుడు, నిర్దోషి. బీజేపీ ప్రభుత్వం ముందస్తుగా ప్లాన్ చేసిన కుట్రలో బాధితుడయ్యారు. బీజేపీపై జార్ఖండ్ ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. రాష్ట్రంలోని అపార ఖనిజ సంపదను దోచుకుంటున్న ఈ నిరంకుశ, కార్పొరేట్ శక్తులను వారు నిర్మూలిస్తారు" అని కల్పన అన్నారు.

ఎన్డీఏలో చేరనందుకే అరెస్ట్

"న్యాయ వ్యవస్థపై మాకు పూర్తి విశ్వాసం ఉంది. ఆయన బెయిల్‌పై బయటకు వచ్చి లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం ఎదురుచూస్తున్నాం.

పేదలు, గిరిజనులు, దళితుల కోసం పనిచేసే ప్రతిపక్ష నేతలను అరెస్టు చేస్తే రాజ్యాంగం ఎలా పరిరక్షించబడుతుంది. బీజేపీ అబద్ధాలు మాత్రమే చెబుతుంది. నా భర్త 90 రోజులకు పైగా జైలులో ఉన్నారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో మాత్రమే ఈడీ ఎందుకు చర్యలు తీసుకుంటుందో నాకు ఒక ప్రశ్న ఉంది" అని కల్పన అన్నారు. 'నేను అన్యాయానికి, నియంతత్వ శక్తులకు వ్యతిరేకిని. నేను నా భర్త అడుగుజాడల్లో నడుస్తాను. ఆయన తన విలువలతో రాజీ పడలేదు. బదులుగా జైలు మార్గాన్ని ఎంచుకున్నారు. నా భర్త అరెస్టు రాజకీయ ప్రేరేపితం. మమ్మల్ని బిజెపి కూటమిలో చేరమని బలవంతం చేశారు. అందుకు నిరాకరించడంతో ఆయనను కేంద్ర ప్రభుత్వం అరెస్టు చేసింది" అని కల్పన సోరెన్ విమర్శించారు.

ఆది నుంచీ

కమలం కుట్రలు

2019లో హేమంత్ సోరెన్ నేతృత్వంలో జార్ఖండ్‌లో సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీజేపీ కుట్ర పన్నింది. అందులో భాగంగానే ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ను అరెస్టు చేసి జైలుకు పంపారు. దీంతో మార్చి 4న జరిగిన జెఎంఎం 51వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో కల్పన రాజకీయ ప్రయాణం ప్రారంభమైంది. తన భర్త జైలుకు వెళ్లిన తరువాత పార్టీకి కొత్త ముఖంగా అవతరించిన కల్పన.. బీజేపీని నిరంకుశ శక్తిగా అభివర్ణిస్తూ.. ప్రతిపక్షాలను అణిచివేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలు ఎప్పుడూ తను ఎంచుకోలేదని, పరిస్థితులు తనను వాటిల్లోకి నెట్టాయని అన్నారు.



సరిహద్దులు దాటింది

అన్నపూర్ణి రాజ్‌కుమార్... అడ్డంకులు బద్దలుకొట్టింది. 40 ఏండ్ల వయసులో బంగ్లాదేశ్‌లోకి సరిహద్దు దాటిన మొదటి మహిళా ట్రక్కర్‌గా చరిత్రలో తన పేరును లిఖించుకుంది. పురుషులకు మాత్రమే పరిమితమైన డొమైన్‌లో తనకంటూ ఓ స్థానాన్ని దక్కించుకుంది. లింగ మూస పద్ధతులను పగులగొట్టింది. ఆమె బద్దలు కొట్టిన ఈ అడ్డంకులతో పురుషాధిక్య రంగాలలో మహిళల ప్రవేశాన్ని మరింతగా ప్రేరేపిస్తోంది.

అన్నపూర్ణి తమిళనాడు నుండి 10 రోజుల పాటు ప్రయాణం చేసి సుమారు వెయ్యి కిలోమీటర్లు దాటుకుని పెట్రాపోల్ సరిహద్దు చెక్‌పోస్ట్‌కు చేరుకుంది. 'విశాఖపట్నం సెజ్ నుండి కాటన్ నూలుతో కూడిన ట్రక్కును నడుపుకుంటూ గత శనివారం రాత్రి పెట్రాపోల్‌కు చేరుకుంది" అని పెట్రాపోల్‌లోని ల్యాండ్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (LPAI) మేనేజర్ కమలేష్ సైనీ అన్నారు.

అడ్డంకులను అధిగమించడం

అన్నపూర్ణి తన ప్రయాణ సమయంలో అనేక రవాణా సవాళ్లను ఎదుర్కోవలసి వచ్చింది. జాతీయ రహదారుల వెంబడి మహిళల కోసం రెస్ట్‌రూమ్ సౌకర్యాలు లేకపోవడం ఆమె ఎదుర్కొన్న ఇబ్బందుల్లో ముఖ్యమైనది. 'ఈ అడ్డంకులు ఉన్నప్పటికీ ఆమె తన ట్రక్కును పార్క్ చేసిన హోటళ్లలోనే వసతిని ఏర్పాటు చేసుకుంది' అని సైనీ జోడించారు. అయితే ఈ ప్రయాణంలో వసతికి సంబంధించి ఆమెకు ఎంపికలు చాలా తక్కువే అని చెప్పాలి. ఎందుకంటే ఆమె రోడ్‌సైడ్ ధాబాలలో బస చేయకూడదని నిర్ణయించుకుంది. పురుషుల ఆధిపత్య కారణంతో ఆమె సాధారణంగా డ్రైవర్‌లు విశ్రాంతి తీసుకునే ప్రదేశాలకు దూరంగా ఉంది.

బంగ్లాదేశ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ సరిహద్దు వేగంగా దాటడానికి అవసరమైన క్లియరెన్స్ తీసుకోగలిగింది. 'ఆమె చేసిన ప్రయాణం మహిళల కోసం రూపొందించిన LPAI మార్గదర్శకాలకు కట్టుబడి ఉంది. మేము బంగ్లాదేశ్ అధికారులతో కలిసి ఆమె ట్రక్ నుండి కాటన్‌ను వెంటనే దించాము. మధ్యాహ్నం 12:30 గంటలకు పెట్రాపోల్‌కు వేగంగా వెళ్లేందుకు వీలు కల్పించాము. సాధారణంగా ట్రక్కులు సరిహద్దులో చాలా సమయం వేచివుండాల్సి వుంటుంది. కానీ ఆమెకు ఆ నిరీక్షణ లేకుండా చేశాము' అని సైనీ వివరించారు. తమిళం మాత్రమే మాట్లాడగలిగే ఆమె హిందీలో కొంత మాట్లాడగలదు. తన సంభాషణ కోసం ఆమె తోటి డ్రైవర్ల సహకారం తీసుకుంది.

లింగ సముపార్జన

బంగ్లాదేశ్ నుండి ఆమె తిరిగి వచ్చిన తర్వాత ఆమెకు ప్రత్యేక సౌకర్యాలతో కూడిన మహిళా వసతి గృహంలో వసతి కల్పించారు. ఇది లింగ పక్షపాతాలను తొలగించడానికి, కస్టమ్స్ క్లియరింగ్, ఫార్వార్డింగ్ ఏజెంట్‌ల వంటి పాత్రలలో స్త్రీ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి ప్రారంభ ప్రయత్నాన్ని ప్రతిబింబిస్తుంది. పెట్రాపోల్ సి అండ్ ఎఫ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కార్తిక్ చక్రవర్తి, ఢిల్లీ నుండి పెట్రాపోల్‌కు ఇటీవలి పర్యటన సందర్భంగా హోం వ్యవహారాల సీనియర్ మంత్రిత్వ శాఖ అధికారులలో అసంతృప్తిని వెల్లడి చేశారు. ఈ రంగాలలో వేళ్లూనుకున్న పురుషాధిక్యతను పరిశీలించారు.



అన్నపూర్ణి సాధించిన ఈ విజయం దీర్ఘకాలంగా ఉన్న లింగ మూస పద్ధతులను సవాలు చేస్తూ, సాంప్రదాయకంగా పురుషాధిపత్య రంగాలలో వృత్తిని కొనసాగించేందుకు మరింత మంది మహిళలకు మార్గం సుగమం చేసింది. కష్టాలను ఎదుర్కునే ఆమె సంకల్పం, పట్టుదల ఇతర మహిళలు అద్దాల పైకప్పులను ఛేదించడానికి అడ్డంకులు లేకుండా వారి కలలను స్వీకరించడానికి ప్రేరేపించాయి.

ఆమె చేసిన ఈ ప్రయాణం ఫలితంగా సాంప్రదాయకంగా పురుషాధిపత్య రంగాలలో మౌలిక సదుపాయాల మెరుగుదలకు, మహిళల భద్రత అంశాలపై దృష్టి సారించేందుకు చర్చను లేవదీసింది. మహిళా డ్రైవర్లకు సరైన సౌకర్యాలు కల్పిస్తే ఈ రంగంలో మరింత మంది మహిళలు వచ్చేందుకు ఆసక్తి చూపుతారని ఆమె ఈ సందర్భంగా పంచుకుంటుంది.

LPAI సభ్యురాలు రేఖా రాయ్కర్ కుమార్, మహిళా కార్మికులకు అనుకూలమైన వాతావరణాన్ని



పెంపొందించాలని కోరుతూ మార్చి 19న పెట్రాపోల్‌లో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. 'లింగ వైవిధ్యాన్ని ప్రోత్సహించడానికి మేము కట్టుబడి ఉన్నాం. అలాగే సరిహద్దు సంబంధిత వృత్తులలో భాగస్వాములు అయ్యేలా మహిళలను ప్రోత్సహించాలనుకుంటున్నాం. అయితే ముఖ్యంగా చీకటి పడిన తర్వాత మహిళలకు కొన్ని సమస్యలు, ఆందోళనలు మొదలవుతాయి. హోటల్ సిబ్బందిలో అందరూ మగవారు ఉండటమే దీనికి ప్రధాన కారణం' అని రేఖా అంటున్నారు. మరింత సమగ్రమైన కార్యాలయ వాతావరణాన్ని పెంపొందించడానికి జరుగుతున్న ప్రయత్నాల గురించి ఆమె నొక్కిచెప్పారు.

అన్నపూర్ణి సాధించిన ఈ విజయం దీర్ఘకాలంగా ఉన్న లింగ మూస పద్ధతులను సవాలు చేస్తూ, సాంప్రదాయకంగా పురుషాధిపత్య రంగాలలో వృత్తిని కొనసాగించేందుకు మరింత మంది మహిళలకు మార్గం సుగమం చేసింది. కష్టాలను ఎదుర్కునే ఆమె సంకల్పం, పట్టుదల ఇతర మహిళలు అద్దాల పైకప్పులను ఛేదించడానికి అడ్డంకులు లేకుండా వారి కలలను స్వీకరించడానికి ప్రేరేపించాయి.

రక్తపోటును తగ్గించే సూపర్ ఫుడ్స్..!



ఇటీవల కాలంలో అధిక రక్తపోటు లేదా హైపర్‌టెన్షన్ సమస్య చాలా మందిలో బయటపడుతోంది. ఇది శరీరంలోని ధమనులను ప్రభావితం చేస్తుంది. రక్త నాళాల ద్వారా రక్తం ప్రవహించే శక్తి నిరంతరం ఎక్కువగా ఉన్నప్పుడు ఇది సంభవిస్తుంది. మరో రకంగా చెప్పాలంటే, రక్త నాళాల్లో ప్రవహించే రక్తం ధమనుల గోడలపై అధిక పీడనాన్ని కలుగజేస్తే దాన్ని హై బ్లడ్ ప్రెజర్ అంటాం. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ప్రకారం దీనికి చికిత్స చేయకుండా వదిలేస్తే, రక్త ప్రసరణ వ్యవస్థకు తీవ్ర నష్టం కలుగుతుంది. దీని ఫలితంగా గుండెపోటు, పక్షవాతం, ఇతర సమస్యలకు దారితీస్తుంది. రక్తపోటును కంట్రోల్‌లో ఉంచడానికి ఆరోగ్యకరమైన ఆహారం తినడం చాలా ముఖ్యం. తినే ఆహారం రక్తపోటు నియంత్రణలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. మరి రక్తపోటు తగ్గించుకోవడానికి తినాల్సిన కొన్ని ఉత్తమ ఆహారాలు ఏవో చూద్దాం.

అరటి పండ్లు : అరటిపండ్లలో గుండె ఆరోగ్యాన్ని పెంచే, ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించే అనేక ముఖ్యమైన పోషకాలుంటాయి. రక్తపోటును తగ్గించే న్యూట్రియంట్స్ ఉంటాయి. ఈ పండ్లలో ఉండే పొటాషియం రక్తపోటు పెరగడానికి కారణమయ్యే సోడియం మోతాన్ని తగ్గిస్తుంది.

బీట్‌రూట్ : రోజూ బీట్‌రూట్ తినడం లేదా బీట్‌రూట్ జ్యూస్ తాగడం వల్ల రక్తపోటు తగ్గుతుంది. ఇందులో ఫైబర్, ఫోలేట్, ఐరన్, పొటాషియం, విటమిన్ సి వంటి అవసరమైన పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి. .

పెరుగు : రక్తపోటు స్థాయిలను తగ్గించడానికి ప్రతిరోజూ పెరుగు తినటం మంచిది. పెరుగులో రక్తపోటు స్థాయిలను నియంత్రించే విటమిన్లు, ఖనిజాలు, మెగ్నీషియం ఉంటాయి.

బెర్రీలు : ఈ పండ్లలో విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఫైబర్, ముఖ్యంగా నీటిలో కరిగే ఫైబర్, ఆరోగ్యానికి మేలు చేసే ఇతర పోషకాలు కూడా మెండుగా లభిస్తాయి. బెర్రీల్లో యాంటీఆక్సిడెంట్ కాంపౌండ్ అయిన ఆంథోసైనిన్స్ ఉంటుంది, ఇది రక్తపోటు తగ్గించడానికి చాలా అవసరం.

పుచ్చకాయ : వేసవిలో దొరికే పుచ్చకాయల్లో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. పొటాషియం కూడా అధికంగా దొరుకుతుంది. పొటాషియం వంటి ఎలక్ట్రోలైట్లతో హెల్తీగా రక్తపోటును తగ్గించుకోవచ్చు. పుచ్చకాయలో సిట్రులిన్ వంటి అమైనో యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి, ఇవి రక్త నాళాలను వదులు చేసి ధమనులలో ఫ్లెక్సిబిలిటీని పెంచుతాయి, తద్వారా రక్తపోటు తగ్గుతుంది.

ఓట్స్ : పాపులర్ బ్రేక్‌ఫాస్ట్ ఫుడ్ ఓట్స్. ఇందులో ఆరోగ్య ప్రయోజనాలు చాలా ఎక్కువ. హెల్తీ ఫ్యాట్స్ సమృద్ధిగా ఉంటాయి. ఓట్స్‌లోని ఫైబర్ రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి.

ఇండియా బ్లాక్ పావులుగా ముస్లింలు

(మొదటిపేజీ తరువాయి)

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు చెందిన వారు అందరూ బీజేపీవైపే వస్తున్నారన్నారు. ప్రధాని గృహనిర్మాణ పథకం కింద అవసరంలో వున్నవారందరికీ ఇండ్లు కేటాయించడాన్ని ముస్లిం సోదరులు, సోదరీమణులు చూస్తున్నారు. నీటి కనెక్షన్ కానివ్వండి, గ్యాస్ సిలిండర్ కానివ్వండి ప్రతి ప్రభుత్వ ప్రయోజనం అందరికీ ఇస్తున్నామన్నారు. ఎలాంటి వివక్ష లేకుండా ముస్లింలందరూ అన్ని పథకాల ప్రయోజనాలు పొందుతున్నారన్నారు. నిజం తెలుసుకున్నారు కనుకనే ఈ ఓటుబ్యాంక్ రాజకీయాల కాంట్రాక్టర్లకు ముస్లింలు దూరంగా వుంటున్నారని మోడీ అన్నారు. మతం ప్రాతిపదికన రిజర్వేషన్లు వుండొద్దని అంబేద్కర్, జవహర్‌లాల్ నెహ్రూలు చాలా స్పష్టంగా చెప్పారని, కానీ మతం ప్రాతిపదికనే రిజర్వేషన్లు ఇచ్చేందుకు కాంగ్రెస్, ఇండియా బ్లాక్‌లు గట్టి పట్టుతో వున్నాయని మోడీ విమర్శించారు.

ఏపీ డీజీపీపై బదిలీ వేటు

(మొదటిపేజీ తరువాయి)

విమర్శలు మూటగట్టుకున్నారు. ప్రతిపక్షాలపై ఎన్ని దాష్టీకాలు జరుగుతున్నా ఆయన ఏ రోజూ పట్టించుకోలేదు. ప్రతిపక్ష నాయకులు, ప్రభుత్వ విధానాల్ని ప్రశ్నించేవారిని ఉక్కుపాదంతో అణచివేసేందుకు ప్రయత్నించారు. తప్పుడు కేసులు పెట్టి, అక్రమంగా అరెస్టులు చేయించారు. ప్రభుత్వ వైఫల్యాల్ని ప్రశ్నించినవారి గొంతులు నొక్కారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టినవారినీ కేసులతో వేధించారు. విపక్ష పార్టీలు, ఉద్యోగ సంఘాలు నిరసనకు పిలుపునిచ్చినా గృహ నిర్బంధాలు చేశారు.

డీజీపీ హోదా కలిగిన 11 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులను పక్కనపెట్టేసి మరీ కేవీ రాజేంద్రనాథరెడ్డిని ఇన్‌చార్జ్ డీజీపీ (పోలీసు దళాల అధిపతి)గా నియమించిన జగన్ ప్రభుత్వం..రెండేండ్లుగా ఆయన్ను అదే హోదాలో కొనసాగించింది. పూర్తిస్థాయి (రెగ్యులర్) డీజీపీ ఎంపిక కోసం అర్హులైన అధికారుల వివరాలతో జాబితా పంపాలని కేంద్ర హోంశాఖ పదే పదే లేఖలు రాసినా ఖాతరు చేయలేదు. డీజీపీ నియామకం విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలను పట్టించుకోలేదు. వడ్డించే వాడు మనవాడైతే అన్నట్లుగా.. సీనియారిటీలో అట్టడుగున ఉన్నప్పటికీ రాజేంద్రనాథరెడ్డిని ఇన్‌చార్జ్ డీజీపీగా పదవి వరించింది. 1992 బ్యాచ్ అధికారైన ఆయన అదనపు డీజీపీ నుంచి డీజీపీ హోదాకి పదోన్నతి పొందిన కొద్ది రోజుల్లోనే...పోలీసు దళాల అధిపతిగా నియమిస్తూ 2020 ఫిబ్రవరి 15న జగన్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డీజీపీగా ఉన్న గౌతమ్‌సవాంగ్‌ను ఆకస్మికంగా, అర్థాంతరంగా ఆ పోస్టు నుంచి పక్కకు తప్పించి.. ఆ స్థానంలో ఇన్‌చార్జ్ డీజీపీగా కేవీ రాజేంద్రనాథరెడ్డిని నియమించిన జగన్ ప్రభుత్వం నిబంధనలను తుంగలో తొక్కింది.

తెలంగాణలో పదికిపైగా స్థానాలు గెలుస్తాం

(మొదటిపేజీ తరువాయి)

లేకుండా పనిచేస్తున్నారని, దీపావళిరోజు జవాన్లతో కలిసి మిఠాయి పంచుకోవడం ఆయన రాజకీయదక్షతకు నిదర్శనమని తెలిపారు. ముస్లీం రిజర్వేషన్లు తప్ప ఇతర తరగతుల రిజర్వేషన్లు రద్దు చేయమని, ముస్లీం రిజర్వేషన్లు రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు కేటాయిస్తామన్నారు. తన వ్యాఖ్యలను తప్పుగా వక్రీకరించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ప్రచారం చేశారన్నారు. ట్రిపుల్ తలాక్ రద్దుతో ముస్లీం సోదరీమణులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. అయోధ్యలోని రామమందిరంలో బాలరాముడిని ప్రతిష్ఠించిన కార్యక్రమానికి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ఆహ్వానించినా ఓవైసీ ఓటు బ్యాంకు కోసం హాజరు కాలేదని ఆరోపించారు. దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆర్టికల్ 370 తీసేయడంతో కాశ్మీర్ ప్రశాంతంగా ఉందన్నారు. తెలంగాణలో హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. కరోనా లాంటి క్లిష్ట సమయాల్లో సైతం కాంగ్రెస్ రాజకీయాలు చేసిందని, కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేనన్నారు. 70 ఏండ్ల కాంగ్రెస్ చరిత్రలో ఏనాడూ రామమందిరం నిర్మాణానికి అడుగులు వేయలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో నిత్యం బాంబుదాడులు జరిగేవని, పాకిస్తాన్ ఉగ్రవాదులు భారత్ సరిహద్దులోకి చొరబడి సైనికులను హతమార్చిన ఘటనలకు స్వస్తిపలికేలా బీజేపీ పాలనలో సర్జికల్ స్ట్రైక్స్‌తో ఉగ్రవాదుల ఆగడాలు దూరమయ్యాయన్నారు. దాంతో దేశ భద్రతకు భరోసా కల్పించామన్నారు.

హానికరంగా పదేండ్ల బీజేపీ ట్రైలర్

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న భువనగిరి పార్లమెంటు స్థానంలో మాత్రమే పోటీ చేస్తున్నామని, ఇతర ప్రాంతాల్లో ఇండియా కూటమిలో భాగంగా కాంగ్రెస్‌ను బలపరుస్తున్నట్టు తెలిపారు. భువనగిరి పార్లమెంట్ సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ ఆదివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని యాచారం మండలంలోని మంతన్‌గౌరెల్లిలో ప్రారంభమైన ప్రచారం.. మాల్, నల్లవెల్లి, చింతపట్ల, కొత్తపల్లి, నానక్ నగర్, నంది వనపర్తి, చిన్న తుండ్ల, ధర్మన్నగూడ గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన రోడ్ షోల్లో రాఘవులు పాల్గొని మాట్లాడారు. అనంతరం ఇబ్రహీంపట్నంలోని పాషా నరహరి స్మారక కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోనూ ఆయన మాట్లాడారు.

పదేండ్ల మోడీ పాలనలో దేశంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయాలను నడిపిస్తోందన్నారు. దేశంలో బీజేపీ అధికారంలో ఉన్నంతకాలం రాజ్యాంగం ప్రమాదంలోకి నెట్టబడుతుందని చెప్పారు తెలుగు రాష్ట్రాలకు విభజన హామీలను అమలు చేయలేదని, రాష్ట్రాల హక్కులను కాలరాసిందని, నీటిపారుదల రంగానికి సహాయం చేయలేదని విమర్శించారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డును ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. ఉచితంగా రైతులకు ఇస్తున్న కరెంటుకు బదులు వ్యవసాయ బోర్లకు కేంద్ర ప్రభుత్వం మీటర్లను బిగించాలని విశ్వ ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. లక్ష కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం నేడు నిరుపయోగంగా మారిందన్నారు.

అవినీతి చోటుచేసుకుందని సీపీఐ(ఎం) ముందు నుంచి హెచ్చరిస్తున్నా కేంద్రం పట్టించుకోలేదన్నారు. ఈ అవినీతిలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి భాగస్వామ్యం ఉందని ఆరోపించారు. నిర్మాణానికి అనుమతులిచ్చిన సెంట్రల్ వాటర్ కమిషన్ ఎందుకు పర్యవేక్షణ చేయలేదని నిలదీశారు. కులగణననూ అంగీకరించట్లేదని తెలిపారు. దళితుల వర్గీకరణ చేస్తామని చెప్పి మందకృష్ణ మాదిగను మోడీ తన బుట్టలో వేసుకున్నారని చెప్పారు. 254 ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేస్తామని మోడీ 2018లోనే చెప్పారన్నారు. పెట్టుబడిదారులకు రూ.16 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసిన ప్రభుత్వం రైతాంగం పట్ల వివక్ష చూపుతోందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకుంటామన్నారు. చట్టసభల్లో నిజమైన ప్రతిపక్షం అవసరమని, ఆ పాత్ర సీపీఐ(ఎం) పోషిస్తుందని చెప్పారు. మతోన్మాదం సృష్టిస్తూ, విభజన రాజకీయాలు చేస్తున్న మోడీకి ప్రస్తుతం భయం పట్టుకుందన్నారు. అందుకే బహిరంగంగా ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొడుతున్నారన్నారు.

ఇలాంటి సమయంలో తెలంగాణలో బీజేపీని అడుగుపెట్టనీయబోమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఆ ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సైతం పేదలపై నిర్బంధాలు ప్రయోగిస్తున్నదని తెలిపారు. జగిత్యాల మొదలుకొని మహబూబ్‌నగర్ వరకు నిల్వ నీడ కోసం ప్రభుత్వ భూములను ఆక్రమించి ఇండ్లు వేసుకున్న గుడిసెలపై బుల్డోజర్లు పెట్టి ధ్వంసం చేసిందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే రాష్ట్ర ప్రభుత్వంపై సీపీఐ(ఎం) ఉద్యమిస్తుందని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై తన వాణిని, బాణిని వినిపించేందుకే భువనగిరి పార్లమెంటులో సీపీఐ(ఎం) పోటీ చేస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమాల్లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, సీఐటీయూ జాతీయ నాయకులు సాయిబాబు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, రాష్ట్ర సీనియర్ నాయకులు పి.జంగారెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుబ్బాక రామచందర్, కందుకూరి జగన్, పి.అంజయ్య, శ్రీనివాస్ రెడ్డి, శ్యాంసుందర్, సామెల్, జగదీష్, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి సీహెచ్ జంగయ్య, యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ, ఆయా మండలాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చే కుట్ర



(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నారని మమ్మల్ని గోడీ మీడియా ప్రశ్నిస్తోందని తెలిపారు. ఆదివారం ఆదిలాబాద్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజవకర్గాల ఎన్నికల ప్రచారంలో భాగంగా.. నిర్మల్ జిల్లా కేంద్రం, గద్వాల జిల్లా ఎర్రవల్లి చౌరస్తా దగ్గర నిర్వహించిన ఎన్నికల జనజాతర సభలో రాహుల్ గాంధీతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ప్రధాని మోడీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయడం అంటే రిజర్వేషన్లను తొలగించడమేనని చెప్పారు. రాజ్యాంగాన్ని కూలగొట్టడం ద్వారా బీజేపీ రిజర్వేషన్ వ్యవస్థను నాశనం చేయాలని చూస్తోందని విమర్శించారు. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే 50శాతం ఉన్న రిజర్వేషన్లను మరింత పెంచుతామని తెలిపారు. 80శాతం ఉన్న పేదలకు నిధులు అందించడంతో పాటు వారి హక్కులు పరిరక్షిస్తామని భరోసా ఇచ్చారు. తెలంగాణలో ఇప్పటికే ఆరు గ్యారంటీల ద్వారా వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలను దేశంలోనూ అమలు చేసేలా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. కుటుంబంలోని ప్రతి మహిళ ఖాతాలో ఏడాదికి రూ.లక్ష వారి ఖాతాల్లో జమ చేస్తామని హామీనిచ్చారు. ఇందుకు సంబంధించి పేదల జాబితా తయారుచేస్తున్నామని అన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా డిప్లమా, డిగ్రీ, పీజీ చేసిన నిరుద్యోగ యువతకు ఏడాది పాటు శిక్షణ అందించి ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగాలు కల్పిస్తామని, బాగా పనిచేసిన వారికి ఉద్యోగాన్ని పర్మినెంట్ చేస్తామని తెలిపారు. తెలంగాణలో ఆదివాసీలకు భూమి మీద సర్వహక్కులు కల్పిస్తామన్నారు. మంత్రి సీతక్క సూచన మేరకు ఉపాధిహామీ చట్టంలో భాగంగా ప్రస్తుతం సగటు కూలి రూ.250వరకు వస్తుందని, తాము అధికారంలోకి రాగానే రూ.400 చేస్తామని చెప్పారు. మహిళల ఆదాయం రెట్టింపు చేస్తామన్నారు. ఆదిలాబాద్ నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల్లో అభ్యర్థులను గెలిపించి పార్లమెంటుకు పంపించాలని పిలుపునిచ్చారు.

9 లోపు అందరికీ రైతుభరోసా

(మొదటిపేజీ తరువాయి)

భరోసానిచ్చారు. ఇప్పటికే రాష్ట్రంలో ఆరు గ్యారంటీలు ఐదింటిని అమలు చేశామని గుర్తుచేశారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి కర్రుకాల్చి వాతపెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, మంత్రి సీతక్క, తెలంగాణ జనసమితి అధ్యక్షులు కోదండరాం రెడ్డి, ఎమ్మెల్యేలు వెడ్మబొజ్జు, మేఘారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారి, టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్యేలు రాథోడ్ బాపురావు, విఠల్‌రెడ్డి, కోనేరు కోనప్ప, రేఖానాయక్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అధికారిని ట్రాక్టర్‌తో తొక్కించి..

- మధ్యప్రదేశ్‌లో రెచ్చిపోయిన ఇసుక మాఫియా
- వరుస ఘటనలతో అధికారుల్లో భయాందోళనలు



(ఫైల్)

భోపాల్ : బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వఅధికారులకు రక్షణ లేకుండా పోయింది. వారి ప్రాణాలను తీయటానికి కూడా వెనుకాడటంలేదు. తాజాగా మధ్యప్రదేశ్‌లో అక్రమ మైనింగ్‌ను తనిఖీ చేసేందుకు వెళ్లిన ఓ పోలీస్ అధికారిని ట్రాక్టర్‌తో తొక్కి చంపిన ఘటన జరిగింది. సెహ్డాల్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ మహేంద్ర బగ్రీ, ఇద్దరు కానిస్టేబుల్స్ ప్రసాద్ కానోజీ, సంజరు దూబేలతో కలిసి శనివారం ఆ ప్రాంతంలో అక్రమ మైనింగ్ తనిఖీకి వెళ్లారు. వేగంగా వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఆపేందుకు యత్నించగా .. అయనను తొక్కుకుంటూ వెళ్లడంతో మహేంద్ర బగ్రీ అక్కడికక్కడే మరణించారు. ఈ ఘటన నుంచి కానిస్టేబుల్స్ తప్పించుకోగలిగారని అధికారులు తెలిపారు. డ్రైవర్, అతని సహాయకుడిని అదుపులోకి తీసుకున్నామని, ట్రాక్టర్ యజమాని పరారీలో ఉన్నారని అన్నారు.

ట్రక్కు యజమాని గురించి సమాచారం అందించిన వారికి రు.30 వేల రివార్డు ఇస్తామని పోలీసులు ప్రకటించారు. ఇసుక మాఫియాలో కీలక నిందితులు అశుతోష్ సింగ్, సురేంద్ర సింగ్‌లపై కూడా కేసు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు. మధ్యప్రదేశ్‌లో సోన్ నది నుండి ఇసుక అక్రమ రవాణా దందా జోరుగా సాగుతోంది.

గతేడాది నవంబర్‌లో షెహదోల్ ఇసుక మాఫియాకు చెందిన ట్రాక్టర్‌లో రెవెన్యూ శాఖ అధికారి ఒకరు మృతి చెందిన సంగతి తెలిసిందే.

విషాహార భోజనంబు

(మొదటిపేజీ తరువాయి)

యాక్షన్ నెట్‌వర్క్ సీఈఓ దిలీప్ కుమార్ అన్నారు. అలాగే, అధికమొత్తంలోని పెస్టిసైడ్ కలిగి ఉన్న సుగంధద్రవ్యాల దిగుమతి సులభతరం కానున్నదని చెప్పారు. తమకు అందిన పలు విజ్ఞప్తుల ఆధారంగానే పెస్టిసైడ్ పరిమితిని పెంచినట్టు ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలిపింది. అయితే, అలాంటి విజ్ఞప్తులు ఎవరు చేశారన్నదాని గురించి మాత్రం సంస్థ వెల్లడించలేదు.

'ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం'

ఈ పరిమాణ పెరుగుదల కారణంగా సుగంధద్రవ్యాలను వినియోగించేవారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నదని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం సుస్థిరాహారాభివృద్ధి డైరెక్టర్ అమిత్ ఖురానా హెచ్చరించారు. కాగా, సుగంధ ద్రవ్యాల్లో అధిక పెస్టిసైడ్‌ల వినియోగం కారణంగా కొన్ని ప్రముఖ బ్రాండ్లకు చెందిన అమ్మకాలపై హాంగ్‌కాంగ్, సింగపూర్, మాల్దీవులు గతనెల నిషేధం విధించాయి. అయితే, భారత్‌కు చెందిన ఒక కంపెనీ మాత్రం తమ బ్రాండ్ అమ్మకాలపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చింది.

కష్టంగా నీట్ కెమిస్ట్రీ ప్రశ్నలు

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. పరీక్షను మధ్యాహ్న 2గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు నిర్వహించారు. నీట్ పరీక్ష కోసం 24 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్టు ఎన్‌టీఏ వెల్లడించింది. దేశంలో 557 నగరాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా ఇతర దేశాల్లోని 14నగరాల్లోనూ నీట్ పరీక్షను నిర్వహించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో నీట్ పరీక్షను రాశారు. తెలంగాణలో సుమారు 74 వేల మంది దరఖాస్తు చేసుకోగా, ఆంధ్రప్రదేశ్‌నుంచి 60వేల మంది దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం. నిమిషం ఆలస్యం నిబంధనను అమలు చేశారు.మూడు గంటల ముందు నుంచే పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించారు. సాధారణ దుస్తులతోనే పరీక్షకు అనుమతించిన నిర్వాహకులు, మధ్యాహ్నం ఒకటిన్నర తర్వాత విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించలేదు. ఇదిలా ఉండగా ఉదయం 9గంటలకే రిపోర్టింగ్ చేయాలని పేర్కొన్న ఎన్‌టీఏ, స్నాక్స్‌కూడా ఇవ్వక పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

మోడీ మూడోసారి అధికారంలోకొస్తే

దేశాన్ని అమ్మేస్తారు

బీజేపీని గ్రామాల్లో తిరగకుండా తరిమికొట్టాలి

- ధనబలం, ప్రజాసేవ మధ్య జరుగుతున్న పోటీ : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ-చండూరు

మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తే దేశాన్ని స్వదేశీ, విదేశీ కార్పొరేట్ శక్తులకు హోల్‌సేల్‌గా అమ్మేస్తుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండలంలోని తేరట్‌పల్లి గ్రామంలో నిర్వహించిన సీపీఐ(ఎం) గ్రామ శాఖ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద, మధ్య తరగతి ప్రజల సంపదను, వాళ్ల శ్రమను దోచి కార్పొరేట్, ప్రయివేట్ వ్యక్తుల చేతిల్లో బీజేపీ ప్రభుత్వం పెడుతోందని అన్నారు. మోడీ మోసపూరిత మాటలతో మత, దేవుళ్ళ సెంటిమెంట్‌తో ప్రజలను మధ్యపెట్టి మరోసారి అధికారంలోకి రావాలని చూస్తున్నారని విమర్శించారు. బీజేపీకి ఎన్నికల్లో అవకాశం ఇస్తే ఎమర్జెన్సీ తలపించే విధంగా పాలన ఉంటుందని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, పౌరహక్కులను కాపాడుకునేందుకు రేపు జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పినప్పుడే మనుగడ ఉంటుందన్నారు. రాష్ట్రంలో పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్.. ప్రజా సమస్యలను విస్మరించి అహంకారపూరితంగా పాలన కొనసాగించిందన్నారు. పూటకో పార్టీలు మార్చే నాయకులను ఓడించాలని, మునుగోడు నియోజకవర్గ వెనకబాటుకు కారణం గత పాలకులే కారణమని అన్నారు. మూసీ నది ప్రక్షాళన చేయాలని పాదయాత్రలతో పాటు సాగు, తాగునీటి కోసం పోరాటాలు నిర్వహించడంలో కమ్యూనిస్టులు కీలకపాత్ర పోషించారని తెలిపారు. మునుగోడు నియోజకవర్గంలో ఇండ్ల స్థలాల కోసం, గీత కార్మికుల సమస్యల కోసం, పేద ప్రజల సమస్యల కోసం నిరంతరం పోరాడింది కమ్యూనిస్టులేనన్నారు. బీజేపీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా ఉన్న బూర నర్సయ్యగౌడ్‌కు.. గత ఎన్నికల్లో ఎంపీగా ఐదేండ్లు అవకాశం ఇస్తే ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. పార్లమెంటు పరిధిలో చేసిన అభివృద్ధిని చూపించి ప్రజలను ఓట్లు అడగాలన్నారు. ఇక బీఆర్ఎస్, కాంగ్రెస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థులకు నియోజకవర్గంలో ఏ సమస్యలు ఉన్నాయో తెలియదన్నారు. సీపీఐ(ఎం) భువనగిరి ఎంపీ అభ్యర్థి జహంగీర్ మాట్లాడుతూ.. 35 ఏండ్లుగా ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుగా ప్రజా ఉద్యమాల్లో ఉండి పోరాడిన తనకు ఒక్కసారి అవకాశం ఇస్తే నాయకునిగా కాదు.. సేవకునిగా పనిచేస్తానన్నారు. మునుగోడు నియోజకవర్గం సీపీఐ(ఎం) పోరాటాల ఫలితంగా పేదలకు భూములు, ఇండ్ల స్థలాలు సాధించిపెట్టారన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహ, వివిధ మండలాల కార్యదర్శులు నాంపల్లి చంద్రమౌళి, ఏర్పుల యాదయ్య, చండూరు మాజీ మండల కార్యదర్శి బొట్టు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఇండియా కూటమిని గెలిపించాలి

- సీపీఐ(ఎం) ఎన్నికల సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

(మొదటిపేజీ తరువాయి)

మధ్య వైషమ్యాలు సృష్టిస్తున్న ఆర్ఎస్ఎస్, బీజేపీని దేశంలో ఓడించాలని కోరారు. రాష్ట్రంలో బీజేపీకి మనుగడ లేదని, అలాగే, బీఆర్ఎస్ దుకాణం మూసుకున్నట్లేనని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఇండియా కూటమి పేరు వింటేనే మోడీకి చెమటలు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య

ఇండియా కూటమి పేరు వింటేనే ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి చెమటలు పడుతున్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. పదేండ్లు అబద్ధాలతో అధికారాన్ని నెట్టుకొచ్చిన బీజేపీ.. ఇవాళ ఉద్యోగాలు ఇవ్వకపోగా ఇంటింటికి రాముని బియ్యం అందించి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ అమలు చేస్తామని గత ఎన్నికల్లో వాగ్దానం చేసిన బీజేపీ, దాని అమలు చేయకుండా మద్దతు ధర కోసం ఢిల్లీ నడివీధుల్లో పోరాటం చేసిన 750 మంది రైతులను పొట్టన పెట్టుకుందని అన్నారు. గతంలో దేశ సంపదను దోచుకొని మూటగట్టుకున్న వారిని ఈ దేశం నుండి పారిపోవడానికి అవకాశం కల్పించింది నరేంద్ర మోడీ కాదా అని ప్రశ్నించారు. కిరాతకులని, దేశద్రోహులను నరేంద్ర మోడీ రక్షిస్తే, ఆయన్ను ఆర్ఎస్ఎస్ రక్షిస్తుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను చిత్తుచిత్తుగా ఓడించాలని, ఇండియా కూటమిలో భాగస్వామ్యం ఉన్న కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు.

బయ్యారంలో ఉక్కు కర్మాగారాన్ని నిర్మించాలి - సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య

వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారాన్ని నిర్మిస్తే ఇక్కడ వేలాది మందికి ఉపాధి దొరుకుతుందని, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి ఉంటుందని జి.నాగయ్య ప్రభుత్వాలకు గుర్తు చేశారు. ఇండియా కూటమిలో భాగస్వామ్యంగా ఉన్నా సీపీఐ(ఎం) ఎన్నికల తర్వాత ఈ రెండింటి సాధన కోసం ఉద్యమిస్తుందని, ఈ ఉద్యమానికి ప్రజలు సంఘీభావంగా ఉంటూ పోరాటంలో కలిసి రావాలని తెలిపారు. ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సభలో ఎమ్మెల్యేలు డాక్టర్ మురళీ నాయక్, డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్, సీపీఐ(ఎం) వరంగల్ జిల్లా కార్యదర్శి సిహెచ్.రంగయ్య, ములుగు జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, ఇల్లందు నియోజకవర్గం ఇన్‌చార్జి దుగ్గి కృష్ణ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సుర్నపు సోమయ్య, ఆకుల రాజు, గుణగంటి రాజన్న, అలవాల వీరయ్య, కందునూరి శ్రీనివాస్, మండ రాజన్న, బానోతు సీతారాం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలేమాయే : కేసీఆర్

నవతెలంగాణ - జగిత్యాల టౌన్

"ఎప్పుడు గలగల పారే వరద కాలువకు ఏమైందో ఆలోచించాలి.. నీళ్లు లేక పొలాలు ఎందుకు ఎండిపోయినాయో రైతులు గుర్తించాలి.. కరువు తెచ్చిన కాంగ్రెస్‌కు ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో బుద్ధిచెప్పాలి" అని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపునిచ్చారు.జగిత్యాల జిల్లా కేంద్రంలో పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాత్రి నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు.ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు అని చెప్పి ఓటు వేయించుకుని ప్రజలను ఆగం చేశారని విమర్శించారు.ఆరు గ్యారంటీలను ఒక్కటైనా అమలు చేశారా ప్రశ్నించారు. మహిళలకు రూ.2500 ఇస్తున్నామని నిర్మల్ సభలో రాహుల్ గాంధీ చెబుతున్నారని, రాష్ట్రంలో ఏ మహిళకైన పడ్డాయా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏ ఊరికి పోయినా అక్కడి దేవుళ్లపై ఒట్టువేసి ఆగస్టు 15 తరువాత రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెబుతూ.. మరోసారి రైతులను మోసే చేసే కుట్ర చేస్తున్నారని అన్నారు. రైతుబంధు నాటువేసి పంట కోసినాక రైతు బంధు వేస్తామని సీఎం అంటున్నారని, తానేమో పెట్టుబడి సాయం కింద రైతుబంధు అందజేస్తే ప్రస్తుత ముఖ్యమంత్రి వరికోసినాక రైతుబంధు అందజేస్తానని అంటున్నాడని, ఇది తలాతోక లేని మాటని ఆరోపించారు. 5 ఎకరాల భూమి ఉంటేనే రైతుబంధు ఇస్తామని చెబుతున్నారని, మిగతా రైతులు ఎక్కడ పోవాలని ప్రశ్నించారు. వానాకాలం వడ్లు పోయి యాసంగి వడ్లు అమ్ముకునే టైమ్ వచ్చిందని, క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇంకెప్పుడు ఇస్తారని నిలదీశారు. తొమ్మిదేండ్లలో నిరంతరాయంగా కరెంట్, మంచినీరు సరఫరా చేశామని, కానీ ఈ నాలుగు నెలల్లో కరెంట్, నీళ్లు ఎక్కడికి పోయాయని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

కేంద్రంలోని మోడీ.. రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. మోడీ బలవంతుడయితే రూపాయి విలువ ఎందుకు పడిపోయిందని ప్రశ్నించారు. దేశంలోని దళితులు, మైనార్టీలు, గిరిజనులు, మహిళలకు మోడీ ప్రభుత్వం వల్ల లాభం జరిగిందా అని ప్రశ్నించారు. నరేంద్ర మోడీ గోదావరి నీళ్లను తమిళనాడు, కర్నాటకకు తీసుకుపోతానని అనేక సందర్భాల్లో బహిరంగంగానే చెబుతున్నా.. సీఎం మాత్రం స్పందించడం లేదని ఆరోపించారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ఇదే ప్రపోజల్ వచ్చిందని, తెలంగాణ వాటా తేల్చిన తర్వాతే మాట్లాడుతామని, అప్పటి వరకు ఏం పీక్కుంటావో పీక్కో అని అన్నానని తెలిపారు.

కార్మిక వ్యతిరేక, మతోన్మాద బీజేపీని ఓడించండి

- భువనగిరి సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించండి : సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



నవతెలంగాణ-జనగామ

కార్మిక వ్యతిరేక, మతోన్మాద బీజేపీని ఓడించి భువనగిరి పార్లమెంట్ సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించేందుకు కార్మిక వర్గం సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. ఆదివారం జనగామ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో 'పార్లమెంట్ ఎన్నికలు-కార్మిక వర్గం కర్తవ్యం' అంశంపై సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొట్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికలు కార్మికులకు, ఉద్యోగులకు ఎంతో కీలకమైనవని అన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబించిందని, కార్మిక హక్కులను కాలరాసిందని విమర్శించారు. మతం పేరుతో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి కార్మిక వర్గ ఐక్యతకు భంగం చేస్తూ యాజమాన్యాలకు ప్రయోజనం కలిగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ అనుసరించిన విధానాల వల్ల ఆర్థిక అసమానతలు పెరిగాయని, అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతన హక్కులు అమలుకు నోచుకోలేదని అన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచి పేదలపై భారం మోపిందని తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నదని తెలిపారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను యాజమాన్యాలకి అనుకూలంగా సవరణలు చేయడం సిగ్గుచేటన్నారు. సీటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ రమ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ మాట్లాడుతూ.. పదేండ్ల బీజేపీ పాలనలో సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు అంటూ మోసం చేసిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు వారికి కట్టబెట్టేందుకు తీవ్రంగా ప్రయత్నం విమర్శించారు. భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, కార్మికుల హక్కులను కాపాడుకోవాలంటే భువనగిరి పార్లమెంట్ సీపీఐ(ఎం) అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సుంచు విజేందర్, కోడెపాక యాకయ్య, చిట్యాల సోమన్న, అన్నెబోయిన రాజు, జిల్లా కమిటీ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవచిత్రం



నయన్ సారిక, ఆనంద్ దేవరకొండ

పక్కా యాక్షన్ ఎంటర్‌టైనర్

హీరో ఆనంద్ దేవరకొండ తాజాగా నటిస్తున్న చిత్రం 'గం..గం..గణేశా'. ప్రగతి శ్రీవాస్తవ, నయన్ సారిక హీరోయిన్స్‌గా నటిస్తున్న ఈ సినిమాను హై-లైఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మిస్తున్నారు. ఉదయ్ శెట్టి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆనంద్ దేవరకొండ తన కెరీర్‌లో చేస్తున్న ఫస్ట్ యాక్షన్ మూవీ ఇది కావడం విశేషం. ఈ నెల 31న ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రంలోని సెకండ్ సింగిల్ 'పిచ్చిగా నచ్చాశావే'ను మల్లారెడ్డి కాలేజ్ విద్యార్థుల సందడి మధ్య రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా నిర్మాత వంశీ కారుమంచి మాట్లాడుతూ, 'మీ అందరినీ చూస్తుంటే నేను చెన్నైలో చదువుకున్న రోజులు గుర్తొస్తున్నాయి. ఆనంద్ దేవరకొండ మంచి ఫ్రెండ్, రియల్ లైఫ్‌లోనూ హీరో. ఈ సినిమాలో ఆనంద్ క్యారెక్టర్ మీ రియల్ లైఫ్‌లో ఫ్రెండ్ క్యారెక్టర్‌లా ఉంటుంది. ఈనెల 31న మీ ముందుకు వస్తున్నాం. మూవీని తప్పకుండా చూడండి' అని తెలిపారు.

'ఇదొక మంచి క్రైమ్ కామెడీ మూవీ. మీరు మీ ఫ్యామిలీస్‌తో కలిసి ఎంజాయ్ చేసేలా సినిమా ఉంటుంది. మా మూవీని మిస్ కాకండి' అని దర్శకుడు ఉదయ్ శెట్టి చెప్పారు. హీరో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ, 'బేబి' సినిమాలో ఎంత ఏడ్చారో ఈ సినిమాలో నన్ను చూసి అంత నవ్వుతారు. స్క్రిప్ట్ డిఫరెంట్‌గా ఉంటుంది. ట్విస్ట్స్, టర్న్స్ ఉంటాయి. క్రైమ్, కామెడీ, యాక్షన్‌తో మీరంతా ఈ మూవీని బాగా ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు.

రియల్‌స్టోరీతో రాజుయాదవ్



జబర్దస్త్ ఫేమ్ గెటప్ శ్రీను 'రాజు యాదవ్'తో హీరోగా ఆరంగేట్రం చేస్తున్నారు. ఈ చిత్రం ద్వారా కృష్ణమాచారి దర్శకునిగా పరిచయం అవుతున్నారు. సాయి వరుణవి క్రియేషన్స్, చరిష్మా డ్రీమ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై కె. ప్రశాంత్ రెడ్డి, రాజేష్ కల్లెపల్లి సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించారు. ఈనెల 17న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. హీరో తేజ సజ్జా ముఖ్య అతిథిగా హాజరై ట్రైలర్‌ని లాంచ్ చేశారు.

హీరో గెటప్ శ్రీను మాట్లాడుతూ,'దర్శకుడు కృష్ణమాచారి ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. ఉదయ్ చాలా మంచి విజువల్స్ ఇచ్చారు. హర్షవర్ధన్ రామేశ్వర్ బ్లాక్ బస్టర్ మ్యూజిక్ ఇచ్చారు. సురేష్ బొబ్బిలి అద్భుతమైన నేపథ్య సంగీతం అందించారు. నిర్మాత ప్రశాంత్ చాలా ప్యాషన్‌తో ఈ సినిమా చేశారు' అని అన్నారు. 'ఈ సినిమా ఒక రియల్ స్టోరీ. చాలా సహజసిద్ధంగా ఈ సినిమాని తీశాం. ప్రేక్షకులు కొత్త అనుభూతి వుంటుంది. ఎమోషన్స్, ఎంటర్‌టైన్‌మెంట్ ఆకట్టుకుంటాయి. ఈనెల 17న అందరూ రాజు యాదవ్ చూసి, సినిమాని పెద్ద హిట్ చేయాలి. ఫ్యామిలీ అంతా కలసి చూసే సినిమా ఇది' అని దర్శకుడు కృష్ణమాచారి చెప్పారు.

ఒకేసారి రెండు సినిమాలు షురూ



'డైరెక్టర్స్ డే' సందర్భంగా ఇద్దరు కొత్త దర్శకులను పరిచయం చేస్తూ ఈస్ట్ వెస్ట్ ఎంటర్టైనర్స్ సమర్పణలో రెండు సినిమాల షూటింగ్స్ ప్రారంభం అయ్యాయి. హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ఖుషి టాకీస్ బ్యానర్ పై 'సీత ప్రయాణం కృష్ణతో' అనే చిత్రం, మహీ మీడియా వర్క్స్ బ్యానర్ పై 'త్రిగుణి' చిత్రం లాంఛనంగా ముహూర్తం షాట్‌తో మొదలయ్యాయి. ఈ రెండు చిత్రాల ముహూర్తం షాట్స్‌కి తెలుగు చలనచిత్ర దర్శకుల సంఘం అధ్యక్షులు వీరశంకర్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, దర్శకులు దాసరి మారుతి తొలి క్లాప్ కొట్టారు.

ఆ తర్వాత ఈ రెండు చిత్రాల తొలి పోస్టర్లను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో విరాట పర్వం దర్శకుడు వేణు ఉడుగుల, తెలుగు నిర్మాతల మండలి కార్యదర్శి టి.ప్రసన్నకుమార్, డార్లింగ్ స్వామి, రుద్రాపట్ల వేణుగోపాల్, రామ్ రావిపల్లి తదితరులు పాల్గొన్నారు.

ఆద్యంతం కడుపుబ్బ నవ్వించే సన్నివేశాలతో నడిచే ఫ్యామిలీ డ్రామా కథాంశంతో రానున్న 'సీత ప్రయాణం కృష్ణ'తో అనే సినిమాలో నాయకానాయికలుగా రోజా ఖుషి, దినేష్ నటిస్తున్నారు. వీరితో పాటు అనుపమ, సుమంత్, వైభవ్ తదితరులు నటిస్తున్నారని దర్శకుడు దేవేందర్ చెప్పారు. 'త్రిగుణి' సినిమాలో హీరోగా కుషాల్, ఒక ప్రత్యేక పాత్రలో రోజా ఖుషి నటిస్తుండగా, మిగిలిన పాత్రలకు అందరూ కొత్త నటీనటులనే పరిచయం చేస్తున్నామని చిత్ర దర్శకుడు వైతహవ్య వడ్లమాని తెలిపారు. సీత ప్రయాణం కృష్ణతో చిత్రానికి సినిమాటోగ్రఫీ:రవీంద్ర, సంగీతం: హనుమాన్‌త్సవటపల్లి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: చెర్రీ, ప్రొడక్షన్ కంట్రోలర్: రుద్రపట్ల వేణుగోపాల్, చీఫ్ అడ్వైజర్: రామ్ రావిపల్లి, నిర్మాత: రోజా భారతి, డైరెక్టర్ : దేవేందర్. త్రిగుణి చిత్రానికి సినిమాటోగ్రఫీ:సలీం, సంగీతం: హనుమాన్ త్సవటపల్లి, నిర్మాత: మహేశ్వరి, కథ: వంశీ, డైరెక్టర్ : వైతహవ్య వడ్లమాని.

ఆటలు

ఐపీఎల్‌లో నేడు

ముంబయి X హైదరాబాద్

వేదిక : ముంబయి , రా॥ 7.30

స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..

చెన్నై సూపర్‌మచ్చి

- పంజాబ్‌పై ఏకపక్ష విజయం
- రాణించిన జడేజా, తుషార్, సింగ్


చెన్నై 167/9, పంజాబ్ 139/9

చెన్నై సూపర్‌కింగ్స్ అదరహో. గత నాలుగు మ్యాచుల్లో మూడు పరాజయాలు చవిచూసిన సూపర్‌కింగ్స్ ధర్మశాలలో గెలుపు బాట పట్టింది. పంజాబ్ కింగ్స్‌ను చిత్తు చేసి ఏకపక్ష విజయం సాధించింది. 168 పరుగుల ఊరించే ఛేదనలో జడేజా, తుషార్, సిమ్రన్‌జిత్ మ్యాజిక్‌తో పంజాబ్ బ్యాటర్లు చేతులెత్తేశారు. చెన్నై సూపర్‌కింగ్స్ ఏడో విజయం ఖాతాలో వేసుకోగా.. పంజాబ్ కింగ్స్ ఏడో ఓటమిని మూటగట్టుకుంది.

నవతెలంగాణ-ధర్మశాల

రవీంద్ర జడేజా (43, 26 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు) (3/20) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మాయజాలం చేశాడు. జడేజా మ్యాజిక్‌తో పంజాబ్ కింగ్స్ చేతిలో వరుస ఐదు ఓటములకు చెన్నై సూపర్‌కింగ్స్ చెక్ పెట్టింది. ధర్మశాలలో పంజాబ్ కింగ్స్‌ను చిత్తు చేసిన సూపర్‌కింగ్స్ 28 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో పాయింట్ల పట్టికలో టాప్-4లోకి ప్రవేశించింది. 168 పరుగుల ఛేదనలో పంజాబ్ కింగ్స్ చతికిల పడింది. ఓపెనర్ ప్రభుసిమ్రన్ సింగ్ (30, 23 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సులు), శశాంక్ సింగ్ (27, 20 బంతుల్లో 4 ఫోర్లు) మినహా టాప్ ఆర్డర్ బ్యాటర్లు అందరూ విఫలమయ్యారు. జానీ బెయిర్‌స్టో (7), రొసో (0), కరన్ (7), జితేశ్ (0), అషుతోశ్ (3) విఫలమయ్యారు. చెన్నై బౌలర్లు జడేజా (3/20), తుషార్ (2/35), సిమ్రన్‌జిత్ సింగ్ (2/16) మెరవటంతో పంజాబ్ కింగ్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 139 పరుగులే చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 167 పరుగులు చేసింది. రవీంద్ర జడేజాకు తోడు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (32, 21 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), డార్లీ మిచెల్ (30, 19 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఎం.ఎస్ ధోని (0) గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. పంజాబ్ బౌలర్లలో హర్షల్ పటేల్ (3/24), రాహుల్ చాహర్ (3/23), అర్షదీప్ సింగ్ (2/42) రాణించారు.

జడేజా షో : టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన సూపర్‌కింగ్స్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. అజింక్య రహానె (9) మరోసారి నిరాశపరిచాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (32), డార్లీ మిచెల్ (30) రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నమోదు చేశారు. పంజాబ్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేసినా క్రమం తప్పకుండా బౌండరీలు బాదారు. శివం దూబె (0), మొయిన్ అలీ (17) నిరాశపరచటంతో చెన్నై 101/5తో కష్టాల్లో కూరుకుంది. ఈ సమయంలో రవీంద్ర జడేజా (43) ఆదుకున్నాడు. మూడు ఫోర్లు, రెండు సిక్సర్లతో మెరిశాడు. మిచెల్ శాంట్నర్ (11), శార్దుల్ ఠాకూర్ (17) తోడుగా డెత్ ఓవర్లలో రాణించాడు. ఎం.ఎస్ ధోని (0) తొలి బంతికే



నిష్క్రమించగా అభిమానులు నిరాశకు లోనయ్యారు. పంజాబ్ కింగ్స్ బౌలర్లు హర్షల్ పటేల్, రాహుల్ చాహర్, అర్షదీప్ సింగ్‌లు సూపర్‌కింగ్స్ బ్యాటర్లను సమర్థవంతంగా నిలువరించారు. చెన్నై సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 167 పరుగులే చేసింది.



ప్లే ఆఫ్స్‌పై రైజర్స్ గురి

నేడు ముంబయి ఇండియన్స్‌తో ఢీ

ముంబయి : ఐపీఎల్ 17వ సీజన్‌లో అసమాన బ్యాటింగ్ విన్యాసాలతో ఆల్‌టైమ్ రికార్డులు బద్దలు కొడుతున్న జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్. పవర్‌ప్లేలో బీభత్సం సృష్టిస్తున్న సన్‌రైజర్స్ లక్ష్య ఛేదనలో ఓడిపోవటం ఎదుర్కొంటుంది. ప్లే ఆఫ్స్ రేసు రసవత్తరంగా మారటం.. లీగ్ దశలో మరో నాలుగు మ్యాచులే ఆడాల్సి ఉండటంతో బెర్త్ ఖాయం చేసుకునేందుకు హైదరాబాద్ తహతహ లాడుతోంది. కెప్టెన్ పాట్ కమిన్స్‌కు తోడు స్వింగ్‌స్టర్ భువనేశ్వర్ కుమార్, యార్కర్ల హీరో టి. నటరాజన్ సైతం ఫామ్‌లోకి వచ్చారు. సన్‌రైజర్స్ చవిచూసిన బౌలింగ్ కష్టాలు తీరినట్టే కనిపిస్తుంది. ట్రావిశ్ హెడ్, అభిషేక్ శర్మ, హెన్రిచ్ క్లాసెన్, నితీశ్ కుమార్ రెడ్డిలు అంచనాలు అందుకుంటే నేడు వాంఖడేలోనూ పరుగుల వరద పారటం ఖాయమే. ఏడో విజయంపై కన్నేసి హైదరాబాద్ బరిలోకి దిగుతుండగా.. తొమ్మిదో పరాజయం నుంచి తప్పించుకునేందుకు ముంబయి ఇండియన్స్ ఆశపడుతుంది. మ్యాచ్ విన్నర్లతో కూడిన ముంబయి ఇండియన్స్ కొత్త కెప్టెన్ హార్దిక్ పాండ్య సారథ్యంలో ఆశించిన ఫలితాలు రాబట్టలేదు. కీలక బ్యాటర్లు ఎవరూ సరైన సమయంలో రాణించలేదు. 11 మ్యాచుల్లో 8 పరాజయాలు చవిచూసిన ముంబయి ఇండియన్స్ పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచింది. చివరి మూడు మ్యాచుల్లోనైనా మెరిసి పాయింట్ల పట్టికలో స్థానం మెరుగు పర్చుకునేందుకు హార్దిక్‌సేన ఎదురుచూస్తుంది.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886